ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్




# యుగశక్తి  గాయత్రి




ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ

సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి
సాధన నరసింహాచార్య

సంపుటి 15 - సంచిక 8
**జనవరి 2011**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 120**
**3 సం॥ చందా రూ॥ 350**
**10 సం॥ చందా రూ॥ 1116**

Please send Drafts & Money Orders in favour of
SRI VEDAMATA GAYATRI TRUST, BUSINESS DIVISION, HYDERABAD


## అద్వైతము - అమృతానుభూతి

అద్వైతజ్ఞానము నిజానికి ఆత్మ మరియు ఆత్మీయత యొక్క అనంతమైన, హద్దులు లేని వ్యాపకత్వము యొక్క అనుభవము. అందులో జడ-చేతనాలన్నీ స్వయంగా ఆత్మచేతనలో కలిసిపోయి దృగ్గోచరమౌతాయి. పర్వతాలు, నదులు, జలపాతాలు, వృక్షవనస్పతులు, దేవతలు, దానవులు, మానవులు, పశుపక్ష్యాదులేకాక క్రిమికీటకాలలో కూడా తన ఆత్మ ప్రకాశిస్తూ కనపడుతుంది. చిన్న-పెద్ద, బీద-గొప్ప, కులం-జాతి, సమస్త జడ-చేతనాల యొక్క భేదం, మిధ్య మరియు మాయ అనే అనుభవము ఇక్కడ కలుగుతుంది. ఆత్మ యొక్క అనంతమైన విస్తీర్ణ అనుభవమే బ్రహ్మము. కఠోరమైన తపస్సు ద్వారా దీనిని అనుభూతి చెందినవారు 'అహం బ్రహ్మోస్మి' అని తమ అనుభవమును వ్యక్తపరచారు.

అయితే తపస్సు-సాధనలనుండి విముఖులై కేవలము పెద్దపెద్ద గ్రంథాల పుటలను తిరగవేసినవారు ఈ గొప్ప అనుభవాన్ని తమ తర్కంతో వికృతంగానూ, కురూపిగానూ తయారుచేశారు. వారంతా బ్రహ్మోస్మి అనేదాన్ని విస్మరించి అహంలో చిక్కుకుపోయారు. తమ ఈ దారితప్పిన స్థితిని సమర్థించుకొనేందుకు వారు శాస్త్రములు రచించారు, తర్కమును వ్యాప్తిచేశారు. ఈ ప్రభావము ఎక్కడ, ఎవరిమీద పడిందో వారందరి హృదయాలు సంవేదనాహీనంగా మారి శూన్యమౌతూవచ్చాయి. తత్కారణంగా పరిస్థితులు గ్రీష్మకాలం వచ్చినప్పుడు సూర్యుని వేడికి భూమి ఎండి బీటలువారినట్లుగా తయారవుతాయి.

ఈ శూన్యస్థితి నుండి, గొంతును ఎండింపజేసే దాహము నుండి బయటపడటానికి భక్తి అనే వర్షము కురవాలి. అద్వైతజ్ఞానము యొక్క అనుభూతిని వికృతము గావించే ఈ ప్రయత్నాలనన్నింటినీ సమాప్తము చేసేందుకు అనన్యభక్తి కావాలి. అనన్యమునకు అర్థము - ఇతరమైనది లేకుండుట, అదే అనన్యముగా అయ్యింది. ఇంకొకటి ఏమీలేదు, అంతా ఒక్కటైన స్థితి. ఈ మార్గంలో పయనించే భక్తులు ముందుగా భక్తిలో తడిసిముద్దై తనను తాను పరమాత్మునిగా అనగా అనన్యానుభూతి చెందుతాడు. కానీ భక్తుడు తన ప్రియతమమైన పరమాత్మునిలో అనంతానంత బ్రహ్మాండముల యొక్క ఏకాత్మకతను లేక ఏకీకృతరూపమును అనుభూతి చెందుతాడు. అహం నశించిపోగానే పరమాత్మ చేతన యొక్క అద్వైతము స్వయంగానే ప్రకటీకృతమగుటను అనుభవము చెందుతాడు. అద్వైతము యొక్క ఈ తియ్యదనంలో అతనికి కేవలము 'బ్రహ్మోస్మి' అనే అనుభవము కలుగుతుంది. అక్కడ అహం అనేది వెతికినా కూడా కనిపించదు.


పత్రిక అందనివారు ఈ క్రింది నంబరును సంప్రదించగలరు.
**9949111175**

పత్రికకు సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్‌ను సంప్రదించగలరు. **9989659905**


మంచి సలహాను పాటించడం మన యోగ్యతను పెంచుకోవడమే.

# విషయ సూచిక


1. సంపాదకీయం :
అద్వైతము - అమృతానుభూతి 1
2. విషయసూచిక-సద్గురు వచనామృతం :
అన్ని ధర్మముల మధ్య మూలభూత ఏకత్వం 2
3. వేదమంత్రం : ఇచ్ఛాశక్తి 3
4. మనిషిని సిద్ధ పురుషునిగా మార్చే
మహా మంత్రం గాయత్రి 4
5. గాయత్రీ మహా మంత్రంతో గుండె జబ్బులకు చికిత్స 5
6. గాయత్రీ మహా మంత్ర లేఖన ప్రభావంతో జ్ఞాపక శక్తి పెరిగి
మహాత్ముడిగా మారిన ఖుశాల్‌చంద్ గారి యదార్థగాథ 6
7. గాయత్రీ విద్య-3 :
ఆధ్యాత్మికాభివృద్ధికి గాయత్రి ఉపాసన 7
8. బాలల భవితకు బంగారు బాట-15 :
కష్టం లేనిదే సుఖం రాదు 9
9. ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం -
చతుర్థోధ్యాయం : ధన వినియోగము 10
10. యుగ గీత-5 : రెండవ అధ్యాయం-సాంఖ్య యోగము :
ఆత్మోన్నతి 12
11. సూర్య విజ్ఞానం - 4 :
ఋషులందించిన అమూల్యకానుక - మధు విద్య 16
12. భారతదేశము యొక్క జ్ఞాన-విజ్ఞానములు అత్యద్భుతమైనవి 20
13. మనఃశ్శక్తి - మస్తిష్కశక్తి 23
14. గాయత్రీ 24 శక్తి ధారలు (20) : భువనేశ్వరి 29
15. రుద్రాక్ష మహిమ 30
16. ఆదిశక్తి లీలా కథలు-7 : పవిత్ర అంతరంగం
కలిగినవారే శక్తికి పాత్రులు అవుతారు 32
17. ప్రాణశక్తి : తేజోవలయం ఒక అమూల్యమైన విభూతి 34
18. సద్భావనలే జీవితానికి లక్ష్యము, సారము కూడా 36
19. ధారావాహిక-హనుమత్ కథామృతం-31 : భక్తాగ్రేసురుని
స్మరణతో శ్రీరాముని కళ్లు కూడా చెమర్చాయి 38
20. మనం-మన ఆరోగ్యం :
రాబోవు రోజులలో రంగులతో చికిత్స 40
21. పూజ్య గురుదేవుల అమృత వాణి :
పంచకోశ జాగరణ - సిద్ధి ప్రాప్తి 42
22. నా వారితో నా మాట : 2011-2012 జన్మ శతాబ్ది
సంవత్సరం : ఇంకా 38 రోజులే మిగిలివున్నాయి 44
23. ఆరోగ్యమే మహాభాగ్యం-3 : హోమియో వైద్య సేవ 47
24. వేమన వేదం-జీవన నాదం - 3 49
25. వార్తలు 51
26. అక్షరాల ఆట : పదగాయత్రి-3 52




# సద్గురు వచనామృతం

## అన్ని ధర్మముల మధ్య మూలభూత ఏకత్వం

ప్రజలు వాస్తవములను వదిలిబెట్టి అవాస్తవాలపై భేదాభిప్రాయములు కలిగి ఉంటారు. వారు సత్యాన్ని వదిలిబెట్టి దోషాల విషయములపై కొట్టుకు చస్తుంటారు. సత్యాన్ని తెలుసుకోవాలంటే ముందు ప్రతి వ్యక్తి తన సోదరులతో కలహించడం మాని, వారి పట్ల ప్రేమగా ఉదారంగా వ్యవహరించాలి. తన పొరుగువారి ధర్మమును తప్పు అనుకొని, దానిని సమూలంగా నాశనం చేయడం తన కర్తవ్యంగా భావించేవారికి సత్యం ఎలా గోచరిస్తుంది? సత్యం, వాస్తవికత అన్ని కాలాలలో అన్ని దేశాలలో తమదైన రూపంలో ఉంటాయి. పవిత్రుడైన బౌద్ధునికి, పవిత్రుడైన క్రైస్తవునికి ఏమి తేడా లేదు. హృదయంలో శుద్ధత, పవిత్రత, ప్రేమ, దోషరహిత కోరికలు ఇద్దరిలోను కనిపిస్తాయి. బౌద్ధ మతస్తుడి మంచి పనులకు, క్రైస్తవుని మంచి పనులకు తేడా లేదు. పాపానికి చేసే ప్రాయాశ్చిత్తం, చెడు ఆలోచనలు, చెడు కర్మల చేయకూడదనే చింతన (ఆలోచనలు) క్రైస్తవ హృదయాలలోనే కాక అన్ని మతాల వారిలో ఉత్పన్నమవుతాయి. సహృదయత అత్యంత అవసరం, ప్రేమ తప్పనిసరిగా పెంచుకోవాలి. ఒకేరకమైన మూల సిద్ధాంతాల ద్వారా అన్ని మతాలు ఒక్కటే కాని మనిషికి ఈ సత్యాలు పట్టవు. అనుభవానికి, జ్ఞానానికి అతీతమైన ధర్మమీమాంసలలో కొట్టుమిట్టాడుతుంటాడు

*- అఖండజ్యోతి, సెప్టెంబరు 1953*

*అనువాదం : శ్రీ ఊటుకూరి సత్యన్నారాయణ గుప్త*

## పండుగలు

**జనవరి 2011**

| | |
|---|---|
| 15-01-2011 | సంక్రాంతి |
| 26-01-2011 | రిపబ్లిక్ డే |

**ఫిబ్రవరి 2011**

| | |
|---|---|
| 08-02-2011 | వసంత పంచమి |
| 10-02-2011 | రథ సప్తమి |
| 19-02-2011 | శ్రీరామకృష్ణపరమహంస జయంతి |

సుఖం పంచుకుంటే పెరుగుతుంది.

వేద మంత్రం

# ఇచ్ఛాశక్తి

**యేన దేవాః పవిత్రేణాత్మానం పునతే సదా ।**
**తేన సహస్రధారేణ పావమానీః పునన్తు నః ॥**

**– (సామవేదం 1302)**

**భావార్థం :** ఆత్మిక, మానసిక దోషాలను త్యజించి నిర్మలము, పవిత్ర మగుటలోనే మనుష్య జీవన సాఫల్యము ఉన్నది. ఆత్మ బలవిక్షేపమగుటకు వేదములలో అనేక ఉపాయములు వర్ణించబడినవి. అందువలన అవి పఠనీయములు.

**సందేశం :** ఈ మానవ జీవనము ఎన్ని పుణ్యకర్మముల ఫల స్వరూపముగా ప్రాప్తించినదో మనకు తెలియదు. దీనిని సత్కర్మలలో ఉపయోగించినపుడే మనుష్యుడు శాశ్వత ఆనందాన్ని పొందగల్గుతాడు. వేదాలలో అనేక నీతి వాక్యాలున్నవి, వాటి బోధ ఏమిటంటే జీవితంలో మనుష్యుడు ఎల్లప్పుడూ ఎదగాలని. అతడెన్నడూ పతోన్ముఖుడు కాకుండుగాకఅని. ప్రతి మనుష్యుని కర్తవ్యమేమిటంటే అతడు అన్ని దుర్గుణాలను త్యజించగలగాలి. స్వార్థము, లోభము, మోహము, అహంకారము మొదలైన దుర్గుణాలు ఆత్మను చుట్టుముట్టి ఉంటాయి. వీటి నుండి విముక్తి పొందుటకు దృఢ ఇచ్ఛాశక్తి ఆవశ్యకత ఉన్నది. అప్పుడు మాత్రమే ఆత్మ నిర్మలము, పవిత్రము కాగల్గుతుంది.

వేద మంత్రాలలో ఇచ్ఛాశక్తి దృఢత్వము గురించి అత్యధికంగా చెప్పబడింది. తపస్సు, సాధన, కఠిన పరిశ్రమ, మనస్సు లగ్నము చేయుట ద్వారానే మనుష్యుడు తన సమస్త ఇచ్ఛాశక్తులను పొందగల్గుతాడు. మహత్వకాంక్ష మనుష్యుని ప్రాణ శక్తిని తెలియజేస్తుంది, దానితోపాటు త్యాగము, బలిదానముల భావన ఆవశ్యకము. తపస్సు, సాధన ద్వారా మనుష్యుడు ఇటువంటి తన ఇచ్ఛను పూర్తి చేసుకొన్నప్పుడు పరోపకార కార్యములు చేసి తన జీవితాన్ని సఫలం చేసుకోగల్గుతాడు. ఏ వ్యక్తి జీవన సాఫల్యమైనా అతని ఇచ్ఛాశక్తి వికాస నిష్పత్తిలోనే ఉంటుంది. ప్రకృతి శక్తులు కూడా మానవీయ ఇచ్ఛాశక్తి ముందు ఓడిపోతాయి. ప్రపంచములోని సభ్యతా వికాసము, మనుష్యుని సమస్త కార్యకలాపాలు, భౌతిక ఉపలబ్ధులు మానవీయ ఇచ్ఛ ద్వారా లభించినవే.

మనుష్యుని ఈ ఇచ్ఛాశక్తి శీలము నుండి ఉత్పన్నమవుతుంది. ఆ శీలము కర్మల నుండి రూపొందుతుంది. అందువలన ఎటువంటి కర్మలు చేస్తామో, ఇచ్ఛాశక్తి వ్యక్తీకరణ కూడా అటువంటిదే అవుతుంది. నైతిక జీవనం జీవించుట లాభదాయకమని మనకందరకు తెలుసు. కానీ మనం పాపకర్మలు చేస్తున్నాము. తరువాత దాని ఫలం మనం భోగించవలసి వస్తున్నది. కర్మఫలం నుండి తప్పించుకొనే మార్గమే లేదు. మన రోజు వారీ జీవితంలోని మూలభూతమైన ఆపదలకు మూలము ఏదో ఒక దుష్కర్మ కాక మన సంకల్పలోపమని తెలుసుకోవాలి. ఏ వ్యక్తి చెడు ఆలోచనలను జయిస్తాడో అతడు తప్పక తన అమోఘ ఇచ్ఛాశక్తికి యజమాని అవుతాడు.

దారి తప్పి తిరుగుతున్న ప్రాణి తాను ఆత్మయని, శరీరం కాదని తెలుసుకున్నప్పుడు అతడు శక్తిశాలి అవుతాడు. తన ఆత్మలో ఈశ్వరుడు నివసిస్తున్నాడని తెలుసుకొన్నప్పుడు ఆత్మలో అద్భుత ప్రచండశక్తి ఉత్పన్నమవుతుంది. ఈ శక్తే మానసిక దోషాలను వదలివేయుటకు కావలసిన సామర్థ్యాన్ని ఉత్పన్నం చేస్తుంది. దుర్గుణాల నుండి దుష్ప్రవృత్తుల నుండి ముక్తి పొందిన మనుష్యునిలో సాత్విక దివ్య భావధార ప్రవహించి, చెడును ఎదుర్కొనటానికి ఉత్సాహాన్ని ఇస్తుంది.

చెడును మూలంతో సహా పెరికివేయి, మంచిని పోషించు అనే వేదాల ఆదేశమును ఎప్పుడూ గుర్తుంచుకోవాలి.

★★★

## తలపాగా ఎందుకు?

*ఎవరి అంతఃకరణ ఉదారమైనదో వారు ప్రతి చిన్న వస్తువుకు విలువ ఇస్తారు. ఒక రైతు గాంధీ దర్శనార్థమై వచ్చి తలమీద టోపి లేని గాంధీజీని చూచి ఆశ్చర్యంతో లోకమంతా ఖ్యాతి చెందిన గాంధీ టోపి గాంధీ నెత్తిన లేకపోవటమేమిటని ప్రశ్నించాడు. దానికి గాంధీజీ రైతు తలమీదనున్న పాగాను చూస్తూ – ఇంతపెద్ద బట్టను నీవంటివారు తలపాగాగా ఉపయోగించినంతకాలం నాలాంటి వాళ్ళు ఇలా బోడితలతో ఉండక తప్పదని బదులు పలికారు. తలపాగాకి ఉపయోగించే బట్ట కూడా అవసరానికి మించి ఉపయోగిస్తే ప్రజలను దోచుకున్నట్లేనని బాపు మాటలు స్పష్టంగా తెలియజేశాయి. ఆ రైతు పాగాను పరిత్యజించి అశ్రునయనాలతో ఆ మహనీయునికి ప్రణమిల్లాడు.*

*– ప్రజ్ఞాపురాణం నుండి*

**చెడ్డవారిని సంస్కరించడం కష్టమేగాని అసాధ్యం కాదు.**

# మనిషిని సిద్ధ పురుషునిగా మార్చే మహామంత్రం గాయత్రి

గాయత్రీ మంత్రంలో మనం సద్బుద్ధిని ఇవ్వమని పరమాత్మను ప్రార్థన చేస్తాము. శ్రద్ధా విశ్వాసాలతో చేసే ఉపాసన సాధకుని ఆంతరిక చేతనలో, అతని మనసులో, అంతఃకరణలో, మెదడులో, ఆలోచనలో, భావనలలో సన్మార్గంలో పయనించే ప్రేరణ నింపుతుంది.

### గాయత్రీ జపం నుండి పరాధ్వని

గాయత్రీ మహామంత్ర జపం నుండి జనించే పరాధ్వని వాతావరణమంతటిలోని పరమాణువులను కంపింపచేసి శక్తితో నింపుతుంది. ఈ జపంవల్ల సాధకునిలో అద్భుతమైన చేతనాశక్తి జనిస్తుంది. ఆ శక్తి అతడి శరీరంలో, మనస్సులో అద్భుతమైన సంచలనాన్ని సృష్టిస్తుంది. అనంత ఆకాశంలో వ్యాపించి, విశిష్ఠ వ్యక్తులనూ, విశేష పరిస్థితులనూ, వాతావరణం మొత్తాన్నీ ప్రభావితం చేస్తుంది.

### సాధకునిలో సత్‌సంకల్పాల భండాగారం

ఈ విశ్వాసం స్థిరపడినపుడు, సాధకుని ఇచ్ఛాశక్తి ఈ సద్బుద్ధిని సంపాదించడం కోసం ఉవ్విళ్లూరుతుంది. ఈ ఆకాంక్షవల్ల అంతరంగంలో ఒక విధమైన ఆకర్షణ శక్తి జనిస్తుంది. ఈ ఆకర్షణవల్ల ఆకాశమంతటిలోని ఈథర్‌లో ఉన్న సత్‌తత్వాలూ, సదాలోచనలూ, సద్‌భావనలూ, సత్‌ప్రేరణలూ అంతరంగంలో కేంద్రీకృతం అవుతాయి.

ఆలోచనల, ఆకర్షణ శక్తి యొక్క విజ్ఞానం సర్వ విదితమే. ఒకే కోవకు చెందిన ఆలోచనలు, అదే కోవకు చెందిన వానిని ఆకాశంనుండి లాక్కుంటాయి. ప్రపంచంలోని అనాదికాలం నుండి సత్పురుషులు వ్యాప్తి చేసిన సంకల్పాలు శూన్యంలో నిరంతరం తిరుగుతూ ఉంటాయి. అవి గాయత్రీ మంత్ర సాధకుని వద్దకు దేవతల వరాలవలె సునాయాసంగా ఆకాశంనుండి వచ్చి జమ అవుతాయి. కూడబెట్టిన పెట్టుబడివలె వాటి యొక్క పెద్ద భాండాగారం లభిస్తుంది.

కామేంద్రియం, స్వాదేంద్రియం, ఇంద్రియాలలో ప్రధానమైనవి. వీటి నియంత్రణ వల్ల ఆరోగ్య రక్షణ, శరీర అభివృద్ధి సిద్ధిస్తాయి. అంతేకాదు, శ్రమ, స్నానం, నిద్ర, పరిశుభ్రత మున్నగు దినచర్యలలో సత్వగుణం పెరుగుతుంది. ఫలితంగా ఆరోగ్యం, దీర్ఘాయుష్షుల పునాదులు గట్టిపడతాయి.

### గాయత్రివల్ల భయరాహిత్యం

అంపశయ్యపై పడిఉన్న భీష్మ పితామహుణ్ణి యుధిష్ఠిరుడు ఈవిధంగా అడిగాడు. "ఏ మంత్రాన్ని జపిస్తే మనిషికి శాంతి, పుష్టి, రక్షణ, నిర్భయత్వం లభిస్తాయని?" ప్రశ్నించాడు. భీష్మ పితామహుడు ఇలా జవాబిచ్చాడు "ఓ యుధిష్ఠిరా! గాయత్రీ జపం చేసే వ్యక్తికి ధనం, గృహం, ఇతర భౌతిక వస్తువులన్నీ లభిస్తాయి. దుష్టులు, రాక్షసులు, అగ్ని, జలం, వాయువు, సర్పాలు వేటివల్లా అతడికి భయం ఉండదు. నాలుగు వర్ణాలవారు నాలుగు ఆశ్రమాలవారు దీన్ని జపించి సఫలత పొందవచ్చు. ఈ మంత్ర జపం జరిగే చోట పిల్లల అకాల మరణం ఉండదు, ఎవరికీ ఎలాంటి కష్టమూ ఉండదు." (మహాభారత అనుశాసన పర్వం, 150వ అధ్యాయం)

### విద్యారణ్య స్వామికి గాయత్రీ మాత వరం

ఈ యుగానికి వ్యాసుడుగా ప్రసిద్ధి పొందిన విద్యారణ్యస్వామి 24 గాయత్రీ మంత్ర పురశ్చరణలు చేశారు. ఆయన స్థాపించిన విజయనగర రాజ్యం పాటలీపుత్రంతో, హస్తినాపురంతో సాటిఅయిన వైభవాన్ని సాధించింది. సన్యాసం తీసుకున్న తర్వాత ఆయనకు గాయత్రీ మాత ప్రత్యక్షం అయింది. పూర్వ జన్మల పాపం నశించిన తర్వాతనే, గాయత్రీ మాత ప్రత్యక్షమై ఆయనకు వరం ఇచ్చింది. నీవు సద్ గ్రంథాలను రచిస్తావు అని, వేదాలకూ, బ్రాహ్మణాలకూ, దశ ఉపనిషత్తులకూ ఆయన భాష్యాలు వ్రాశారు. పంచదశీ, సర్వదర్శన సంగ్రహ వంటి అనేక గ్రంథాలను రచించారు.

### యుగ నిర్మాణానికి మూలాధారం గాయత్రి

*యుగనిర్మాణానికి మూలాధారం గాయత్రి. ప్రాణములను ఉన్నతం చేసే సాధన గాయత్రీ సాధన. గాయత్రీ ఉపాసనవల్ల అంతరంగం వేగవంతం అవుతుంది; అంతరంగంలోని మాలిన్యం, అంధకారం, అవివేకం అంతరిస్తాయి. సాధకునికి సృష్టి రహస్యం అవగతం అవుతుంది. అతడి భావనలలో దేవత్వం వికాసం పొందుతుంది. అతడి కార్యాలలో శుచిత్వం, పవిత్రత చోటు చేసుకుంటాయి. ఫలితంగా – శాంతి, సువ్యవస్థ, ప్రసన్నత, సంతృప్తులతో నిండిన జీవనగంగ సమాజంలో ప్రవహిస్తుంది.*

**ఇతరుల సుఖాన్ని హరించితే మన సుఖం పోయినట్లే.**

# గాయత్రీ మహా మంత్రంతో గుండెజబ్బులకు చికిత్స

గాయత్రీ మంత్ర ప్రభావంపై జరిగిన అనేక వైజ్ఞానిక పరిశోధనలు ఆ మంత్రం ప్రాణశక్తిని రక్షిస్తుందనీ, పెంపొందిస్తుందనీ నిరూపించాయి. "జబల్పూర్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్"లో గుండెరోగ విభాగ ప్రముఖులూ, ప్రసిద్ధ గుండెజబ్బు నిపుణులూ అయిన డా॥ ఆర్. ఎస్. శర్మ ఈ దిశలో గణనీయమైన కృషి జరిపారు. డాక్టర్ శర్మ రక్తపోటు రోగులకు ఔషధాలు ఇచ్చారు. వారిచేత గాయత్రీ జపం కూడా చేయించారు. ఔషధాల వాడకం, జపం రెండూ చేసిన రోగుల ఆరోగ్యం మెరుగయింది. ఔషధాలు మాత్రమే వాడిన రోగుల ముఖాలు నిస్తేజంగా, అలసినట్లుగా ఉన్నాయి. మధ్య మధ్య వారికి ఇతర రోగాలు కూడా వచ్చాయి. నెలల తరబడి జరిపిన పరీక్షలవల్ల తేలిన విషయం ఇది. ఆ తర్వాత ఆయన మరింత విస్తృతమైన పరిశోధన జరిపారు. ఆయన రెండు రకాల వ్యక్తులను బృందాలుగా ఏర్పరచారు. ఒక బృందంలో ఆధ్యాత్మిక దృష్టి కలిగి గాయత్రీ జపం చేసేవారు ఉన్నారు. రెండవ బృందంలోని వ్యక్తుల జీవన సరళి, ఆలోచనా సరళి పూర్తిగా భౌతికమైనవి. రెండు బృందాలవారి వయస్సు 25-35 సంవత్సరాల మధ్య ఉంది. రెండు బృందాలవారూ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు. ఎవరికీ రక్తపోటు కాని, గుండెజబ్బు కాని లేదు.

ఆధ్యాత్మిక బృందంవారిని రోజూ కనీసం అయిదు మాలల గాయత్రీ జపం చేయమని చెప్పారు. రెండవ బృందం వారికి ఆ నియమం లేదు. మూడు సంవత్సరాలపాటు అధ్యయనం జరిగింది. ఈ లోగా రెండు బృందాలవారికి ఆరోగ్య పరీక్షలు జరుగుతూ వచ్చాయి. తర్వాత ఫలితాలను సమీక్షించారు. జపం చేసిన బృందంవారికి రక్తపోటు, గుండెజబ్బు ఏదీ రాలేదు.

డాక్టర్ శర్మ గుండెజబ్బు రోగులపై కూడా పరిశోధన జరిపారు. ఆ రోగుల గుండె వేగం తీవ్రంగా కాని, అనియమితంగా కాని ఉంది. ప్రతీ రెండు గంటలకు ఒకసారి 108 సార్లు (ఒక మాల) వారిచేత గాయత్రీ మంత్ర జపం చేయించారు. తర్వాతి నెలలో జప సంఖ్యను మూడు మాలలకు పెంచారు. ఇలా కొద్ది నెలలోనే వారి హృదయ (గుండె) వేగం మామూలు స్థితికి వచ్చింది. ఈ మార్పు ఎలా వచ్చింది? ఆయన ఇలా వివరించారు. గాయత్రీ మంత్ర ఉచ్చారణవల్ల అసాధారణ స్థాయి కలిగిన ధ్వని తరంగాలు ఉత్పన్నం అవుతాయి. అవి అటానమస్ నెర్వస్ సిస్టమ్‌లోని సింపథిటిక్ భాగాన్ని ప్రభావితం చేస్తాయి. ఈ భాగం క్రియాశీలం కావడం వల్ల హృదయ (గుండె) వేగం మామూలు స్థితికి వస్తుంది.

డాక్టర్ శర్మ ఈ పరిశోధనయొక్క విస్తృత నివేదికను గౌహతిలో జరిగిన ఆలిండియా మెడికల్ కాన్ఫరెన్సుకు పంపారు. ఆ తర్వాత ఆ నివేదిక ఆ కాన్ఫరెన్స పరిశోధన పత్రికలో ప్రచురితం అయింది. కాన్ఫరెన్సులో ఈ నివేదికపై ప్రశంసలు కురిశాయి. ఇతర రోగాల మీద కూడా గాయత్రీ మంత్ర ప్రభావాన్ని పరిశోధన చేయవలసిందిగా పలువురు నిపుణులు ఆయనకు సూచించారు. ఈ ప్రక్రియద్వారా ఎందరెందరో రోగుల గుండె జబ్బును నయం చేశానని డాక్టర్ శర్మ చెప్పారు.

తమ సాఫల్యానికి కారణాన్ని ఆయన ఇలా వివరించారు. "ఈ జగత్తు అంతా డోలాయమానంగా ఉంది. ఇందులోని ప్రతి వస్తువూ కంపిస్తుంది. మన శరీరం కూడా కంపిస్తుంది. ప్రతి అవయవమూ కంపిస్తుంది. ఈ ప్రకంపనంలో తేడా వస్తే, ఆ అవయవం తన సహజ స్థితిని కోల్పోతుంది. ఈ అసహజ స్థితియే రోగాలకు కారణం. అలాంటి రోగి గాయత్రీ మంత్రాన్ని జపించినపుడు దానివల్ల జనించిన తరంగాలు రోగగ్రస్తమైన అవయవం యొక్క అవ్యవస్థిత తరంగాలను వ్యవస్థితం చేస్తాయి. రోగం నయమవుతుంది. గాయత్రీ మంత్ర చికిత్స, తరంగ ప్రధానమైన చికిత్స. కనుక ఇది అన్ని రోగాలనూ నయం చేస్తుంది". శబ్ద తరంగాల శక్తి అందరికీ తెలిసినదే. ఇన్‌ఫ్రాసోనిక్, అల్ట్రాసోనిక్ తరంగాల శక్తిని శాస్త్ర విజ్ఞానం నేడు ఉపయోగిస్తున్నది. మంత్ర శాస్త్రం ఈ శక్తిని చికిత్సకు ఉపయోగిస్తుంది. గాయత్రీ మంత్రం ఇందుకు ఉత్కృష్ట ఉదాహరణ.

## వేద జనని గాయత్రి

***వేదాలు నాలుగు గాయత్రి పుత్రులు***

*బ్రహ్మదేవుడు ఒక్కొక్క ముఖం నుండి గాయత్రి యొక్క ఒక్కొక్క చరణాన్ని వ్యాఖ్యానించాడు.*

***ఓం భూర్భువః స్వః - ఋగ్వేదం***
***తత్సవితుర్వరేణ్యం - యజుర్వేదం***
***భర్గో దేవస్య ధీమహి - సామవేదం***
***ధియో యోనః ప్రచోదయాత్ - అథర్వవేదం***

***- పండిత శ్రీరామశర్మ ఆచార్య***

**మంచివారికి దగ్గరగా ఉండాలి. చెడువారికి దూరంగా ఉండాలి.**

# గాయత్రీ మహా మంత్ర లేఖన ప్రభావంతో జ్ఞాపక శక్తి పెరిగి మహాత్ముడిగా మారిన ఖుశాల్ చంద్ గారి యదార్థగాథ

ఖుశాల్ చంద్ అనే పిల్లవాడు బాల్యములో పూర్తిగా మందమతి. ఏదీ గుర్తుండేది కాదు. ప్రతిరోజు తరగతిలో బెంచిపై నిలబెట్టి ఉపాధ్యాయుడు శిక్షించేవారు. అట్లే ఇంటికి రాగనే తండ్రి బెత్తపు దెబ్బలు, చీదరింపులు, చీత్కారాలు తప్పేవికావు. ఆ చిన్న వయస్సులో ఈ బాధలు భరించలేక ఆత్మహత్యకు పాల్పడి, ఊరిప్రక్కనున్న నదిలో దూకాడు. నదిలో మునుగుతూ, తేలుతూ రెండు మైళ్ళ అవతల ఒడ్డుకు స్పృహ కోల్పోయిన స్థితిలో చేరాడు. గ్రామస్థులు ఆ బాలుని గుర్తించి ఇంటికి చేర్చి, వైద్యము చేయించగా కోలుకొన్నాడు.

ఒక రోజు ఒక స్వామిజీ ఖుశాల్ చంద్ గ్రామమైన ఉత్తరప్రదేశ్‌లోని జలాల్‌పూరుకు వచ్చి వారితోటలో బసచేశారు. వారికి రోజు రొట్టెలు ఇచ్చి నాన్న ఆదేశానుసారం గేదెలను నదికి తోలుకొని పోయి నీరు త్రాగించి తిరిగి తోలుకుని వచ్చేవాడు. ఒకరోజు ఆ గేదెలు నదిదాటి గట్టు ఆవలనున్న జమిందారు పొలంలో పడి మేసి, పైరును నాశనం చేశాయి. అప్పుడు జమీందారు ఖుశాల్ చంద్‌ను చితకబాదాడు. స్కూలులో దెబ్బలు, ఇటు నాన్నగారి దెబ్బలు భరింపజాలక దేవుని రక్షించమని వేడుకొన్నాడు. నాన్న ఆదేశానుసారం రొట్టెలు తీసుకునివెళ్ళి స్వామీజీ దగ్గర దిగాలుగా, నీరసంగా, నిరాశగా ఒక ప్రక్కన నిలబడ్డాడు.

"ఖుశాల్ ఏమిటలా ఉన్నావు? కారణమేమిటని" ప్రేమగా స్వామీజీ ప్రశ్నించగా, ఖుశాల్ తన దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్వడం మొదలు పెట్టాడు. తరువాత స్వామిజీకి తన దీనగాథను వెల్లడిస్తూ, "ఎంత ప్రయత్నించినా, నాకు ఏదీ గుర్తుండడం లేదు, నేను మందమతిని" అని ఆయనతో మొరపెట్టుకున్నాడు. స్వామిజీ ప్రేమగా, ఖుశాల్‌ను తనదగ్గర కూర్చోపెట్టుకుని, "నీ మతిమరుపు పోగొట్టుటకై మందునిచ్చెదనని, కాగితముపై పెన్సిల్‌తో గాయత్రీమంత్రం వ్రాసి, దీనిని ప్రతిరోజు కనీసం ఒక గంటసేపు వ్రాయమని" మంత్రార్థం కూడా చెప్పారు. స్వామీజీ ఆనతి ప్రకారం అయిదారు నెలలపాటు ఖుశాల్ చంద్ మంత్రలేఖనము వ్రాశాడు. మంత్రలేఖన ప్రభావంతో జ్ఞాపక శక్తి బాగా పెరిగి మంచి మార్కులతో క్లాసులో ప్రథమంగా వచ్చాడు. కాని తన తరగతి ఉపాధ్యాయుడు తాను కాపీ కొట్టాడనే అనుమానంతో హెడ్మాస్టరు గారు దగ్గర ఫిర్యాదు చేశాడు. తను కాపీ కొట్టలేదని, గాయత్రీ మంత్రలేఖనంతో తనకు జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఉత్సాహము పెరిగాయని ఖుశాల్ చెప్పాడు. ప్రతి పరీక్షలో మంచి మార్కులు రాసాగాయి. తానొక కవిత వ్రాయగా ఉపాధ్యాయుడు, తన తండ్రి మెచ్చుకొని చెరియొక బహుమతిని కూడా ఇచ్చారు.

తరువాత మరియొక సంఘటనలో ఖుశాల్ చంద్ మహాత్మా హంసరాజ్‌జీ ఉపన్యాసానికి రిపోర్టు తయారు చేసి ఇవ్వగా, హంసరాజ్ సంతసించి బాలుని లాహోర్‌లోని "ఆర్య గజిట్" పత్రికలో ఉప సంపాదకుడుగా చేర్చుకొన్నారు. కాలక్రమేణా ఆ పత్రికకు సంపాదకుడైనాడు. తదుపరి ఢిల్లీలో హిందీ మిలాప్ అనే హిందీ పత్రికను స్వయంగా స్థాపించి దానికి అధిపతియైనాడు. కార్లు, భవనాలు అన్ని వరాలుగా గాయత్రీ మంత్రలేఖన ఫలముగా ఖుశాల్‌చంద్‌కు లభించాయి. మంచి సంతానం, కోట్ల సంపదలు సమకూరాయి.

ఖుశాల్ చంద్ గాయత్రి ప్రేరణ ప్రకారము గాయత్రీ మాత చూపిన దారిలో, గాయత్రీ జపశక్తిని ఈ యుగానికి చాటిచెప్పిన సజీవమూర్తి-ఆదర్శవ్యక్తి. తరువాత వారు ఆర్య సమాజ్ అగ్ర నాయకులుగా ఆనందస్వామి నామముతో విశ్వ విఖ్యాతినొంది జాతికందించిన సేవలు మరుపురానివి. 92 సంవత్సరాల వయస్సు వరకు ఆయన దేశ విదేశాలలో గాయత్రి ప్రచారం చేశారు. ఆయన "గాయత్రీ మహామంత్ర" మరియు "ఆనంద గాయత్రీ కథ" అనెడి గ్రంథాలు రచించి జాతికందించారు. ఇదీ గాయత్రీ మంత్ర లేఖన మహిమ-మందమతిని మహాత్మునిగా మార్చిన యదార్థ గాథ.

## గాయత్రీ జపం ద్వారా కాలజ్ఞానం

*యోగేశ్వర్‌జీ ఉద్ధద్ జోషి గుజరాత్‌లో ఒక సిద్ధ గాయత్రీ సంత్‌గా ప్రఖ్యాతి పొందారు. నర్మదా తీరంలోని చందోడ్‌లో ఆయన నివసించేవారు. ఒక రోజున ఆయన గురువు ఆయన శిరస్సుపై చేయి ఉంచారు. ఆయనకు పూర్వ జన్మ స్మృతి కలిగింది. గత జన్మలో తాను దయాశంకర్‌ననీ, ఒక సుందరి మోహంలోపడి సాధనా మార్గం నుండి పతనం చెందాననీ, తనకు విషం ఇచ్చి చంపారనీ ఆయనకు తెలిసింది.*

*ఆయన తన సాధనను కొనసాగించి త్రికాలవేది అయినారు. ఆయన నోటి నుండి వెలువడిన మాట అక్షరాలా జరిగేది.*

**ఏ ఆహారం తింటున్నాము అనే దాని కన్నా ఎవరు వండిన ఆహారం తింటున్నాం అనేది ముఖ్యం.**

గాయత్రీ విద్య-3

# ఆధ్యాత్మికాభివృద్ధికి గాయత్రి ఉపాసన

గాయత్రి యొక్క నిత్యోపాసనను ఆధ్యాత్మిక నిత్యకర్మగా భావించవచ్చు. దీని ఆవశ్యకతను శరీరానికి భోజనం, విశ్రాంతి, శ్రమ, శుభ్రత లాంటి అవసరాలతో సమానంగా భావించవచ్చు. ఉపాసన అనగా ఈశ్వరుని సమీపాన కూర్చొనుట, ఆయనతో గట్టి బంధాన్ని ఏర్పరచుకొనుట, ఏకాత్మతను అనుభూతిచెందుట. ఉపాసన వలన భక్తునికి-భగవానునికి మధ్య ఇచ్చి-పుచ్చుకునే ద్వారాలు తెరుచుకుంటాయి. భక్తుడు తన శ్రద్ధను సమర్పిస్తాడు. బదులుగా భగవానుని నుండి శ్రేష్ఠమైన అనుగ్రహాన్ని పొందుతాడు. ఉపాసనా స్వరూపం, ప్రయోజనం ఇదే. నిజమైన ఉపాసన యొక్క ప్రతిఫలం ఉన్నతమైన ఆలోచనలలో, ఆదర్శవంతమైన పనులలో స్పష్టంగా గోచరిస్తుంది. ఎవరికైతే ఈ లాభం చేకూరుతుందో వారు అన్నివిధాలా గొప్పవారౌతారు. దానితోపాటు వారికి జనుల సహకారం, ఈశ్వరుని అనుగ్రహం కూడా అవిచ్ఛిన్నరూపంలో ఉంటాయి. ఎవరైతే ఇంతవరకు సాధిస్తారో వారిని నిజమైన సమర్థులు, సిద్ధపురుషులు అని చెప్పవచ్చు. ఆత్మికప్రగతి క్రమములో - ఉపాసన అనే బీజారోపణ చేసి, జీవన సాధన అనే ఎరువు-నీరు అందిస్తూవుంటే క్రమంగా ఆత్మికవృద్ధి జరిగి, దాని ఫలపుష్పాల లాభాలను పొంది మనుష్యులు ధన్యులౌతారు.

ఉపాసన కొరకు ఆద్యశక్తి గాయత్రిని ఆశ్రయించుట అతి ఉత్తమం. భగవంతుని ప్రజ్ఞారూపంలో హృదయంగమం చేసుకునేవారు ఉచ్చస్తరీయ లాభాలను పొందుతారు. బంధుత్వాలలో తల్లితో గల బంధం ఇతర సమస్త బంధుత్వాలకన్నా ఉన్నతమైనది. గాయత్రి అక్షరాలలో ఇమిడివున్న తత్త్వజ్ఞానం, శక్తి యొక్క మేళవింపు ఎంత గొప్పవంటే వాటిని సొంతం చేసుకున్నవారి ఉత్కృష్టత సర్వతోముఖంగా పెరుగుతూనే వుంటుంది. భారతీయ సంస్కృతికి ఆధారం, ఆరాధనా స్వరూపం గాయత్రీ మంత్రమే!! శిఖ-యజ్ఞోపవీతాలు గాయత్రికి సంకేతాలు. సార్వజనిక ఉపాసనను సంధ్యావందనం అంటారు. అందులో గాయత్రీ మంత్రమే ప్రధానమైనది.

గాయత్రీ ఉపాసనావిధి సరళమైనది. దీనికి శరీరం, వస్త్రములు, పూజాసామాగ్రి యొక్క పవిత్రత అవసరం. పూజావేదికమీద గాయత్రీమాత చిత్రపటాన్ని ఉంచాలి. అగ్ని-జలములకు సాక్షిగా అగరబత్తీ వెలిగించి, చిన్న జలకలశాన్ని స్థాపించాలి. జలం, అక్షతలు, పుష్పాలు, గంధం, నైవేద్యం మున్నగు పూజా సామాగ్రిని కూడా వేదికమీద ఉంచాలి. పంచపాత్ర, చెంచా, వస్తు సమర్పణకు చిన్న ప్లేట్ కూడా అవసరము. ఆత్మశుద్ధికి పవిత్రీకరణ, మూడు ఆచమనాలు, శిఖాబంధనం, ప్రాణాయామం, న్యాసం, పృథ్వీ-పూజనం అనే షట్కర్మలను చేయాలి. షట్కర్మలలో సత్కర్మ, సద్జ్ఞానం, సద్భావనలను వృద్ధిచేసే మరియు పవిత్రత, తీక్షణతలను పెంచే ప్రేరణ ఉంది. జలం నుండి స్వచ్ఛత(పవిత్రత), అక్షతలనుండి అంశదానం, పుష్పాల నుండి ప్రఫుల్లత, చందనం నుండి పరమార్థపరాయణత, నైవేద్యం నుండి చక్కని వ్యవహారశైలికి తగిన జ్ఞానం గ్రహించబడతాయి. ఉత్కృష్టతను పెంచే ఈ క్రమమే ఆత్మను పరమాత్మవరకు చేర్చుటకు సమర్థవంతమైనది. ప్రపంచం, సమాజ సేవా-పూజలకు మొట్టమొదటగా పృథ్వీదేవతాపూజ చేయబడుతుంది.

ఈ తథ్యమును దృష్టిలో ఉంచుకుంటూ మొదటగా ఆత్మశోధన తర్వాత దేవ-పూజన చేస్తూ కర్మకాండను ముందుకు కొనసాగించాలి. స్థానం, సమయం, సంఖ్యలను నియమితంగా ఉంచుట వలన నిష్ఠ పరిపక్వమౌతుంది. సత్పరిణామం యొక్క సఫలత సునిశ్చితమౌతుంది. అస్థిర-అనియమిత క్రమంలో ఉపేక్ష-అశ్రద్ధా ఆవరిస్తాయి. భోజన-శయనాదులతోపాటు ఉపాసనను జోడించవచ్చును. ఏ రోజు ఈ ఆధ్యాత్మిక నిత్యకర్మను పూర్తిచేయలేదో ఆ రోజు భోజన-శయనాదులను కూడా నిలిపివేయాలి. ఇలా చేయుటవలన మనోబలం పెరుగుతుంది. శ్రద్ధ పరిపక్వమౌతుంది. సాధనలో సఫలతకు శ్రద్ధా-నిష్ఠలను మనస్సులో నింపుకోవాలి. పైన చెప్పబడిన నియమాలను-క్రమశిక్షణను కఠోరంగా పాటించుటచేతనే విశ్వాసం పరిపుష్టమౌతుంది. సార్థకమైన ఉపాసనకు దీని ఆవశ్యకత ఎక్కువగా ఉంటుంది, జప సంఖ్యను లెక్కించుటకు మాల ఉపయోగపడుతుంది. గడియారంతో కూడా ఈ అవసరాన్ని పూర్తిచేసుకోవచ్చు.

గాయత్రీ జపాన్ని ఈప్రకారంగా 5 లేక 24 సార్లు చేయుటతోనే కొద్ది లాభం కలుగుతుంది. కానీ పూర్తి లాభాన్ని పొందుటకు ఎక్కువ సమయం అనగా అర్ధగంట జపం చేయాలి. అరగంటలో ఐదు మాలల జపం పూర్తవుతుంది. ఇంకా ఎక్కువ

**ఇవ్వడానికి ఏదైనా ఉన్నప్పుడే తీసుకోవడం భావ్యం.**

జపం చేస్తే మరింత ఉత్తమం. జపం చేస్తున్నప్పుడు పెదవులు, కంఠం కదులుతువుండాలి, కానీ ఉచ్చారణమాత్రం సమీపంలో కూర్చున్న వ్యక్తికి కూడా వినపడనంత నెమ్మదిగా చేయాలి.

గాయత్రీ జపంతోపాటు ధ్యానం చేయుట అవసరం. ధ్యానం – సాకార, నిరాకారములని రెండురకాలు. గాయత్రీమాత చెంతన, ఆమె కొంగు నీడలో కూర్చున్న ఉన్న లేక శరణాగతి చేస్తున్న భావనతో సాకారధ్యానం చెయ్యాలి. నిరాకారధ్యానం–ప్రాత:కాలంలో ఉదయిస్తున్న స్వర్ణిమ సూర్యుడిని సవితా రూపంలో చెయ్యాలి. జప సమయంలో మనస్సును ఖాళీగా ఉంచరాదు. అట్లుకాక, మనస్సు ఇటు–అటు పరిగెత్తితే ఉపాసన యొక్క మహత్వం దెబ్బతింటుంది. జపంతోపాటు ధ్యానం కూడా జరగాలి. ఇందులో శరీరాన్నే కాదు, మనస్సును కూడా భగవంతుని ప్రయోజనాలలో తప్పక నిమగ్నం చెయ్యాలి. సాకారధ్యానంలో మాత పాదాలవద్ద శ్రద్ధను సమర్పించాలి. ఆదర్శముల యొక్క పాలన చేస్తూ, వ్యక్తిత్వమును దైవీ ప్రయోజనాలకు అనుకూలంగా మార్చుకుంటున్నాను అనే భావన మనస్సులో మెదులుతూ ఉండాలి. ఉత్కృష్టతను ఆశ్రయించుటకు, ఉదాత్త దృష్టికోణం మరియు ఉచ్చస్తరీయ ఆచరణ కొరకు తగిన లేక కోరుకున్న ధైర్యమును పొందాలి అని ఆశిస్తూ, ఆలోచనలను ఆ భావనలో నిమగ్నం చేయాలి.

నిరాకారధ్యానంలో ప్రభాత సమయంలోని బంగారురంగు సూర్యధ్యానం చెయ్యబడుతుంది. సాధకుడు బాల్యావస్థలో ఆచ్ఛాదనా రహితంగా ఉంటాడు. సూర్యకిరణాలు శరీరంమీద పడి, నెమ్మదిగా లోనికి ప్రవేశించి బాలకుని అణువణువును ప్రభావితం చేస్తాయి. జపం చేసే సమయంలో, నిరాకార ధ్యాన, ధారణా ప్రక్రియ ఇదేవిధంగా చెయ్యబడుతుంది. సవితయొక్క తీక్షణమైన ప్రేరణ జ్యోతి కిరణాల రూపంలో శరీరంలోకి ప్రవేశిస్తున్నది అనే భావసంవేదనలతో మనస్సు నిండివుండాలి. ఆ దృశ్యమును ప్రయత్నపూర్వకంగా అనుభూతిలోకి తెచ్చుకొనుటకు ప్రయత్నించాలి. స్థూలశరీరంలో ప్రవేశించిన సూర్యకిరణాలు నాభి కమలం ద్వారా ప్రాణశక్తిని జాగృతం చేసి సంయమం, స్ఫూర్తి, సత్కర్మలకి ప్రేరణను అందిస్తాయి. సవితయొక్క జ్యోతి సూక్ష్మశరీరంలో, కమలం ద్వారా హృదయంలో ప్రవేశించి ప్రజ్ఞను జాగృతం చేస్తుంది. తద్వారా సంతులనం, వివేకం, దూరదృష్టి కల ఆలోచనావిధానం వికసిస్తాయి. సూర్య జ్యోతి కారణశరీరంలో, మస్తిష్కపు గుహలో బ్రహ్మరంధ్రంలో ప్రవేశించినప్పుడు పురుషార్థంలో నిష్ఠ, ఆదర్శాలలో శ్రద్ధ, ఉదారతలో ప్రఫుల్లతా అనుభవమౌతుంది. స్థూల–సూక్ష్మ–కారణశరీరాలలో నిష్ఠ, ప్రజ్ఞ, శ్రద్ధలు వికసించి, వృద్ధిచెందుతాయి. (ఇదే సవితాధ్యాన క్షేత్రం యొక్క విశాలత) జప సమయంలో ఆలోచనలు పైన చెప్పిన భావనలలోనే కలిసిపోవాలి. ఇందులో మానసిక ఏకాగ్రతతో ఒక దిశాధారను అవలంబించే అభ్యాసం ఉంటూవుండాలి.

జప సంఖ్య పూర్తయిన తర్వాత విసర్జన నిమిత్తం జల–పుష్పాదులను విడవాలి. సూర్యునికి ఎదురుగా నిలబడి జలకలశం నుండి అర్ఘ్యదాన మియ్యాలి. అర్ఘ్యమిచ్చు సమయంలో కలశంలో నిండివున్న సాధనలనే జలమును తేజస్వియైన పరబ్రహ్మ చరణాలవద్ద సమర్పిస్తూ పరబ్రహ్మను భావనాత్మకంగా ఇలా ప్రార్థించాలి. 'దేవా! వీటిని స్వీకరించి, వాయువులో నింపి సృష్టిలో సరసత, ఆర్ద్రతలను పెంచేందుకు విస్తృతక్షేత్రంలో వితరణ చెయ్యి'. సంకీర్ణస్వార్థపరతను విరాట్ బ్రహ్మలో కలగలిపే ఆకాంక్ష సూర్యార్ఘ్యదానంలో వ్యక్తీకరించబడుతుంది. ఇదే నిత్యోపాసన క్రమం. ఇందులో కర్మకాండతోపాటు ఆలోచనల, భావనల ఉచ్చస్తరీయ సమన్వయం ఉండాలి.

*– అఖండ జ్యోతి ఫిబ్రవరి, 2004*

*– అనువాదం : లక్ష్మీరాజగోపాల్, ఒంగోలు*

## స్త్రీలని గౌరవించు

*నెపోలియన్ ఈలెరెస్ అనే మహలులోని స్నానాల గదిని మరమ్మత్తు చేయించాడు. మహల్ అధికారులు ఫ్రాన్స్‌లోని మంచి చిత్రకారుల ద్వారా అందమైన చిత్రాలు వేయించారు. ఒకరోజు నెపోలియన్ ఆ స్నానాగారానికి స్నానం చెయ్యడానికి వెళ్ళాడు. అక్కడ గోడలపై స్త్రీల చిత్రాలు వ్రేలాడదీయబడి ఉన్నాయి. స్నానం చెయ్యకుండానే వెనుదిరిగి వచ్చి అధికారులతో ఇలా అన్నారు. "స్త్రీలని గౌరవించడం నేర్చుకోండి. స్నానాగారంలో స్త్రీల విలాసవంతమైన చిత్రాలు పెట్టివారిని అవమానించకండి. ఏ దేశంలో స్త్రీలని విలాస వస్తువులుగా భావిస్తారో ఆ దేశం నాశనమవుతుంది."*

– ప్రజ్ఞా పురాణం నుండి

**సద్భావనలతో సత్కర్మలు చేసే వ్యక్తులు భగవంతునికి ప్రియమైన వారు.**



## బాలల భవితకు బంగారు బాట-15

# కష్టం లేనిదే సుఖం లేదు

జీవితంలో ఏ శిఖరాన్ని అధిరోహించాలన్నా కొంత కష్టాన్ని, కొంత నష్టాన్ని భరించక తప్పదు. కష్ట నష్టాలను ఎదుర్కోవడంలో ఇష్టాన్ని చూపించకపోతే సుఖాన్ని పొందలేం. అనుకున్నది సాధించలేం. విజయాన్ని పొందిన తర్వాత మొదట్లో పడిన కష్టాన్ని పూర్తిగా మరచిపోతాం. ఇది లోక సహజం. జీవిత రహస్యం.

ఉదాహరణకు మీకు ఒక చిన్న చెల్లాయో, తమ్ముడో కావాలని ఉంటుంది. లేచిన దగ్గర నుండి దేవునికి మనస్సులోనే మొక్కుకుంటూ ఉంటారు. మీ అమ్మంటే మీకు చాలా ఇష్టం. ఆమె కష్టపడితే మీకు కళ్లల్లో నీళ్లు తిరుగుతాయి. మీకు చెల్లాయినీ, తమ్ముడినో ఇవ్వాలంటే అమ్మ చాలా కష్టపడుతుందని తెలుసు. ఒక్క బిడ్డను ఇవ్వాలంటే అమ్మ ఎంత కష్టపడుతుందో టి.వి.ల్లో, సినిమాల్లో చూస్తూనే ఉంటారు. అమ్మ ఏడిస్తే మీరు ఏడుస్తారు. అయినా మీ కోరిక చావదు. చెల్లాయి చేతికి వచ్చాక కలిగే ఆనందాన్నే ఊహించుకుంటారు. దాన్నే కోరుకుంటారు. దీన్ని బట్టి మీకు ఏం తెలుస్తున్నది? కష్టం లేనిదే సుఖం లేదు అని కదా!

కష్టాన్ని ఇష్టంగా చేసుకుంటేనే జీవితం సఫలం అవుతుంది. ఒక రకం పక్షిజాతిలో తల్లి గూడుకట్టి పిల్లల్ని పోదుగుతుంది. వాటికి కావలసిన ఆహారాన్ని బయటి నుండి తెచ్చి పెడుతుంది. సుఖాన్ని మరిగిన పిల్లలు హాయిగా గూట్లోనే నిద్రపోతూ ఉంటాయి. ఈ విషయాన్ని తల్లి గమనిస్తుంది. చిన్న చిన్న ముళ్లు తెచ్చి పిల్లల పొట్ట కింది పెడుతుంది. కదిలినప్పుడల్లా అవి గుచ్చుకోవడం మొదలుపెడతాయి. ఆ బాధను భరించలేక పిల్లలు రెక్కలు ఆడిస్తూ పైకి ఎగరడానికి ప్రయత్నిస్తాయి. మెల్లమెల్లగా పైకి ఎగిరిపోతాయి. అప్పుడు తెలుస్తాయి ఆ పిల్లలకి కష్టంలోని విలువ, రెక్కల యొక్క అవసరం. దీన్ని బట్టి మీకు ఏం తెలుస్తోంది? ముల్లు వల్ల అనుభవించిన కొద్దిపాటి కష్టమే స్వతంత్రంగా, హాయిగా జీవించడానికి ఉపయోగించింది అనే కదా!

జీవితంలో కొద్దో గొప్పో కష్టాలు అనుభవిస్తేనే దైవస్మరణ మీదకు మనస్సు మళ్లుతుంది. అప్పుడే పాపభీతి కలుగుతుంది. తప్పుడు పనులు చెయ్యం. మంచి పనులను ఎంచుకుంటూ ఉంటాం. అందువల్ల మరికొందరికి లాభం చేకూరుతుంది. దానితో కొంతమందికి ఆదర్శం అవుతాం. ఆదర్శ జీవితంవల్ల ఆనందం వెల్లివిరుస్తుంది. అందువల్ల జీవితంలో ఎదురయ్యే కష్టాలను ఏవగించుకోకూడదు. వాటిని ఇష్టాలుగా మార్చుకుని జీవించడంలోనే జీవిత పరమార్థం దాగి ఉంది. కష్టం లేకుండా సుఖాలు కావాలనుకోవడం మూర్ఖత్వమే అవుతుంది.

బాలలూ! భవిష్యత్తును బంగారు బాటలో నడిపించాలంటే మీరు ముందుగా కష్టపడక తప్పదు. ఉదాహరణకు పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగం చెయ్యాలంటే ముందుగా కష్టపడి చదవాలి. ఏదైనా వృత్తి విద్యలో నైపుణ్యం సంపాదించాలంటే ముందుగా కష్టపడి నేర్చుకోవాలి. తర్వాత దానిలో సాధన చేయాలి. దైవసాన్నిధ్యాన్ని పొందాలి అంటే ముందుగా కఠినంగా సాధన చేయాలి. సమాజంలో పేరు ప్రతిష్ఠలు పొందాలి అంటే ముందుగా కష్టాలను ఎదుర్కొంటూ ఇష్టంతో సమాజానికి సేవ చేయాలి. తర్వాత తరతమ భేదాలను మరచి స్వచ్ఛందంగా అన్ని రంగాలలో పాల్గొనాలి. గతంలో పైకి వచ్చిన వారంతా కష్టాలను ఎదుర్కొన్నవారే. వారి సాధనలో ఎదురైన కష్టాలను ఇష్టాలుగా మార్చుకున్నవారే.

తల్లిని కష్టపెట్టి తాను ఏడుస్తూ శిశువు ఈ లోకంలోకి వస్తాడు. వెళ్లిపోయేనాడు తన చుట్టూ ఉన్నవారిని ఏడిపిస్తూ వెళ్ళిపోతాడు. దీనిని బట్టి జీవి యొక్క ఆద్యంతాలు కష్టంతోనే నిండి ఉన్నాయని తెలుస్తోంది. అదే కష్టాన్ని మనం ఇష్టంగా చేసుకుని జీవించాలి. అదే అధ్యాత్మతత్త్వం కూడా.

**కం॥ కష్టపడుచునుండ మిగుల**
**ఇష్టంబు గలుగును దాని నెరుగగవలయున్**
**కష్టమునకు వెరువ వలదు**
**కష్టపడిన చోట కీర్తిగనుమో బాలా!**

★★★

**ఆదర్శాలకు అంకితం కావడం దైవత్వానికి కొలబద్ద.**

ధారావాహిక ప్రజ్ఞోపనిషద్ : ప్రథమ మండలం-చతుర్థోధ్యాయం

# ధన వినియోగము

**దేశవాసీజనానాం చ స్తరం హి ప్రతిపూరుషమ్ ।**
**గృహ్ణన్ స్వకీయనిర్వాహః స్వీకర్తవ్యః సదైవ చ ॥ 50**

మానవులు మనోయోగం ద్వారా సాధించిన ధర్మాన్ని, నీతివంతమైన మార్గంలో, సదాశయాలలో నిస్సహాయులకు సహాయం చేసే సంకల్పాన్ని కల్గి ఉండాలి. తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ, ఇతరులకు తోడ్పాటును అందించడమే కర్తవ్యంగా భావించాలి. స్వప్రయోజనంతోపాటు సామాజిక ధర్మాన్ని పాటించగలగాలి.

**మితవ్యయిత్వమాగృహ్ణన్ యోగ్యతామత్ర వర్ధయన్ ।**
**సదాశయత్వమార్గేణ భరితవ్యాస్తు దుర్బలాః ॥ 51**

మితముగా ఖర్చుపెట్టడం, యోగ్యతనుబట్టి ప్రోత్సహించుట, సదాశయ మార్గంలో నడుస్తూ, సహాయం కోరేవారికి సాయపడడం అనే లక్షణాలు భౌతిక ప్రగతితోబాటు ఆత్మప్రగతికి తోడ్పడుతుంది. వీటివలన జీవనోపయోగము, సామాజిక ఉపయోగము నెరవేరే అవకాశం కలుగుతుంది. అందువలన దైవప్రసాదాలైన శ్రమ, సమయము తద్వారా మనోయోగముల‌ద్వారా సంపాదించే సంపదలు కాలదేవత, శ్రమదేవతలను సమన్వయ పరుస్తూ, సమయాన్ని వృథాచేయక సద్వినియోగం చేయగలగాలి.

**నైక ధోతృద్యతే భూయో దుష్ప్రవృత్తిస్తతః క్రమాత్ । 52**
**అపవ్యయేన మన్యేతే దుష్ప్రవృత్తిరనేకధాః ।**
**క్రీణంతి చాత్మనోన్యేషామహితం కుర్వతే భృశమ్ ॥ 53**

అనవసరమైన, ఆడంబరమైన కోరికలను కల్గి ఉండడంవల్ల, వాటిని నెరవేర్చుకునే ఆలోచనలతో మనస్సు వక్రమార్గాన పడుతుంది. అటువంటి చెడ్డమనస్సు అక్రమమార్గాలను అన్వేషించి, చెడు మార్గంలో పయనించమని ఉసికొల్పుతుంది. సజ్జన ప్రవృత్తికి అనుగుణంగా అవసరమైన, నిరాడంబరమైన కోరికలతో ఆత్మసంతృప్తితో సుఖజీవనాన్ని పొందేటట్లు తీర్చిదిద్దబడుతుంది. వివాహాది వేడుకలలో ఆర్భాటాలు, విలాసవంతమైన అలవాట్లు, అదుపులేనిఖర్చుల వల్ల మనిషి పెడత్రోవలో పయనించి నిజమైన మనశ్శాంతిని కోల్పోతాడు. పరవళ్ళు త్రొక్కుతున్న నదులు ఎన్ని కలిసినా, సముద్రానికి వరదలు ఉండవు. నిత్యం, ఆటుపోట్లతో, బడబాగ్నులతో కూడిఉన్నప్పటికీ, తన ఉప్పు నీటిని మంచినీరుగా మార్చడం కొరకు, మేఘనిర్మాణం కొరకు తన నీటిని, త్రాగడానికి ఉపయోగపడే రీతిలో మార్చి ఆత్మసంతృప్తి చెందుతుంది. కావున వాంఛలను అదుపుచేసే ఆత్మనిగ్రహశక్తి అవసరం.

**ధనార్జనే యథా బుద్ధే రపేక్షా వ్యయకర్మణి ।**
**తతోఽ ధికైవసాపేక్ష్యా తత్రౌచిత్యస్య నిశ్చయే ॥ 54**

మానవ జీవనం పరిపూర్ణత చెందాలంటే, దానికి తగిన ప్రణాళిక అవసరం. జీవించడం కొరకు సంపాదించేతత్త్వం రావాలి. అంతేకాని సంపాదన కోసం జీవించే స్థితి రాకూడదు. ధనం మనిషికి ఇంధనం కావాలే కానీ, మనిషి ధనానికి బానిస కాకూడదు. సంపాదనతోబాటు, ఖర్చు విషయంలో ఔచిత్య, అనౌచిత్యాలను పాటించినప్పుడే "సంపద"కు సార్థకత లభిస్తుంది. అది సంపాదనకు పరిపూర్ణ సార్థక్యం కల్గిస్తుంది.

**ఉపేక్షానార్జనే కార్యా నచానీతిర్వ్యయే తథా ।**
**సమాన్యతాం సాధుతాం సత్పరిణామాన్ విచింతయేత్ ॥ 55**

సంపాదన, వ్యయం. ఈ రెండు విషయాలలో మనస్సుకు అదుపు ఉండాలి. అప్పుడే ఎంతవరకు అవసరమో అంతే సంపాదించి, తదనుగుణంగా ఖర్చుపెట్టే అవకాశం ఉంటుంది. పశుపక్ష్యాదులు తమ అవసరానికి మించి ఆహారాన్ని సంపాదించవు. అందుకే చీకు, చింతా లేకుండా, అవి హాయిగా ఉంటాయి. సాధు ప్రవృత్తి కల్గినవారు ధనానికి, ఆడంబరాలకు అతీతంగా ఉంటారు.

**అన్యథా ఘాతకా సిద్ధ్యత్యలం సంపన్నతాతు సా ।**
**దారిద్ర్యాపేక్షయా నూనం సమాజస్తేన దూష్యతే ॥ 56**

భగవంతుని సృష్టి ప్రకారం ధనవంతులు, నిరుపేదలు అనే భేదాలు లేవు. కేవలం మానవుల చిత్తవృత్తి, ఆదాయ వ్యయాలను బట్టి అవి ఏర్పడతాయి. "డబ్బు" మాయ పొరలాంటిది. దానిని సక్రమంగా ఉపయోగించుకున్నప్పుడు అది కంటికి అంజనం (కాటుక) లాగ ఉపయోగపడి, చక్కటి దృష్టిని ఇస్తుంది. అదే మితిమీరిన వాంఛల వల్ల పొరలు కమ్మి, మనస్సును, దృష్టిని పెడత్రోవ పట్టిస్తాయి. దానివల్ల సంపన్నులు, నిరుపేదలనే వర్గభేదం ఏర్పడి, అనవసరమైన పొరపొచ్చాలు ఏర్పడి సమాజం

**లక్ష్యప్రాప్తి పట్ల తన్మయత్వం సాధకుని లక్షణం.**

రెండు వర్గాలుగా విడిపోయే అవకాశం ఉంటుంది. కావున ధనాన్ని సక్రమముగా, తగినంతవరకు సంపాదించి, మితంగా ఖర్చుపెట్టడమే ధనానికి ఇచ్చే నిజమైన గౌరవం.

**శృంగి మహర్షి ఇలా అన్నారు.**

**మహాభాగ యధాప్రోక్తం భవతాత్ చతుష్టయం ।**
**అసంయమస్య రూపం యత్తన్నివర్తేత చేత్తదా ॥ 57**

ఓ మహానుభావా! మీరు ఉపదేశించినట్లుగా దేవతల ఆరాధనతో సర్వాభీష్టాలు తీరి, చక్కటి జీవనాన్ని తీర్చిదిద్దుతాయని అవగతమైనది. అసంయమనానికి గల నాలుగు విధములు, వాటిని అధిగమించే పద్ధతిని మీ నుండి వినగోరుతున్నాము.

**ఆరాధనా జీవనస్య దేవతాయాః సమగ్రతామ్ ।**
**గచ్ఛత్యభీష్టసిద్ధిః కింతతః ప్రాప్నోతి మానవః ॥ 58**

దేవతల ఆరాధనా పూర్వక జీవనం వల్ల కోరికలు తీరి, సమగ్రమైన జీవితం రూపొందుతుంది. కోరికలు (ఇహలోక వాంఛలు) తీరినవారికి సాధించవలసినది ఏమి ఉంటుంది, కేవలం పరమార్థిక చింతన తప్ప? అందువల్ల మానవులు ముందుగా తమ మనస్సును వాంఛల వైపు మళ్ళకుండా జాగ్రత్త వహించాలి. అపుడు సమాజము, పరోపకారము వంటి ఆలోచనలవైపు మనస్సును నడిపించవచ్చును.

**అతోऽతి రిక్తం వా కించిత్ కర్తవ్యమవశిష్యతే ।**
**తన్నః శుశ్రూష మాణానాం భవానర్హతిశంసితుమ్ ॥ 59**

అందువల్ల అటువంటి కర్తవ్యాన్ని, శుశ్రూష (సేవించే) పద్ధతులను మీ ద్వారా తెలుసుకుని, మా జీవితంలో ఆచరించి, పరిపూర్ణత్వాన్ని పొందాలని కోరుకుంటున్నాం. మీరు వాత్సల్యంతో వాటిని వివరించగలరు.

**పిప్పలాదులు ఇలా పలికారు.**

**అయం త్వపవ్యయస్యాస్తి నిరోధః కేవలం యతః ।**
**ఉపలబ్ధసంపదాగర్తే పతేన్నాపవ్యయాత్మకే ॥ 60**

"సంయమము' అనేది నిషేధాత్మకమైన గుణం కాదు. విధేయాత్మకమైన గుణం. సంపాదించిన (పొందిన) ధనాన్ని అక్రమమార్గంలోకాకుండా, సక్రమమార్గంలో ఖర్చుచేయగలగాలి. ఆవిధంగా వ్యయంపై నియంత్రణ సాధించగలగాలి. ఆకర్షణలు ఆడంబరాల జోలికి పోకుండా వాటిని నిరోధించడమే ప్రథమ కర్తవ్యం.

**వినాశకారిణోనైవ పరిణామాన్ సముత్సృజేత్ ।**
**ఉపయోగో ఽర్జితస్యాపి మహత్త్వం సత్ప్రయోజనమ్ ॥ 61**

వ్యయంపై నియంత్రణ, కోరికలను అధిగమించడంవల్ల వినాశకరమైన పరిణామాలు గానీ, విద్వేషపూరిత ఆలోచనలు కానీ ఉత్పన్నం కావు. అంతేగాక ధనం సరియైన రీతిలో ఉపయోగించబడి, గొప్ప ప్రయోజనాన్ని కల్గిస్తుంది. ఆ విధంగా 'ధనము' సద్వినియోగమై సార్థకతను పొందుతుంది.

**సామర్థ్య పరిణామాస్తాంస్తతః శ్రేయోవిధాయకాన్ ।**
**ఉత్పాదయతి చేదస్తతాయాః సురక్షితమ్ ॥ 62**

మహత్ప్రయోజనాన్ని దృష్టిలో ఉంచుకుని, శ్రేయస్సును కల్గించే రీతిలో సంపదను వినియోగించినపుడు, సద్వినియోగము చేసినపుడు మంచి పరిణామాలు ఉత్పన్నమౌతాయి. అప్పుడు సులక్షణమైన, సురక్షితమైన రీతిలో ధనాన్ని సమాజ హితానికి ఖర్చు చేయవీలవుతుంది.

– స్వేచ్ఛానువాదం : శ్రీ మారెళ్ళ కామరాజు

## శ్రీ గాయత్రీ శతకం

41. *భయము, దుఃఖము, శోకము, పాపచయము*
*ఖేద దారిద్ర్య కలహాది క్లేశములను*
*తరిమివేయును మంత్రమున్ స్మరణజేయ*
*విశ్వజనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– క్షణక్షణం భయం, తీరని దుఃఖం, ఆగని శోకం, తరగని పాపాల సమూహం, విడువని విచారం, వదలని దారిద్ర్యం, పరిష్కారం కాని కలహాలు తదితర కష్టములను శాశ్వతంగా పోగొట్టి శాంతిని కలిగిస్తుంది గాయత్రీ మంత్రమును క్రమం తప్పకుండా స్మరణ చేస్తే.*

42. *తప్పు చేసిన వారలు తల్లడిలుచు*
*అమ్మ పాదాలు వదలక ఆర్తితోడ*
*నీదు బిడ్డల మన్నచో ఆదుకొనును*
*విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత*

*తా:– తెలిసో తెలియకో తప్పును చేసి కుమిలిపోతూ గాయత్రీమాత పాదాల చెంత మోకరిల్లి "తల్లీ! నేను నీ బిడ్డనమ్మా. నా తప్పును మన్నించి నా దుఃఖాన్ని తొలగించు తల్లీ" అని ఆర్తితో వేడుకుంటే ఆ అమ్మ నిన్ను కరుణించి తల్లిలా అనునయించి ఓదారుస్తుంది.*

*రచన : సహజ కవి, సాహిత్య రత్న,*
*శతక చతురానన, పద్య కవితాసుధానిధి*
*శ్రీ అయినాల మల్లేశ్వర రావు*

**అసత్యం నుండి సత్యానికి, చీకటి నుండి వెలుగుకు పురోగించడమే ఆధ్యాత్మికత.**

## యుగ గీత-5 : రెండవ అధ్యాయం-సాంఖ్య యోగము

# ఆత్మోన్నతి

గీతలోని రెండవ అధ్యాయమైన 'సాంఖ్య యోగము' ఎంతో ముఖ్యమైనదని ఇదివరికే తెలుపబడింది. నేను యుద్ధము చేయను అని అర్జునుడు చెప్పి, రథం వెనుక భాగంలో కూర్చుండిపోయి శ్రీకృష్ణుడి జవాబుకై వేచి ఉన్నాడు. అర్జునుడిలో శిష్యత్వం వికసించిన తరువాత, యోగీశ్వరుడు కృష్ణుని శ్రీముఖం నుండి వెలువడిన తత్త్వజ్ఞానం యొక్క వివరణ ఇప్పుడు తెలుపబడుతోంది.

అర్జునుడిలో ఒక గందరగోళాన్ని సృష్టించి శ్రీకృష్ణుడు ఒక మహాక్రాంతికి కారకుడయ్యాడు. అందుకే అతను యుద్ధం చేయను అని ఒక పక్క అంటూనే, శిష్యభావంతో శరణువేడి తత్త్వజ్ఞానం తెలుసుకోవాలని మరోవైపు ఆకాంక్షిస్తున్నాడు. ఈ జ్ఞానం అతనికి ఆత్మిక ప్రగతినే కాక యుగధర్మాన్ని కూడా స్పష్టంగా తెలియజేస్తుంది. ఎప్పుడు శిష్యుడు ఇటువంటి స్థితికి వచ్చినట్టు గమనించినా గురువు అదను చూసి శుభ్రంగా దులిపి పెడతాడు. అది విరజానందులైనా, శ్రీరామకృష్ణ పరమహంస అయినా, శ్రీరామశర్మ ఆచార్య అయినా సరే. గురువు మన మంచికోరే తిడతారు. ఉతక్కుండా శుభ్రతెలా వస్తుంది? ఇంతకన్నా చిన్న ప్రక్రియతో శిష్యుని ప్రారబ్ధాన్ని మార్చలేరు కూడా. ఒక్కోసారి మనకు అనుమానం కూడా వస్తుంది, నేను గురువుకు సమర్పణ చేసుకున్నాను కదా, అయినా సరే గురువుగారెందుకు నన్ను తిడుతున్నారు. ఇదొక స్వాభావిక ప్రక్రియ. మనలో ఎంతమందికి ఆ తిట్లు తినే సౌభాగ్యం దొరికిందో! ఆ సౌభాగ్యం లభించక పోయుంటే పూర్వపు అహంభావము, ఆగ్రహము అలాగే ఉండేవి. అంతేకాక ఇప్పుడు ఉన్న ఉన్నతిని సాధింలేకపోయేవాళ్ళము. మనము ప్రగతి సాధించలేకపోయాము అంటే గురువు యొక్క తిట్లను స్వీకరించకుండా బాధపడ్డాము. 'కుతస్త్వా కష్మలమిదం విషమే సముపస్థితమ్' అన్న శ్రీకృష్ణుడి తిట్లను అర్జునుడు రెండో శ్లోకంలోనే తిన్నాడు. ఇక అతను సమర్పణ చేసుకుని, తత్త్వజ్ఞానం తెలుసుకోవాలన్న కోరికను వ్యక్తపరిచాడు కాబట్టి, శిష్యులందరి కోసం శ్రీకృష్ణుడు గీతా జ్ఞానాన్ని వినిపిస్తాడు. అనాది నుండి ఈ జ్ఞానం అందరికీ మార్గదర్శనాన్ని చేస్తోంది. అప్పుడు పదకొండవ శ్లోకం నుండి ఉపదేశించబడ్డ గీత సమగ్రమైన మార్గదర్శనాన్ని అందిస్తుంది.

**శ్రీభగవానువాచ -**

**అశోచ్యానన్వ శోచస్త్వం ప్రజ్ఞావాదాంశ్చ భాషసే**
**గతాసూనగతాసూంశ్చ నానుశోచంతి పండితాః 2.11**

**అర్థం :-** "హే అర్జున! శోకింపదగని వారికొరకు నీవు శోకించుచున్నావు. పైగా పండితుని (జ్ఞాని) వలె మాట్లాడుచున్నావు. పండితులైన వారు ప్రాణములు పోయిన వారిని గూర్చిగాని, ప్రాణములుపోని వారిని గురించిగాని శోకింపరు."

శ్రీకృష్ణుడు, అర్జునుడిని ''పెద్ద పండితునివలె మాట్లాడుతున్నావు. మాట్లాడేది జ్ఞానుల భాష, కాని, నిజానికి నీవు సంపూర్ణ అజ్ఞానివి. ఆలోచించకూడని వాటి గురించి ఆలోచిస్తున్నావు. తెలివిగల బుద్ధిమంతులు, పండితులు పల్కిన తర్కాలను వల్లె వేస్తారు. కాని, నిజానికి ఆ జ్ఞానాన్ని ఉపయోగించడం తెలుసా?" సమర్పణకి తర్కము, బుద్ధులే అడ్డొస్తాయి. అందుకే మొదటి తిట్టుతోనే శ్రీకృష్ణుడు అతని అహాన్ని కరిగించే ప్రయత్నం చేస్తాడు. బతికున్నవారి గురించి గాని, చనిపోయిన వారిని గురించి గాని పండితులు చింతించకూడదని అంటూంటారు. శ్రీకృష్ణ భగవానుడు సద్గురువే కాదు, ఋషి, అంతర్యామి కూడా. "నీ మనస్సులో కోరికలు మాత్రం చాలా ఉన్నాయి, పెద్ద విద్వాంసుల మాటలు మాట్లాడుతున్నావు, అడుక్కుతింటానే కాని యుద్ధం మాత్రం చేయనంటున్నావు" అంటాడు కృష్ణుడు. అడుక్కోవడం అర్జునుడి వల్ల కాదు, ఎందుకంటే అతను విరాగి కాదు, స్వభావతహా యోధుడు.

ఒక విరాగి భిక్షాటన చేయగలడు, అదీ, ఎప్పుడు? వైరాగ్యం సంపూర్ణంగా ప్రజ్వలించినప్పుడు. కాషాయ వస్త్రాలు ప్రజ్వలించే అగ్ని జ్వాలలకు సంకేతం. బుద్ధుడు కూడా ఈ విధమైన పరంపరను పాటించాడు. కాని పరమపూజ్య గురుదేవులు మాత్రం నేటి యుగధర్మం, పరివ్రాజకత అని చెప్పారు. సమయదానము, అంశదానములతో సమాజాన్ని పీడ, పతనం, పరాభవాల నుండి విముక్తిని చేయాలన్నారు. యుగధర్మాన్ని నిర్వర్తిస్తూ

**సద్భావనలు, సత్ప్రవృత్తులు సర్వేశ్వరుని సాన్నిధ్యాన్ని సాధిస్తాయి.**

పరివ్రాజకుడిగా మారి మహాకాలుని పిలుపుకు అనుగుణంగా గురువుగారి ప్రణాళికలో పాలుపంచుకోవడమనే విషయాన్ని అర్జునుడి కథనాన్ని ఆధారం చేసుకుని సులువుగా అర్థం చేసుకోవచ్చు.

అర్జునుడి పాండిత్యపు తర్కాలపై కృష్ణుడు ఝుళిపించిన కొరడా గురించి చర్చించుకుంటున్నాము. నీవు శోకించకూడదని భగవంతుడు చెప్తున్నాడు. నేను గాని, నీవు గాని, ఈ రాజులందరూ గాని (ఎవరి గురించైతే నీవు శోకిస్తున్నావో) లేని కాలము అసలు లేదు. భవిష్యత్తులో ఉండబోము అనేది కూడా సత్యము కాదు. (12వ శ్లోకం). జీవాత్మ ధరించిన ఈ దేహానికి బాల్యము, యవ్వనము, వృద్ధాప్యము ఉన్నట్టే కొత్త శరీరప్రాప్తి కూడా ఉంటుంది. ఈ విషయమై ధీరుడు, మోహితుడు కారాదు (శోకించరాదు). (13వ శ్లోకం)

దేహానికి అతీతంగా ఉండి అర్థం చేసుకోమని భగవంతుడు చెప్తూ శిష్యుడ్ని ఆసక్తి నుండి విముక్తుడ్ని చేయాలనుకుంటున్నారు. జరిగిపోయిన వాటిని మనం మార్చలేము కాబట్టి వర్తమానంలో జీవనయాత్ర ఎలా సాగించాలో అనేదే శిష్యునికి ప్రతిగురువు ఉపదేశిస్తాడు. గురువు మన బాల్యం గురించి, భూత వర్తమాన భవిష్యత్తుల గురించి కూడా తెలిసినవాడు. ఈ విషయం గురించి గురువు పదేపదే చెప్పడానికి కారణం – శిష్యునిలోని ఆసక్తి నశింపజేసి ఆధ్యాత్మిక మర్మాన్ని తెలియజేయుటయే.

పరమపూజ్య గురుదేవులు ఎవరైనా జీవనదానం చేసి శాంతికుంజ్‌కు వస్తామంటే ఒకటే మాట అనేవారు, “ఒక్కసారిగా కుటుంబ సంబంధాలన్నీ తెంపుకోగలిగితేనే రండి. లేకపోతే ఇక్కడున్నప్పటికీ మనస్సు మాత్రం కుటుంబ సభ్యులమీదే ఉంటుంది. మా పిన్నికెలా ఉందో, బాబాయికి ఏమైందో అనే ఆలోచిస్తారు”. ఎప్పుడైనా కార్యకర్తలెవరైనా వారి చుట్టాల పెళ్ళికికాని, ఆరోగ్యం బాగాలేనప్పుడు కాని వెళితే గురువుగారు అనేవారు ‘‘మీ నానమ్మ కూతురి పిన్ని కొడుకు పెళ్ళికి నువ్వెందుకెళుతున్నావు, ఇప్పుడు నువ్వు బాబాజీవి, నీకు పెద్ద కర్తవ్యాలున్నాయి. నువ్వు నీ సొంత ఖర్చుతో వెళ్ళినా కూడా నీ సమయం విలువ నీకు తెలియదు, నువ్వు ఇక్కడే ఉండు, పెళ్ళైయ్యాక మీ చుట్టాలందర్నీ ఈ యుగతీర్థానికే రమ్మని ఆహ్వానించు, ఇక్కడ ఆశీర్వాదం తీసుకోమను. అందరూ కృతార్థులవుతారు, నీకు డబ్బు, మిషనుకు సమయం మిగులుతుంది. ఇక్కడి డబ్బుతో నువ్వు నీ చుట్టాల పెళ్ళికి వెళ్ళావంటే మాత్రం నన్ను పొడిచి వెళ్ళినట్టే. ఎవరికైనా ఒంట్లో బాగుండకపోతే నువ్వెళ్ళి ఏం చేస్తావు, నువ్వు డాక్టరువు కాదు కదా. నాకు చెపితే, నేను వారికోసం ప్రార్థిస్తాను. ఇక మీరంతా వ్యవహారాలు, ప్రక్రియలకు అతీతంగా ఉండి ముందుకు సాగండి”. ఈ విషయమే గురువుగారు సమయం వచ్చినప్పుడల్లా చెపుతూ వచ్చారు. యుగగీత సందర్భంగా ఈనాటికైనా మనము గురువుగారిని, గురుసత్తా వేదనని అర్థం చేసుకోగలిగితే, మన ఆసక్తి అనే బంధాన్ని తెంచుకుని, మనము ఆ విరాట్ పరివారంలో ఒక భాగమని గుర్తించి, వారందరి పట్ల మన కుటుంబ బాధ్యతను స్వీకరించి, వారి పనులను పూర్తి చేయగలుగుతాము. కృష్ణార్జునుల ఈ సంవాదం ద్వారా మన కేంద్రీయ మరియు క్షేత్రీయ కార్యకర్తలందరికీ ఈ వ్యాఖ్యానాలు అర్థమైతే ఈ ప్రయత్నం సార్థకమైనట్టే.

ఎంతో పెద్ద విషయాన్ని అతి సంక్షిప్తంగా తెలిపి యోగీశ్వరుడు శ్రీకృష్ణుడు అర్జునుడిని మళ్ళీ అదే ప్రవాహంలోకి లాక్కొస్తాడు – శరీరము నశ్వరమైనది, ఆత్మ మాత్రమే నశించనిది. కనిపించేదంతా నశ్వరమైనది, క్షణభంగురమైనది. కనిపించనిదే వినాశము లేనిది. చూస్తూ చూస్తూ ఎంత మంది మృత్యువు వడిలోకి చేరిపోయారు! ఆత్మ అనే పేరుగల శాశ్వత దేహాతీత తత్వాన్ని గుర్తించు. తన కర్తవ్యాన్ని అర్థం చేసుకుని యుద్ధానికి సన్నద్ధుడయ్యే విధంగా మారడానికి భగవానుడు ఈవిధంగా చెబుతున్నాడు –

**య ఏనం వేత్తి హంతారం యశ్చైవం మన్యతే హతమ్**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హంతి న హన్యతే**
**2.19**

**న జాయతే మ్రియతే వా కదాచిత్**
**నాయం భూత్వా భవితా వా న భూయః**
**అజో నిత్యః శాశ్వతోఽయం పురాణో**
**న హన్యతే హన్యమాన శరీరే 2.20**

**భావం :–** ఆత్మ ఇతరులను చంపునని భావించువాడును, ఆత్మ ఇతరులచే చంపబడునని భావించువాడును, ఆ ఇద్దరు అజ్ఞానులే. ఏలనన వాస్తవముగా ఆత్మ ఎవ్వరినీ చంపదు, ఎవ్వరిచేతను

మనిషిని సన్మార్గంలోనికి తీసుకురావడం పెద్ద ఉపకారం.

చంపబడదు. ఈ ఆత్మ ఏ కాలమునందును పుట్టదు, గిట్టదు. ఇది భావ వికారములు లేనిది. ఇది నిత్యము, శాశ్వతము, పురాతనము. శరీరము చంపబడినను ఇది చావదు.

ముప్పైవ శ్లోకం వరకు ఆత్మ యొక్క విభిన్న గుణాల గురించి వివరించబడింది. దగ్గరి వారు పోయినప్పుడు శోకంతో ఉన్నవారు చదవదగ్గది, పఠింపదగ్గ శ్లోకాలు ఇవే. ఈ శరీరం కోసం చింతించవద్దని భగవంతుడు మళ్ళీ మళ్ళీ చెబుతున్నాడు. మరణధర్మం కల బంధువుల కోసం శోకించవద్దంటున్నాడు. ప్రతీ గురువు ప్రతీ శిష్యుడికీ ఇదే చెబుతాడు. గురు శిష్యుల సంబంధం శాశ్వత సంబంధం. చుట్టరికంతో వచ్చే మామ, బావ అనే సంబంధాలు తాత్కాలికమైనవి. మన సొంత మనుషులనుకునే వాళ్ళు ఈ జన్మకి మాత్రమే మనకు మిత్రులు. జన్మజన్మల బాంధవ్యం గురుశిష్యులది మాత్రమే. యుగయుగాలకు, అనంతకాలం వరకు ఈ సంబంధం కొనసాగుతుంది. నిజమైన, ఉదాత్తమైన, ప్రగాఢ పవిత్ర సంబంధం కలది గురుశిష్యుల బంధం మాత్రమే.

అర్జునుని మోహాన్ని నశింపజేసే విధంగా భగవానుడు మళ్ళీ మళ్ళీ తరువాతి శ్లోకాల్లో ఇలా చెబుతున్నారు –

**వాసాంసి జీర్ణాని యథా విహాయ**
**నవాని గృహ్ణాతి నరోऽపరాణి**
**తథా శరీరాణి విహాయ జీర్ణా**
**న్యన్యానిసంయాతి నవాని దేహి 2.22**
**నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః**
**న చైనం క్లేదయంత్యాపో న శోషయతి మారుతః 2.23**

**భావం :–** మానవుడు జీర్ణవస్త్రములను త్యజించి, నూతన వస్త్రములను ధరించినట్లు జీవాత్మ పాతశరీరములను వీడి నూతన శరీరములను పొందును. ఈ ఆత్మను శస్త్రములు ఛేదింపజాలవు. అగ్ని దహింపజాలదు. నీరు తడుపజాలదు. వాయువు ఆరిపోవునట్లు చేయజాలదు.

నిత్యము, సర్వవ్యాపకము, అచలము, స్థిరము, సనాతనము, వికారరహితము అయినటువంటిదిగా ఆత్మను తెలుసుకుని ఎట్టి పరిస్థితులలో శోకించకూడదు. యుగధర్మాన్ని దాటివేయకూడదని కృష్ణుడు అర్జునుడికి బోధిస్తున్నాడు; దేహాతీత ఆత్మను గురించి చక్కగా వివరిస్తూ తన శిష్యుడు మోహాతీతుడు అవ్వాలని బోధిస్తున్నాడు.

నేడు బతికున్నవాడు చావక తప్పదు, చనిపోయిన వాడు మళ్ళీ జన్మించక తప్పదు. ఎటువంటి కారణము లేని ఈ శోకం నీకు శోభించదు (27వ శ్లోకం). ఆత్మ అందరి శరీరంలోనూ ఉంటుంది. దానికి చావు లేదు. చావు ఆత్మ ధరించే శరీరానికి మాత్రమే ఉంటుంది. కాబట్టి ఎటువంటి పరిస్థితులలోనూ శోకించగూడదు. యుగధర్మాన్ని గురించి వ్యాఖ్యానిస్తూ కృష్ణుడు దేహం నుండి నేరుగా స్వధర్మాచరణ గురించి చెప్పడం మొదలుపెడతారు.

**స్వధర్మపి చావేక్ష్య న వికంపితుమర్హసి**
**ధర్మ్యాద్ధి యుద్ధాత్ శ్రేయోన్యత్ క్షత్రియస్య న విద్యతే**
**2.31**

**భావం :–** స్వధర్మమును బట్టి కూడా నీవు భయపడనక్కరలేదు. ఎందుకంటే క్షత్రియునకు ధర్మయుద్ధమునకు మించినట్టి శ్రేయస్కరమైన కర్తవ్యము మరేది లేదు.

శిష్యత్వ జాగృతితో మొదలైన ఈ అధ్యాయం, దేహాతీత ఆత్మను గురించి వివరించి, ఇప్పుడు మూడవ చరణమైన శరీర స్వధర్మాచరణపై మీమాంసకు చేరుకుంది. ఈ దేహాన్ని ఉపయోగించి స్వధర్మాచరణ ఎలా చేయాలో తెలియజెప్పటానికే నీకీ శరీరం ఇవ్వబడింది అని భగవానుడు అర్జునుడికి ఉపదేశిస్తున్నారు.

పరమపూజ్య గురుదేవులు అంటారు – ఈ శరీరం ద్వారానే ఆత్మ యొక్క ఈశ్వరీయ శక్తి యొక్క కిరణాలు ప్రసరిస్తాయి కాబట్టే ఈ శరీరం మనకి ప్రసాదించబడింది. మన ద్వారా పరమాత్మ పయనించాలని, పరమాత్మ వైభవం ప్రసరించాలనే మనకు ఈ శరీరం ఇవ్వబడింది. మన శరీరము, మన మనస్సు, మన దేహము, మన ప్రాణము, మన కర్మ, మన ఆలోచన అన్నీ నీటి బుడగవంటివి. మానవ దేహము ఈశ్వరుని యొక్క అద్భుత సృష్టి. భగవత్ చైతన్యంపై ఆరూఢులమై గనక మనము ఈ శరీరంతో కర్మలను ఆచరిస్తే దాన్ని స్వధర్మాచరణ, కర్తవ్యపాలన అంటారు. మన కర్తవ్యాన్ని నిర్వర్తించడం కన్నా గొప్ప తపస్సు మరేదీ లేదు.

మహాభారతంలో ఒక కథను చదువుతాము. జాజల్యుడనే ముని యొక్క తపస్సు వేయినోళ్ళ కొనియాడబడేది. తమ తపస్సుతో ఎన్నో అద్భుతమైన సిద్ధులను పొందారు. గాలిలో పంచెను ఎగరేస్తే అది ఆరిపోయేది. తాడు కట్టి ఆరేయాల్సిన

**దృఢ సంకల్పం సాఫల్యానికి జనని.**

అవసరం ఉండేది కాదు. ఒక రోజు దాని మీద ఒక కాకి రెట్ట వేసింది. ఆయన కోపంగా దాన్ని చూసేసరికి అది కాలి బూడిదైపోయింది. ఆయనకి తన తపోశక్తి మీద చాలా గర్వం ఉండేది. ఈ సంఘటన జరిగిన వెంటనే ఆకాశవాణి పలికింది, 'హే జాజల్య! జ్ఞానం గురించి తపస్సు గురించి తెలుసుకోవాలంటే అహంకారం వదులుకో. పక్క ఊళ్ళో ఉన్న సులభ అనే ఆమె దగ్గరకెళ్ళు'. కోపిష్టి అయిన జాజల్యుడు పక్క ఊరికి వెళ్ళి కబురు పెట్టాడు "ముని స్వయంగా నడుచుకుంటూ వచ్చాడు, సులభను కలుసుకోవాలి". సులభ తిరిగి కబురు పంపించింది, 'పిల్లలకు తినిపిస్తున్నాను, కొంచెం సేపు వేచి ఉండండి.' ఈ మాట వినగానే ముని ఉగ్రులై, ఆమె ఇంటి బయట నిలబడి 'అసలు నేనెవరో నీకు తెలుసా! దారి పొడుగునా మనుషులు నాకు ప్రణమిల్లుతూ వచ్చారు. నేనెవరో తెలిసే నీవు నాతో ఈ విధంగా మాట్లాడడానికి సాహసిస్తున్నావా? 'సులభ లోపలే ఉండి జవాబిచ్చింది – 'మునీ! కోపగించుకోకండి. నేనేమీ మీ చేతిలోని పంచెను కాను ఎగరేస్తే ఆరిపోవడానికి, కాకిని అంతకన్నా కాను, కోపగించుకుంటే భస్మమైపోవడానికి. దారి పొడుగున మనుషులు మీరెవరో తెలియకుండానే నమస్కరిస్తూ వచ్చారు, కాని నాకు మీరెవరో బాగా తెలుసు.' ఈ మాటలు విని ముని ఆశ్చర్యపోయాడు. ఈ విధమైన అతీంద్రియ జ్ఞానం ఈమెకెలా వచ్చింది? నా గురించిన ఇన్ని సంగతులు ఈమెకెలా తెలుసాయి అని అనుకుంటుండగానే లోపల నుండి సులభ మళ్ళీ జావాబిచ్చింది, 'మునిశ్రేష్ఠ! ఆశ్చర్యపడకండి. **దేహంతో చేసే స్వధర్మాచరణ అనే తపస్సు వల్లనే నాకీ సిద్ధి కలిగింది.** మీరింకా తెలుసుకోవాలనుకుంటే తులాధరుడనే వైశ్యుని వద్దకు వెళ్ళండి'. ముని తులాధరుని వద్దకు వెళ్ళి, సులభ నన్ను నీ దగ్గరకు పంపించిందని చెప్పాడు. అందుకు ఆ వైశ్యుడు, 'నా కొట్లో కొనుగోలుదారులున్నారు, వాళ్ళు వెళ్ళాక నీతో మాట్లాడతాను' అన్నాడు. అందుకు ఆగ్రహించిన మునికి తులాధరుడు జవాబిచ్చాడు, 'కోపించకండి మునీంద్రా! నేను కూడా మీ చేతిలోని పంచెనూ కాను, కాకినీ కాను, శాంతించి కాస్త ఆగండి.' ఈ జవాబుకు ఆశ్చర్యపోయిన జాజల్యుడు, అసలు వీరికి నా గురించి ఎలా తెలుసు, వీరికి ఈ సిద్ధి ఎలా లభించింది అని ఆలోచించసాగాడు. అప్పుడు తులాధరుడు చెప్పాడు, **నేను లోభిని కాను, సరిగ్గా తూకం వేస్తాను, నిజాయితీతో నా ధర్మాన్ని ఆచరిస్తాను. ఇదే నా తపము.** ఆ తరువాత మునికి ఇలాంటి ఎన్నో అనుభవాలు కలిగాయి. వాటి వల్ల కర్తవ్యము మరియు ధర్మ పరిపాలనే అన్నిటికన్నా పెద్ద తపస్సు అని వారికి తెలిసివచ్చింది. తన తపోశక్తి, సిద్ధులను చూసుకుని అంత గర్వించకూడదని, అవి క్షణికమైనవని, కోపం తెచ్చుకోగానే శక్తి నశిస్తుందని తెలుసుకున్నాడు. జనకుడు మొదలైన రాజులందరూ కూడా ఈ విధమైన స్వధర్మాచరణ చేసి యోగులయ్యారు. ఈ విధంగా జాజల్యునికి కూడా తత్త్వజ్ఞానం లభించింది.

శ్రీకృష్ణ భగవానుడు కూడా తన శిష్యుడైన అర్జునుడికి యుద్ధం చేయమని చెప్తున్నారు. ఇట్టి యుద్ధము అదృష్టవంతులైన క్షత్రియులకే లభించును. ఇది స్వర్గమునకు తెరచిన ద్వారము వంటిది. ఈ యుద్ధము నీకు ధర్మబద్ధము. ఒకవేళ నీవు దీనిని ఆచరించనిచో నీ స్వధర్మము నుండి పారిపోయినవాడవు అవుతావు. దానివలన కీర్తిని కోల్పోవుదువు. పైగా నీవు పాపము చేసినవాడవగుదువు. లోకులందరు బహుకాలము వరకు నీ అపకీర్తిని గురించి చిలువలు పలువలుగా చెప్పుకొంటారు. **మాన్యుడైన పురుషునకు అపకీర్తి మరణముకంటే బాధాకరమైనది. (32,33,34 శ్లోకాలు)**

పరమపూజ్య గురుదేవులు కూడా ఈ యుగసంధి కాలానికి చేయవలసిన తపస్సు మనకు చెప్పి వెళ్ళారు. మహాపురశ్చరణలో పాల్గొనదలచినవారు, లోకహితంలోనే తమ హితాన్ని చూసుకోవాలి. జ్ఞానయజ్ఞాన్ని కొనసాగిస్తూ ఉండడమే పెద్ద తపస్సన్నారు. **లోకులకు సద్బుద్ధి కలిగే విధంగా ఉజ్జ్వల భవిష్యత్తుకు మార్గాన్ని చూపించడమే నేటి మహా కర్తవ్యం అని గాయత్రీ పరివారానికి దిశానిర్దేశం చేసారు.** ఈ తపోసాధనలో సుఖాలను వదులుకోవలసి రావచ్చు, కష్టాల పాలవ్వచ్చు, **కాని సేవాసాధన అనే తపస్సు నేడు పెద్ద భూమికను నిర్వర్తిస్తుందని గురుసత్తా మరీ మరీ చెప్పి వెళ్ళింది.** ఈ తపోసాధన నుండి తప్పుకోవడమంటే తమోగుణం ఆవరించినట్టే; మహాభారతం నుండి తప్పించుకుని పారిపోయినట్టే. వచ్చే సంచికలో స్వధర్మాచరణ – లోకసేవలోనే విభూతుల సద్వినియోగం, యుగధర్మ పరిపాలన, రెండవ అధ్యాయములోని తరువాతి వివరణ చదువుతాము.

*– అఖండ జ్యోతి, సెప్టెంబరు 1999*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

**పక్షి ఎంత చిన్నదయినా దాని గూడు అదే నిర్మించుకుంటుంది.**

సూర్య విజ్ఞానం - 4

# ఋషులందించిన అమూల్య కానుక - మధు విద్య

సవిత అమృతత్వానికి మూలం. సవితా ఉపాసన సాధకుని జీవనం ప్రాణంతో నింపుతుంది, మనస్సును ఉల్లాసంతో నింపుతుంది, ఆత్మకు తన అమృత స్వరూప వివేచన ఇస్తుంది. ఈ దిశ నుండి సాధకుని దృష్టి మరలిపోకుండా ఉండటానికి ఋషులు అనేక చోట్ల దీని అర్థం, గుణం, కర్మ స్వరూపాలను ప్రతిపాదించారు.

ఛాందోగ్యోపనిషత్తు నందు వర్ణించబడిన మధు విద్య ఈ రహస్యమైన తత్వముల వివేచనే. అక్కడక్కడ పడి వున్న ఉపాసనా రహస్యాలను ఒకచోట చేర్చి వెల్లడించబడ్డాయి. ఈ ఉపనిషత్తులోని ప్రథమ ఖండంలోని 12 శ్లోకాలలో మధు విద్య, సవితా సాధన మనోహరంగా వివరించబడ్డాయి. దీనిని అనుసరించి ఆదిత్యుడు దేవతలకు మధువు.

**ఓం అసౌవా ఆదిత్యో దేవ మధు తస్యద్యౌరేవ**
**తరశ్చీనవం శో అంతరిక్షమపువో మరీచయః పుత్రీ**
**(ఛా.ఉ. 3-1-1)**

**అర్థం :-** ఈ ఆదిత్యుడు నిశ్చయంగా దేవతల మధువే. ద్యులోకమే వంపు తిరిగిన వెన్నెముక. దానిపై మధువు జాలువారుతుంది. అంతరిక్షమే తేనేతుట్టె. కిరణములు తేనేటీగల పిల్లలతో సమానము.

ఈ మంత్రములో తత్వదర్శనం చేసిన ఋషులు సాక్షాత్కరింపచేసుకున్న పరమతత్వములను అద్భుతంగా వర్ణించడమేగాక దాని వైజ్ఞానిక విషయాల వివరణ లభిస్తుంది. ఆదిత్యుని యొక్క ఆది భౌతిక రూపం పరమాణువు. ఆధునిక విజ్ఞానం పదార్థ విజ్ఞానమే కనుక అది పదార్థ తత్వములను సూచిస్తుంది. అందువలన దీని పదజాలం భౌతిక ద్రవ్యముల కొరకు మాత్రమే ఉపయోగపడుతుంది. సాధారణ ప్రజలు దీనినే వైజ్ఞానికమని భావిస్తున్నారు. మనుష్యులు తమకు తెలిసినవి, ఇష్టమైనవి మాత్రమే తరచు వినాలని, చూడాలని, ఇష్టపడతారు. దీనిలో కొన్ని మార్పులు చేసి ఆధునికతగా భావిస్తారు. దీనికి విరుద్ధంగా ఆలోచించే వారిని అర్థం చేసుకోలేరు, సహించనూలేరు. వాటిని ప్రమాణం లేనివని, అశాస్త్రీయమని, వైజ్ఞానికంగా లేవని చెప్తుంటారు. తరువాత కాలక్రమంలో ఈ ప్రతిపాదనలు అర్థం చేసుకున్నప్పుడు వాటిని స్వీకరిస్తారు. క్రొత్త అన్వేషణలకు, ప్రతిపాదనలకు ఎప్పుడూ ఇలాగే జరుగుతుంది.

ఇలాగే ఎందుకు చెప్పవలసి వస్తుందంటే ఈ రోజులలో ఉపయోగిస్తున్న వైజ్ఞానిక పదజాలంతో కేవలం పదార్థ తత్వముల నిర్దేశం ఉండటం వల్ల దానిని మాత్రమే వైజ్ఞానికంగా భావిస్తున్నారు. **కాని ప్రాచీన భారతీయ వైజ్ఞానికులు చెప్పే విధానం వేరుగా ఉండేది. వారు పదార్థ విజ్ఞానమే గాక దేవత్వ ఆత్మ తత్వముల రహస్యములు తెలుసుకున్నవారు. అట్టి సమగ్రత కారణంగా వారు ఆవిష్కరించిన ప్రణాళికలలోని ఒక్కొక్క పదం ద్వారా ఒకేసారి మూడు తలములకు సంబంధించిన శిక్షణ ఇస్తుండేవారు.** ఇలాంటి ప్రణాళిక రూపొందించడానికి అనుపమ మేధాశక్తి అవసరము. ఇది ఋతుంభరా ప్రజ్ఞ కలిగిన ఋషులకు మాత్రమే సంభవం.

పైన చెప్పబడిన మంత్రం కూడా శాస్త్రీయ పద్ధతిలో చెప్పబడిన సవితాతత్వం యొక్క వివేచన. ఆదిత్యుని యొక్క ఆది భౌతిక రూపం పరమాణువు; ఆది దైవిక రూపంలో 11 ప్రముఖ దేవగణములలోని ఆదిత్యుడు; ఆధ్యాత్మిక రూపంలో చేతనా-ఆదిత్య, సర్వవ్యాపకుడైనా సవితా బ్రహ్మ. యత్పిండే-తత్ బ్రహ్మండే అనే అద్భుత శైలిలోనే సృష్టి చేయబడింది కాబట్టి ఇటువంటి ప్రతిపాదన చేయబడి ఉండవచ్చు. అణువులో ఏముందో మహత్తులో అదే ఉన్నది, విరాట్ రూపంలో ఏమున్నదో విభువులోను అదే ఉన్నది.

ఈ మంత్రంలోని ఆదిత్యుని వర్ణన పరమాణువునకు వర్తిస్తుంది. వంగిన వెన్నెముక రీతిలోనున్న పరమాణువులలో ఎలక్ట్రాన్ యొక్క భ్రమణం బాహ్యంగా ఒక కక్ష్యలో ఉంటుంది. ఆర్బిటల్స్‌తో కూడిన పరమాణు రూపమే తేనెపట్టు. పరమాణువు లోపల ఉండే ఫోటాన్ కణాలే తేనేటీగలు. భౌతిక సూర్యునికి కూడా ఈ వర్ణన వర్తిస్తుంది. ఫోటానులలో విద్యుదయాస్కాంత శక్తి ఉండి అవి సూర్యకిరణ తరంగాలతో కలసి ఉంటుంది.

మనం మంచి అనుకున్నదాన్ని నిర్భయంగా ఆచరించాలి.

ఫోటాన్ అనేది ఒక ప్రకాశ కణం. మరీచి సూర్యరశ్మికి ఇంకొక పేరు. సూర్యునికి మరీచి లేదా మారీచుడనే పేరు ఉన్నది. ఆధ్యాత్మిక దృష్టిలో ఆదిత్యుడు సర్వవ్యాపకుడైన సవితా బ్రహ్మ. ఆయన దేవతల యొక్క మధువు. దేవశక్తుల అమరత్వానికి, మధుమయతకు కారణం సవితే. "సవితా వా దేవానాం ప్రసవితా" అనేది శాస్త్రీయ కథనం. దేవతల ప్రసవిత సవితయే. దాని నుండి మధు రసమును గ్రహించి దేవశక్తులు బలిష్ఠమవుతాయి. ఈ మధువు అంతరిక్షమంతా వ్యాపించి ఉన్నది. ఆకాశతత్వంలో, బ్రహ్మాండంలో వ్యాపించి ఉన్న రూపం లేనటువంటి మౌలిక తత్వం. దీనిలో నిండి ఉన్న చేతనత్వ మధువు ఆదిత్యుడు లేక సవిత. దేవశక్తులు దాని నుండి శక్తిని, ప్రాణ రసమును, మధు రసమును గ్రహిస్తూనే ఉంటాయి.

ఉపనిషత్కారులు సూర్యుని నుండి నలువైపుల ప్రసరించే రశ్మలను మధునాడులని అన్నారు. ఈ మధునాడుల నుండి విభిన్న దిశలలో ప్రవహించే మధువు గురించి చర్చించబడింది. ఈ సందర్భమున ఆధునిక భౌతిక వాదులు సృష్టి మూల కణములను వెదుకుతూ పరమాణు నాభి చుట్టూ ఎలక్ట్రానులు పరిభ్రమిస్తున్నట్లు తెలుసుకున్నారు. ఈ పరిభ్రమణం ఆవర్తకంగా ఉంటుంది. కాని ఈ పరిభ్రమణ వేగం కాని దిశ గాని నిర్ధారించడం ఆధునిక విజ్ఞాన శాస్త్రానికి సంభవం కాలేదు. దీనికి కారణం ప్రయోగశాలలో అట్టి వేగాన్ని అధ్యయనం చేయడానికి ప్రకాశరశ్మి ఉపయోగించబడుతున్నది. ప్రకాశరశ్మిలో (కాంతి) ఫోటాను కణాలే ఉంటాయి. అవి సృష్టి యొక్క మూల కణములలో ఒకటి మాత్రమే గాక అజరామరములు.

కాంతి వేగంతో కదిలే ఈ కణములు ఎలక్ట్రానులను ఢీకొని వాటి వేగంలోను, దిశలోను మార్పులు తీసుకువస్తాయి. ఈ విధంగా ఏ వైజ్ఞానిక ఉపకరణములతో ఎలక్ట్రానుల స్థితిగతులను కొలవడానికి ప్రయత్నిస్తారో అవి స్వయంగా ఎలక్ట్రానులను ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఎలక్ట్రానుల వేగాన్ని దిశను ఖచ్చితంగా చెప్పడం అసాధ్యం అవుతుంది. కాని భారతీయ ఋషులు ఈ విషయంలో నిష్ణాతులు. ఇందువల్ల వారి వైజ్ఞానిక క్షమత ఎంత వికసించి ఉన్నదో తెలుస్తుంది.

ఆదిత్యుని నుండి బయటకు వచ్చే కిరణముల ఊర్జా (శక్తి) గురించిన విశ్లేషణ ఇలా ఉన్నది.

**తస్య యే ప్రాచే రశ్మయస్తా ఏ వాశ్య**
**ప్రాచ్యోమధునాయః**
**ఋచ ఏవ మధుకృత ఋగ్వేద ఏవం పుష్పం తా**
**అమృతా ఆ పస్తా వా ఏవా ఋచః**
**ఏవం ఋగ్వేదమభ్యస్తయాం స్తస్యాభితప్తస్య యశస్తేజ**
**ఇంద్రియం వీర్యం మిత్రాత్వాం రసోజాయత**
**తత్వయక్షన్తదాదిత్యమభితో ఆశ్రయత్త ద్వాపతద్యదేతదా**
**దిత్యస్య రోహితం రూపం**
**(ఛా.ఉ. 3-1-5.314)**

**అర్థం :-** ఆ ఆదిత్యుని తూర్పు దిశలోని కిరణములే అంతరిక్ష రూపంలో ఉన్న తేనేపట్టుకు తూర్పు దిశలోనున్న రంధ్రములు. ఋక్కులే మధుకరములు (తేనేటీగలు). ఋగ్వేదమే పుష్పం. సోమ మొదలైనవి అమృత జలములు. ఈ ఋక్కుల రూపంలో ఉన్న మధుకరములు ఋగ్వేదమును అభితప్తం చేశాయి. అభితప్త ఋగ్వేదం నుండి యశస్సు, తేజం, ఇంద్రియములు, వీర్యం, అన్నం యొక్క ఆదిరూపమైన "రసం" ఉత్పన్నం అయింది. అవి అన్నిపోయి ఆదిత్యుని తూర్పు భాగాన్ని ఆశ్రయించి ఆదిత్యుని ఎర్రరంగులో ప్రతిష్ఠితమయ్యాయి.

ఇదే అధ్యాయంలో రెండవ ఖండంలో ఇలా చెప్పబడింది.

**"అథ యే అస్య దక్షిణా రస్మయస్తా ఏ వాస్య దక్షిణ**
**మధునాడ్ యో యజూం ష్యేవ మధుకృతో**
**యజుర్వేద ఏవం పుష్పం తా అమృతా ఆపః"**
**(ఛా.ఉ. 3-2-1)**

**అర్థం :-** ఆదిత్యుని దక్షిణ దిశ కిరణములే దీని దక్షిణ దిశలో వర్తించు మధునాడులు. యజుశృతులే దీని తేనెటీగలు. యజుర్వేదమే పుష్పం. సోమాదులు జలము.

తరువాత మూడవ ఖండములో **"అథయే అస్య ప్రత్యంచో రస్యమయస్తా ఏ వాచ్య ప్రతిచ్యో మధునాడ్యః"** పశ్చిమమున ఉన్న రంధ్రముల నుండి పశ్చిమ దిశకు వెళ్ళే కిరణములే పశ్చిమ మధునాడులుగా చెప్పబడ్డాయి. సామశృతులు వాటిని మధుకరములని (తేనెటీగలు) సామవేదం పుష్పంగా చెప్పబడ్డాయి. (ఛా.ఉ. 3-3-1)

నాలుగవ ఖండంలో ఉత్తర దిశలో ప్రవహించే కిరణములను

మనం చెడు అనుకున్న దానికి ఎట్టి పరిస్థితిలోను లొంగకూడదు.

ఉత్తర మధునాడులుగా చెప్పబడ్డాయి. అథర్వాంగీరసములు వాని తేనెటీగలు, ఇతిహాస పురాణాలే పుష్పములు (ఛా.ఉ. 3-4-1)

పంచమ ఖండలంలో పైకి వెళ్ళే రశ్మల (కిరణముల) వర్ణన ఉన్నది. **"అథ యేస్యోర్ధ్వ రశ్మయస్తా ఏవా స్యోర్ధ్వ మధునాడ్యో గుహ్య ఏవదేశా మధుకృతో బ్రహ్మైవ పుష్పం"** అంటే ఈ ఊర్ధ్వ నాడులు మధుకరముల (తేనెటీగల) యొక్క రహస్యమైన ఆదేశములు. బ్రహ్మయే పుష్పం. (ఛా.ఉ. 3-5-1)

ఈ ప్రతిపాదన ద్వారా చేయబడిన ఆది భౌతిక స్వరూపం యొక్క పుష్టి ఆధునిక భౌతిక భావి పరిశోధనలపై ఆధారపడి ఉన్నది. స్థూల భౌతిక స్వరూపం స్పష్టంగానే ఉన్నది. సూర్యుడు కిరణములను నలువైపుల వెదజల్లుతాడు. మొదటి ఖండములో ఆదిత్యుని రక్త వర్ణ సంకేతమున్నది. రెండవ ఖండంలో శుక్ల వర్ణం, మూడవ ఖండంలో నీల వర్ణం, నాల్గవ ఖండంలో అతి నీల వర్ణ సంకేతాలు ఉన్నాయి.

సూర్యుడు ఉదయిస్తున్నప్పుడు రక్తవర్ణంలో ఉంటాడు. కొంత సేపటికి శుక్లోజ్వలంగా (అతి తెల్లని తెలుపుగా) అవుతాడు. పృథ్వి యొక్క నీడ పడేచోట అంటే సూర్యుని ప్రకాశం ఎక్కడ పడదో అక్కడ నల్లని లేదా సాయంకాలం తర్వాత ఉండే వెలుగు రాత్రి వేళ నల్లని నలుపుగా గోచరిస్తుంది. ఆది దైవిక స్వరూపంలో ఈ ఐదు రకాల వికిరణముల చేతనత్వ మూలంలో ఐదు దేవగణాలు. అవి వసు గణములు, రుద్ర గణములు, ఆదిత్య గణములు, మరుద్గణములు, సాధ్య గణములు, వీటి తర్వాత భౌతిక శక్తులలో రేడియో కిరణములు, అవరక్త వికిరణ ఊర్జా (ఇన్‌ఫ్రారెడ్ రేస్) దృశ్య వికిరణ ఊర్జా (కంటికి కనిపించే వెలుగు), ఎక్స్‌రే వికిరణ ఊర్జా, గామా వికిరణ ఊర్జా. ఈ ఐదు రకాల వికిరణ ఊర్జలు ఐదు దేవగణముల వాహనములు. వీటి మూలంలోని సక్రియ చేతనా ప్రవాహములే దేవ గణములు.

ఉపనిషత్తులలో వివేచన చేయబడిన మధువిద్య దీని ఆధ్యాత్మిక అర్థం. దీనిలో ఐదు అంతరిక్ష రంధ్రముల నుంచి (సవిత యొక్క ప్రవాహం) చెప్పబడింది. ఛాందోగ్యోపనిషత్తులోని 13వ ఖండములో దాని వివరణ ఉన్నది. వాటిని ఐదు దేవ ఋషులుగా చెప్తూ వాటిలో ప్రవహించే పంచప్రాణ ప్రవాహములు ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదానముల గురించి స్పష్టంగా చెప్పబడింది. సర్వవ్యాపక చేతనత్వ సవితా సూర్యుని నుండి వెలువడే సమిష్టి ప్రాణం, దాని నుండి ప్రవహించే పంచ ప్రాణ ధారలే అంతరిక్ష ఛిద్రముల ద్వారా (రంధ్రముల ద్వారా) ప్రవహించే ఐదు రకాల కిరణములు. వీటిలోని నాలుగు ప్రాణ ప్రవాహముల నుండి ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వణ వేదం పుష్పించాయని చెప్పబడింది. ఇక్కడ వేదం అంటే గ్రంథ రూపంలో ఉన్న వైదిక సాహిత్యం కాదు. ఇవి చేతనత్వంలో పరా, పశ్యంతి వాక్కు రూపంలో స్ఫురించిన జ్ఞాన ప్రేరణలు. ఎందుకంటే ఈ పుష్పముల నుండే మధుకరములు (తేనెటీగలు) రసమును గ్రహిస్తాయి. ఋగ్, యజు, సామ, అథర్వణ ఋచికలే మధుకరములు. అంటే శ్రుతులు మూలజ్ఞానం యొక్క వాహములు. దీనిలో జ్ఞాన చేతన ప్రకాశితమవుతుంది. తేనెటీగల సత్వం పుష్పరసం. శ్రుతుల సత్వం పరావాక్కు, పశ్యంతి వాక్కులే. ఇవే సమస్త జ్ఞాన విజ్ఞానములకు ఆధారము. ఈవిధంగా మూల బ్రహ్మ చేతన జ్ఞాన విజ్ఞానములు ఇతిహాస, పురాణాలు మొదలైన రూపంలో వ్యక్తమవుతుంటాయి. ఇవన్నీ జ్ఞానరూపమైన సవితా కిరణములు. ఇదే ఇక్కడ స్పష్టంగా చెప్పబడుతున్నది.

ఊర్ధ్వదిశలో ప్రవహించే కిరణములలో ఊర్ధ్వముఖమైన ప్రాణప్రవాహ వర్ణన ఉన్నది. ఊర్ధ్వగామి చేతన కొరకు నాలుగు వేదముల అనుభూతిపరమైన బోధన మహత్వపూర్ణమైనది.

గీతలో చెప్పినట్లు

**యావనార్థ ఉదపానే సర్వతః సప్లుంతోదకే**
**తాదన సర్వేషు వేదేషు బ్రాహ్మణస్య విజానతః (2/46)**

**అర్థం :-** అన్ని వైపులా జలముతో నిండియున్న పెద్ద జలాశయం అందుబాటులో ఉన్నవానికి చిన్న చిన్న జలాశయముల వల్ల ఎంత ప్రయోజనమో, పరమాత్మ ప్రాప్తినొంది పరమానందమును అనుభవించు బ్రహ్మ జ్ఞానికి వేదముల వల్ల అంతే ప్రయోజనం.

సవితా సాధనా క్రమంలో వేదముల అధ్యయనం, స్వాధ్యాయం తప్పనిసరి. సాధన యొక్క ఉచ్ఛస్థితిలో సమాధి స్థితిలో పరమాత్మతో ఏకత్వం జరిగిన సమయమందు గ్రంథముల ఉపయోగం ఏమి ఉండదు. కాని స్వాధ్యాయంతోనే ఉచ్ఛస్థితి సాధ్యమవుతుంది. సాధనలో నిర్ధారించిన గ్రంథములు, మార్గదర్శనం చేసే సద్గురువులు అడగడుగునా అవసరం అవుతుంది. కాని సవితా సంపర్కం యొక్క అనుభూతి పొందిన క్షణములలో ఆత్మ సత్తాయే వేదం, గురువుగా పనిచేస్తుంది.

**నిజాయితీగా ఉండు, నిజాయితీగా పనిచేయి, నీ హృదయం తేలికవుతంది.**

కుండలిని సాధన సమయమున సుషుమ్న ప్రవాహమున ప్రాణ ఊర్జా ప్రవేశించి ఊర్ధ్వారోహణ చేసినపుడు అతిచేతనలో వెలుగు వ్యాపిస్తుంది. దానినే సూక్ష్మదర్శిలు ధ్వనిమయమైన 'ఓం' అని చెప్పారు. దీనినే గుహ్య ఆదేశమంటారు. ఈ ఆదేశం ప్రణవ రూపమైన పుష్పంతోనే ప్రాప్తిస్తుంది. ఆనందంతో, ఉల్లాసంతో కూడిన గొప్ప సక్రియత ఉత్పన్నం అవుతుంది. అదే కేంద్రంలో ఉన్న మధువు. తూర్పు దిశలోని నాలుగు మధునాడుల ద్వారా ప్రవహించే మధురసం సాధకునికి పౌష్ఠికత, ఇంద్రియముల స్వాస్థ్యం (ఆరోగ్యం), తేజస్విత, వీర్యం (యశస్సు) ప్రాప్తిస్తాయి. ఇవే నాలుగు రకాల మధురసాలు. ఐదవది సుషుమ్న మధ్యనున్న మధువు. ఇది రసములకే రసము.

**తే వా ఏతే రసానాం రసా, వేదా హి రసాస్తేషామేతే**
**రసాస్తాని వా ఏతాన్య మృతానా మమృతాని,**
**వేదాహ్య మృతాస్తేషా మేతాన్యం మృతాని**
**(ఛా.ఉ. 3-5-4)**

**అర్థం :-** అదే రసముల రసం (ఆ దివ్యానుభూతే సర్వోత్తమ మధువు) వేదమే రసం. ఈ దివ్య అనుభూతులు దాని రసమే. వేదమే అమృతం అయితే అది దానికే అమృతం.

పంచకోశ సాధన దృష్టిలో అర్థం చేసుకోవలసినది ఏమంటే అన్నం మొదలైన రసముల ఉత్పత్తి లక్ష్యం అన్నమయకోశ పుష్టి. దీనివల్ల ప్రఖరత, సునిశిత మేధాశక్తి ఉత్పన్నమవుతుంది. ప్రాణశక్తి పెరుగుతుంది. ప్రాణమయకోశం సక్రియమవుతుంది, యశస్సు పెరుగుతుంది. ఇంద్రియముల అధిపతి మనస్సు. ఇంద్రియముల మీద ఆధిపత్యం సాధిస్తే అదే మనోమయ కోశ సిద్ధి.

వీర్యపుష్టి విజ్ఞానమయకోశ సిద్ధికి ఆధారం. తేజస్సువలన అక్షయమైన ఆనందం ఉల్లాసాలు లభిస్తాయి. ఇదే ఆనందమయ కోశ సిద్ధి. ఈ సిద్ధులు సవిత యొక్క చతుర్ముఖి, చతుర్వర్ణ కిరణముల సంపర్కమునకు పరిణామము. సవిత ఊర్ధ్వగామి కిరణముల వలన అమృతానికే అమృతమైన అనుభూతులు లభిస్తాయి. యోగి భాషలో నిర్బీజ సమాధి, ధర్మమేధ సమాధి, జీవన్ముక్తి మొదలైన పేర్లతో చెప్పబడ్డాయి. సవిత మధ్యవర్తి (మధ్యలో ఉన్న) మధువు యొక్క పానం ఈ స్థితిలో జరుగుతుంది. ఇదే సవితా సాధన యొక్క సర్వోచ్చ లాభం, ఇది వశిష్ఠ పదవి పొందినప్పుడే ఇది సంభవమవుతుంది.

సవిత యొక్క అమృత సాక్షాత్కారమే అమృతపానం. ఇదే సమిష్టి ప్రాణం. ప్రాణమునకు ఆధారం, జీవనానికి జీవనం. తన అమృత రసంతో పరమ తృప్తినిచ్చు సవితా దేవత సమిష్టి చేతనా పరబ్రహ్మ గాయత్రీ సాధకులకు ఉపాస్య దేవత, ఇష్ట దైవం కూడా.

*- అఖండ జ్యోతి, జూన్ 1993*

## కదిలించే కళ్లు

39 సీ॥ పున్నమి రోజున పూజ్యులు కనుపించి
కంటి ముందర నుండి కదలసాగె
చంద్రుని కిరణాలు చల్లగా ప్రసరించి
స్వర్ణకాంతులతోడ పరిఢవిల్లె
కురిసేటియామంచు కుదురుగా మెరయుచు
బంగారు వర్షించు పగిదితోచె
గురుదేవురాకతో పరిసరాలన్నియున్
వెచ్చగా దోచుచు వింతగొలిపె

తే॥ గాలిలోనను తామింక వాలుతోడ
నడచుకొంచును పోవనే నడచు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించే గురుదేవు కంటిచూపు

40 సీ॥ ఆకాశమార్గాన అనుసరించుచు పోవ
సూక్ష్మ రూపాలలో సుజనులంత
మేటి గుహలలోన మేనులు మరచుచు
ధ్యానముద్రలలోన కానపడిరి
పేరుపేరున చూపి వారిగూర్చి తెలిపి
ఒక్కరొక్కరి చేరి యోర్పుగాను
పరిచయంబును చేసి పరమపూజ్యులు నాడు
ఋషులను చూపించు కృషి సలుప

తే॥ సరళ భావంబుతో వారు సైగలిడగ
మాట మంతియు లేకనే మరలు విధము
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించే గురుదేవు కంటిచూపు

రచన-మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**సూర్యోదయం ప్రపంచాన్ని వెలుగుతో నింపుతుంది. సద్జ్ఞానం అంతరంగాన్ని వెలుగుతో నింపుతుంది.**

# భారతదేశము యొక్క జ్ఞాన-విజ్ఞానములు అత్యద్భుతమైనవి

అది కలకత్తా నగరం హుగ్లీలోని గంగానది ఒడ్డు. అక్కడ భోలేనాథ్ అనే బాలుడు నిలబడి పవిత్రమైన గంగానది ప్రవాహాన్ని తిలకిస్తున్నాడు. సంధ్యాసమయమౌతున్నది. సూర్యభగవానుడు తన కిరణాలను ప్రసరింపచేస్తున్నాడు. సూర్యునిలోని ఎరుపువర్ణం పడమటి దిక్కుకు జారిపోతున్నది. దానితో గంగాజలములు కూడా అరుణ వర్ణమును సంతరించుకున్నాయి. ఈ రోజు ఎలా పడమటి దిక్కుకు జారిపోయిందో అలానే నా జీవితము కూడా అంతిమదశకు చేరుకుంది అని అతను అనుకుంటున్నాడు. అతను అక్కడికి తన వేదన నుండి విముక్తి పొందేందుకు వచ్చాడు. కానీ అక్కడ అతను ఒక అద్భుతమైన, ఆశ్చర్యకరమైన, విశ్వసించలేని విషయాన్ని గమనించాడు. ఆ గంగా ప్రవాహంలో జటాజూటధారి, సౌమ్యమూర్తియైన ఒక సన్యాసి మాటిమాటికి మునకలు వేస్తున్నాడు. ఆయన గంగా జలములో మునిగి లేచినపుడు ఆ పవిత్ర జలాలు కూడా ఆయనతో పాటు వలయాకారముగా పైకి లేస్తున్నాయి. ఆయన మునక వేసినపుడు అవి కూడా లోపలికి పోతున్నాయి. ఈ విచిత్రలీల చాలా సేపు జరిగింది. భోలేనాథ్ విస్మయంతో రెప్పవేయకుండా ఆ దృశ్యాన్ని తిలకిస్తున్నాడు.

గంగా ప్రవాహంలోనుండి ఆ సన్యాసి బైటకు వచ్చాడు. ఆయన జటల నుండి ముత్యపు బిందువుల వలె గంగా జలము రాలిపడుతున్నది. కాషాయరంగు గల ఆ వస్త్రము బాగా తడిసి సూర్యుని యొక్క అరుణిమవర్ణంతో కలిసి ఇంకా ఎర్రగా కనిపిస్తున్నది. ఆయన ముఖము చాలా ప్రశాంతంగా వుంది. ఆయన చూపులు కాంతివంతంగానూ, స్నేహపూరితంగానూ వున్నాయి. ఆయన అత్యంత మధురమైన స్వరంతో భోలేనాథ్‌ను పిలిచి ఇలా అన్నారు 'నాయనా! గాభరాపడకు, నేనున్నాను కదా! నీవెందుకు దిగులుపడతావు. చూడు నీ శరీరంలోని విషాన్నంతా నేను ఇప్పుడే తీసివేస్తాను' అని అంటూనే తన చేతిని భోలేనాథ్ శిరస్సు మీద పెట్టారు. ఆ పిల్లవాడు ఆ స్పర్శతో అద్భుతమైన చల్లదనాన్ని ఒక్కసారిగా అనుభూతి చెందాడు. వెంటనే పిచ్చికుక్కకాటు చేత తన శరీరంలో నిండిపోయిన విషము వల్ల అప్పటిదాకా అతను అనుభవిస్తున్న భరింపరాని బాధ చేత్తో తీసేసినట్లుగా మాయమైంది. అమృతము తల మీద నుండి జాలువారుతున్నట్లనిపించింది. అద్భుతమైన ఆ ఆనందాన్ని అనుభవిస్తూనే సమాధి స్థితిని పొంది చాలా సేపటివరకు అలానే ఉండిపోయాడు.

దీర్ఘమైన ధ్యానముద్రలో నుండి బైటకు వచ్చారు బాబా విశుద్ధానంద. నెమ్మదిగా కళ్ళు తెరచి పరికించి చూడగా తనకు దగ్గరగా తన ప్రియ శిష్యుడైన గోపీనాథ్ కవిరాజ్ కూర్చొని వున్నాడు. ఆయన పక్కనే ఒక తెల్లని వ్యక్తి ఉన్నారు. వీరితో పాటు ఇంకో ఆరుగురు శిష్యులు కూర్చొని వున్నారు. ఆ వ్యక్తిని తన గురువుకి పరిచయం చేస్తూ గోపీనాథ్ "ఇతను పాల్‌బ్రంటన్. తన జిజ్ఞాసను శాంతపరుచుకునేందుకు మిమ్మల్ని కలవాలని వచ్చాడు. టిబెట్, భారతదేశంతోపాటు యూరప్ దేశాలన్నీ తిరిగి అక్కడి అలౌకిక రహస్యాలను అన్నింటినీ అధ్యయనం చేశాడు" అని చెప్పారు. గోపీనాథ్ ఆ రోజుల్లో కాశీలోని గవర్నమెంట్ కాలేజీకి ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. బాబా ఇవన్నీ శాంతంగా వింటున్నారు కానీ ఆ శాంతస్థితి నుండి ఇంకా బైటకు రాలేదు. అది చూచి గోపీనాథ్ 'బాబా, ఈ రోజేమైనా విశేషమా?' అని అడిగారు. అందుకు బాబా 'లేదు అలాంటిదేమీ లేదు, నా జీవితదిశను మార్చివేసిన చిన్ననాటి సంఘటన తాలూకూ తీపి జ్ఞాపకాలలో మునిగిపోయాను' అంటూ తను చిన్ననాడు చూసిన ఆసన్యాసి గురించి చెప్తూ మౌనంలోకి వెళ్ళారు.

బాబా చెప్పిన మాటలన్నీ విన్న తరువాత గోపీనాథ్ "బాబా ఆయన మీ భవిష్యత్తు గురించి ఏమైనా చెప్పారా? అని అడిగారు. అందుకు బాబా "ఎందుకు చెప్పలేదు? ఆ సాధువు నేను ఒక దైవీ ప్రయోజనము నిమిత్తమై నాకు సహాయము చేసేందుకు వచ్చారని చెప్పారు. నేను జ్యోతిష్యం మరియు సూర్య విజ్ఞానములను అనుసంధానించే ఒక గొప్ప కార్యక్రమము చేయాలని చెప్పి నాకు ఒక బీజమంత్రాన్నిచ్చి ఆయన ఎటో వెళ్ళిపోయారు, ఆయన ఎటు వెళ్ళారో నాకు ఇంత వరకు తెలీదు. మళ్ళీ ఆయన నన్ను ఇంతవరకు కలవలేదు." అని తన గత స్మృతులను నెమరువేసుకుంటూ సాధారణ స్థితికి వచ్చేశారు. తరువాత ఇలా అన్నారు – 'ఈ విదేశీ అతిథి మమ్మల్ని ఎందుకు కలవాలనుకుంటున్నాడు, మా నుండి ఏం తెలుసుకోవాలను కుంటున్నాడు?'. అందుకు పాల్‌బ్రంటన్ చెప్పిన మాటలని అనువదిస్తూ గోపీనాథ్ "ఈయన సూర్య విజ్ఞానము గురించి మీ దగ్గర తెలుసుకోవాలనుకుంటున్నాడు. మీరు చేసే కొన్ని ప్రయోగాలు కూడా చూడాలనుకుంటున్నాడు" అని చెప్పాడు. తెల్లగా ఉండే ఒక రుమాలు తీసుకురమ్మన్నారు బాబా.

**ఇతరుల లోపాలను చూచి తన లోపాలను సవరించుకునేవాడు విజ్ఞుడు.**

పాల్‌బ్రంటన్ తన యొక్క తెల్లరుమాలును తీసి ఇచ్చాడు. బాబా ఒక చిన్న భూతద్దాన్ని తీసుకుని సూర్యకిరణాలను కేంద్రీకరించి ఇలా అన్నారు, 'చెప్పు నీకు ఎటువంటి సుగంధము కావాలి? బ్రంటన్ మల్లెపూవుల సుగంధము కావాలని అడిగాడు. బాబా కుడిచేతితో రుమాలు తీసి దానిమీద భూతద్దాన్ని ఉంచారు. కొద్దిసేపు సూర్యకిరణాలు ఆ రుమాలు మీద వయ్యారంగా వంపులు తిరిగాయి. ఆ తరువాత భూతద్దాన్ని తీసివేసి రుమాలు తిరిగి ఇచ్చేశారు బాబా. ఆ రుమాలు మొత్తం మల్లెల సుగంధంతో నిండిపోయింది. ఆ తరువాత ఆ రుమాలుకి గులాబీ సుగంధాన్ని, ఇంకోపువ్వు సుగంధాన్ని కూడా తెప్పించారు బాబా.

ఈ సంఘటన సమయంలో బాబాతో తన ప్రథమ పరిచయ సమయంలో బాబా బుద్ధ భగవానుని శరీరమంతా సుగంధంతో నిండివుండేదని చెప్పిన విషయం గోపీనాథ్‌కి గుర్తు వచ్చింది. బుద్ధుడు నివసించే కుటీరాన్ని 'గంధ కుటీరము' అని అంటారని కూడా చెప్పారు. శ్రీకృష్ణభగవానుని శరీరము యొక్క సుగంధము గురించి 'చైతన్యచరితామృతము' (అన్త్యలీల, 19 పరిచ్ఛేదం)లో చెప్పబడింది. గోవిందలీలామృతము (8/6) లో కూడా శ్రీకృష్ణ భగవానుని శరీర సుగంధము గురించిన వర్ణన వుంది.

భక్తులందరికీ శ్రీకృష్ణుని అంగములనుండి వ్యాపించిన పుణ్యగంధము యొక్క అనుభూతి లభించేది. అది కస్తూరీ, కర్పూరము, నీలోత్పలము, చందనము, తులసిల సమ్మిశ్రిత సుగంధముగా ఉండేది. అటువంటి వాసనను నీవు కూడా అనుభూతి చెందుతావా అని బాబా అడిగారు. సరేననగానే ఒక సీసాను తీసుకురమ్మన్నారు. సూర్యకిరణాలను దానిలోకి కేంద్రీకరించి 'ఇదిగో శ్రీకృష్ణభగవానుని దేహము యొక్క గంధము' అని చెప్పారు. గోపీనాథ్ ఇలా వ్రాస్తున్నారు "ఆ దృశ్యము చూసిన నేను ఆశ్చర్యచకితుడైనాను. ఈ సుగంధముతో నా రోమరోమము పులకించిపోయింది. నేను మేలుకొని లేను, నిద్రించలేను, అదొకరకమైన విచిత్రస్థితి. కానీ అద్భుతమైన స్థితి. నేను ఈ సీసాను ఇంటికి తీసుకెళ్ళవచ్చా అని బాబాను అడిగితే 'తీసుకెళ్ళు, కానీ జాగ్రత్తగా వుంచుకుంటే సుగంధము అలానే వుంటుంది' అని చెప్పారు."

బాబా ఇంకా ఇలా చెప్పారు "శ్రీరాధా దేహము నుండి నిరంతరము పద్మముల సుగంధము వెలువడుతూ వుంటుంది. అందుచేతనే ఆమెను పద్మినీ అని పిలుస్తారు. శ్రీ చైతన్య మహాప్రభు దేహము నుండి కూడా నిరంతరము పద్మగంధము వెలువడుతూ ఉంటుంది. లలితాసహస్రనామస్తోత్రంలో త్రిపురసుందరీదేవని 'దివ్యగంధాఢ్యా' అని చెప్తారు. బ్రహ్మచర్యసిద్ధి కలిగిన తరువాత వారివారి స్వభావమునననుసరించి దివ్యమైన సువానస ఆవిర్భవిస్తూ ఉంటుంది. యోగము యొక్క నాలుగు స్థితులలో ప్రారంభస్థితి యందు దేహము శుద్ధియగుట చేత దివ్యమైన సువాసన ఉత్పన్నమౌతుంది". శ్వేతాశ్వతరోపనిషత్తులో కూడా యోగస్థితిలో వచ్చే దివ్యసుగంధము గురించి వ్రాయబడి ఉంది. తరువాత నేను 'మీరు ఈ విద్య ఎక్కడ నేర్చుకున్నారు' అని అడిగాను. అప్పుడు ఆయన ఎంతో ప్రేమతో తాము ఆ విద్యను 'జ్ఞానగంజ్' అనే ప్రదేశంలో నేర్చుకున్నామని చెప్తూ 'అక్కడ యోగము మరియు విజ్ఞానముల శిక్షణ ఇవ్వబడుతుంది. అక్కడ విజ్ఞాన విభాగమునకు ప్రిన్సిపాల్‌గా శ్రీమద్ భృగురామపరమహంస ఉండేవారు. ఆయన వయస్సువేల సంవత్సరాలు. సూర్యవిజ్ఞానము నేర్చుకుంటే అన్ని రకాల విజ్ఞానములకు తలుపులు తెరుచుకుంటాయని చెప్పారు. ఈ విజ్ఞానము నేర్చుకున్న తరువాత నేను స్వయంగా అనేక సూక్ష్మ కోణాల గురించి పరిశోధించాను, పరిశోధిస్తున్నాను" అని ముగించారు.

పాల్‌బ్రంటన్ గోపీనాథ్‌గారితో ఇంగ్లీషులో ఏదో చెప్పారు. అంతలో బాబా తమ అలౌకిక స్మృతుల నుండి బైటకు వచ్చారు. పాల్‌బ్రంటన్ 'ఇది యోగమా? విజ్ఞానమా?' అని అడిగారు. అందుకు బాబా 'ఇది యోగము కాదు, విజ్ఞానము యొక్క ప్రయోగం సూర్యుని యొక్క కిరణములను గుర్తిస్తే ఆ కిరణములను ఒక పద్ధతి ప్రకారం కలుపగలిగితే దేనినైనా తయారుచేయవచ్చు. క్రొత్త దానిని సృష్టించవచ్చు. సృష్టించిన దానిని నాశనము చేయవచ్చు. అవసరమైతే దానినలాగే ఉంచుకోనూవచ్చు. నీవు కూడా సూర్యరశ్మిలో దాగివున్న విశిష్టశక్తులను గురించి తెలుసుకుంటే వాటిని వేరుచేసి కలుపగలుగుతావు. నీవు కూడా అద్భుతమైన చమత్కారములు చూపించగలిగే సామర్థ్యమును పొందుతావు' అని చెప్పారు.

'మీరు మరి ఇందుకు సంబంధించిన శిక్షణనిచ్చే వ్యవస్థ ఏదైనా ఏర్పాటు చేశారా?' అని పాల్‌బ్రంటన్ అడిగారు. 'లేదు కానీ శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాము. ఇందుకొఱకు కొంతమంది శిష్యులను సిద్ధం చేస్తున్నాము. ప్రస్తుతము సూర్యవిజ్ఞానముకు సంబంధించిన ప్రయోగశాల తయారౌతున్నది.' అని చెప్పారు బాబా. బాబా చెప్పిన మీదట ఆ అద్భుత ప్రయోగశాలను చూపించేందుకు గోపీనాథ్ పాల్‌బ్రంటన్‌ను అక్కడికి తీసుకువెళ్ళారు. ప్రయోగశాల ఒక అత్యాధునికమైన ఇల్లువలె ఉంది. అందులో చాలా

**ఆత్మీయత, మమత, ఉదారత మానవత్వ లక్షణాలు.**

అంతస్థులున్నాయి. అవి చాలా విశిష్టమైన రీతిలో నిర్మించ బడుతున్నాయి. గోడలు ఎర్రని ఇటుకలతో నిర్మించబడుతున్నాయి, కిటికీల స్థానములో పెద్ద పెద్ద రంధ్రములు మాత్రమే వున్నాయి. అక్కడ పెద్ద పెద్ద గాజు పలకలు పెడతారు. కానీ అవి ఇంకా తయారవలేదు. గాజు వాడటానికి కారణము ఏంటంటే పరిశోధనలకు సూర్యకిరణములోని ఎరుపు, పసుపు, ఆకుపచ్చ, నీలి రంగులను పట్టకము ద్వారా ప్రతిబింబింప చేయవలసి వుంటుంది, కానీ ఈ గాజు నిర్మాణములు ఇంకా పూర్తి కాలేదు. ప్రయోగశాల ఒక పెద్ద తోటలో వుంది. తోటకు అన్ని వైపులా మఱ్ఱి వంటి మహావృక్షాలు తమ కొమ్మలను విస్తరింపచేసి నీడనిస్తూ ఉన్నాయి.

ప్రయోగశాల చూడడం పూర్తయ్యేసరికి సాయంత్రమైంది. అక్కడున్న శిష్యులేకాక ఇంకా చాలామంది శిష్యులు అక్కడికి చేరుకున్నారు. కొంతమంది శిష్యులు ఆయనకు దగ్గరగా కూర్చొనివున్నారు. ఒక శిష్యుని కోరికమేరకు బాబా ఒక గులాబీపువ్వును కుడిచేతిలోకి తీసుకుని స్ఫటికయంత్రము (భూతద్దం) ద్వారా దానిపై సూర్యకిరణములను కేంద్రీకరించి జవాపువ్వు (బ్రహ్మజెముడు పువ్వు)గా మార్చారు. ఇవన్నీ చూస్తున్న పాల్‌బ్రంటన్ ఆగలేక ఆ సిద్ధాంతము గురించి తెలుసుకోవాలనే కుతూహలమును ప్రకటించాడు. అప్పుడు బాబా ఇలా చెప్పారు. 'సూర్యుడు జగత్తుకు ప్రసవిత. **అన్ని పదార్థముల మూలతత్వములు సూర్యకిరణముల యొక్క విశిష్ట సంయోగము వలననే తయారౌతాయి.** వీటియొక్క విశిష్ట సంయోగము వలననే విభిన్నరకాలైన పదార్థముల సృష్టి జరుగుతుంది. సూర్యకిరణముల శుద్ధరూపమును తెలుసుకొనుటయే సూర్యవిజ్ఞానములో ప్రతిపాదించబడిన విషయము. వీటి మీదనే సూర్యవిజ్ఞానము ఆధారపడి ఉంది.

'సూర్య కిరణాలలో రకరకాల వర్ణాలు ఉన్నాయి. ఇవే రంగులు. ఇవి అనేక రకాలుగా కలవడము, విడిపోవడము వల్ల విభిన్న రకాలైన పదార్థములు తయారవుతాయి. సూర్య కిరణములతో సంబంధమును స్థాపించుకుని రకరకాల కిరణముల మధ్య జరిగే సంఘటనలే సూర్యవిజ్ఞానము యొక్క రహస్యము. దీని ద్వారా సృష్టి, లయము, అంతర్ధానము, రక్షించుట అన్నీ సంభవమే. సూర్యవిజ్ఞానం ద్వారా కేవలము స్థూల పదార్థాలను సృష్టించడము మాత్రమే కాక సుఖఃదుఖములు, పాపపుణ్యములు, కామక్రోధములు, లోభమోహములు వంటి వికారాలను, సంస్కారాలను నాశనము చేయడము కూడా సాధ్యమౌతుంది. సూర్యుని యొక్క విశిష్ట సాధన చేయడము ద్వారా కామవాసనలను మార్చడము కూడా సంభవమే. ఎంత అసంభవమైన పనైనా సరే దీనితో సంభవమౌతుంది.

సూర్య విజ్ఞానము యొక్క సిద్ధాంతాలను, రహస్యాలను విన్న పాల్‌బ్రంటన్ పరమానందభరితుడైనాడు. అతని ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. బాబా విశుద్ధానందగారి వద్ద శిష్యరికం చేయాలనే కోరికను వెలిబుచ్చాడు. కానీ ఆదేశము లేనిదే తాము శిష్యునిగా స్వీకరింపలేమని బాబా చెప్పారు. ఏది ఏమైనా ఈ అద్భుత రహస్యాలను తన కన్నులతో దర్శించిన పాల్‌బ్రంటన్ అప్రతిభుడైనాడు. ఆయన గోపీనాథ్ గారితో 'భారతదేశము యోగము మరియు విజ్ఞానములకు పుట్టినిల్లు. ఏ రోజైతే ఋషుల ఈ సూక్ష్మ విజ్ఞానముల అన్వేషణ, ప్రయోగములు ప్రారంభమవుతాయో ఆ రోజు నుండి భారతదేశము తిరిగి మానవజాతిని ఉద్ధరించడమనే మహత్తరమైన బాధ్యతను నిర్వహించుటలో సమర్థతను, సామర్థ్యాన్ని పొందుతుంది. ఇదే భారతదేశము యొక్క భవిష్యత్తు, దీనిని ఎవరూ ఆపలేరు' అన్నారు.

*- అఖండ జ్యోతి సెప్టెంబరు, 2010*

*అనువాదం : శ్రీమతి వల్లీ శ్రీనివాస్*

## తల్లి వేదన

*తుఫాను గాలి వేగానికి వేళ్ళతో సహా ఒక పెద్ద వృక్షం క్రింద పడిపోయింది. ఆ వృక్షానికి భూమిపై చాలా కోపం వచ్చింది. ఆ వృక్షం ఇలా అన్నది "నేటి నా దుర్గతికి నీవే బాధ్యత వహించాలి. నీవు నా ఆహారాన్ని ఆపివేశావు. ఒకటి రెండు రోజులయితే సహించగలను. కాని ఆకలి దప్పికతో అలమటించి ఎండిపోయాను. ఎంత నిర్దయగా ఉన్నావు. నేను ఇలా పడిపోతే నీ గుండె చల్లబడింది."*

*వృక్షం అన్న ఈ మాటలకు భూమాత చాలా దుఃఖించింది. సమాధానమిస్తూ ఇలా అన్నది "తల్లి ఎక్కడయినా తన సంతానం దుర్గతిని చూచి సంతోషిస్తుందా? నేను మీ అందరి కొరకు నా లోపల జలం, ఇతర పౌష్టిక తత్వాలు దాచి ఉంచుతాను. ఏ విధంగా మీ వృక్షాలు మీ ఫలాలను మీ కొరకు కాక ఇతరులకు ఇస్తున్నారో నేను కూడా ప్రోగు చేసిన ఆహారాన్ని మీ కోసం ఉంచుతాను. అవసరాన్ని బట్టి ఇస్తాను. కాని నీ వేళ్ళు నిస్సారమయిపోయాయి. దీనికి నేనేమి చేయగలను?*

- ప్రజ్ఞా పురాణం నుండి

**మన కార్యశూరతను మేలుకొలిపే వరం - కష్టం.**

# మనఃశ్శక్తి - మస్తిష్కశక్తి

శరీరంలోని అన్ని అవయవాలకూ వాటివాటి ప్రత్యేకతా, ప్రాముఖ్యమూ ఉన్నాయి. తమదైన రీతిలో అన్నీ గొప్పవే, ఉపయోగకరమైనవే, ఐతే శ్రేష్ఠత్వం యొక్క దృష్టితో చూస్తే 'మెదడు' యొక్క ప్రాముఖ్యత అన్ని అవయవాలకన్నా మిన్నగా ఉంటుంది. బహుశ: అందువల్లనే కాబోలు, భగవంతుడు దానిని శరీరమనే హిమాలయ పర్వతం యొక్క సర్వోచ్ఛశిఖరం పైన ఎవరెస్ట్ శిఖరం వలె ప్రతిష్ఠించాడు. పుఱ్ఱె అనే అతి బలిష్ఠమైన కోటవంటి ప్రదేశమును దాని నివాసమునకు ఏర్పరచాడు. దెబ్బల తాకిడినుండేకాదు, ఋతు ప్రభావాలనుండీ, వికిరణాల బారినుండీ, అనేకానేక కల్మషాలబారినుండీ మెదడును సురక్షితంగా కాపాడగల శక్తి ఈ పుఱ్ఱెకు ఉంది. పుఱ్ఱె యొక్క గోడలు బయట ప్రపంచంతో ఎంతో ముఖ్యమైన సంబంధాన్ని కలిగివుంటాయి. అంతేకాక ఇవి మెదడుకే కాదు, యావత్ శరీరానికికూడా మంచి ఉపయోగాన్ని చేకూరుస్తాయి.

అప్పుడే పుట్టిన మనిషి యొక్క మెదడు 350 గ్రా॥ల ఔన్సులు మాత్రమే ఉంటుంది. కానీ వయస్సు పెరిగేకొద్దీ అది సుమారు 1.5 కిలోల బరువుదాకా పెరుగుతుంది. బరువుతో పోలిస్తే దీని కార్యనిర్వహణాశక్తి ఇంకా ఎన్నో రెట్లు ఎక్కువగా ఉంటుంది. మైక్రోఫిల్మ్‌ల సహాయంతో పెద్ద పెద్ద గ్రంథాలను ఒక చిన్న డబ్బాలో దాచివుంచగలం. ఆరోగ్యవంతమైన ఒక మంచి మెదడులో ఒక కోటి గ్రంథాలలో వ్రాయగలిగినటువంటి సామగ్రిని సమీకరించి ఉంచగలం. అవసరమైనప్పుడు ఈ శక్తి సహజంగానే రెట్టింపు కాగలదు. ఏ కారణం చేతనైనా, మెదడులోని కొంత భాగం జడమైనప్పటికీ మిగిలిన దానితోనే పని జరుపగలం. ఒకే కన్ను, కాలు, చెయ్యి కలిగిన వ్యక్తులు ఎంతోమంది ఉంటారు. ఇలాగే ఏ కారణం వల్లనైనా ఒక ఊపిరితిత్తి, ఒక మూత్రపిండం దెబ్బతిన్నపుడు రెండింటి యొక్క పనిని ఒక్కటే నిర్వహించగలదు. రెండు మెదడులు ఉండవు కానీ, ఒక్క మెదడులోనే గాయం కావటం చేతగానీ, దెబ్బతగలడం వల్లకానీ కొంత భాగం నిష్క్రియమైనప్పుడు, ఆ మిగిలిన భాగంతోనే ఏదోవిధంగా జీవితాన్ని లాగుతూవుంటుంది. రెండవ ప్రపంచ యుద్ధం జరిగినపుడు చాలామంది సైనికులకు మెదడులో తూటా తగలడం వల్ల వారి మెదడులోని కొంత భాగం దెబ్బతిన్నదేకానీ, ఆ సైనికులు మరణించడం మాత్రం జరుగలేదు. అప్పుడు అందుబాటులో ఉన్న వైద్య సౌకర్యాన్ని కల్పించి వారిని రక్షించడం జరిగింది. దీనివలన వారి శక్తి సామర్థ్యములు కొంతవరకూ ప్రభావితం కాబడ్డాయి, అయితే జీవితంలో సంపూర్ణమైన ఆనందాన్ని వారు పొందగలగలేదని మాత్రం చెప్పలేం.

భౌతికశరీరం యొక్క ఆకారం, పరిమాణం, బరువు మొదలగు వాటిననుసరించి ఆ మనిషి యొక్క బలం, శక్తిసామర్థ్యాలను కొంతవరకూ ఊహించగలం. కానీ మెదడు యొక్క బరువు అనుసరించి వ్యక్తి యొక్క తెలివితేటలను లేదా మూర్ఖత్వాన్ని అంచనావెయ్యలేము. బాగా అభివృద్ధిచెందిన నాగరికుని మెదడు సుమారు ఒకటిన్నర కిలోల బరువు ఉంటుంది. ఏనుగు మెదడు దాదాపు 5 కిలోలుకాగా, అది మనిషితో పోలిస్తే తెలివితక్కువ ప్రాణియేకదా! బుద్ధి(తెలివి) కార్టెక్స్‌లో వ్యాపించియున్న నాడీకణజాలంతో సంబంధం కలిగివుంటుంది. ఆ ప్రత్యేక ప్రదేశంలో కణాలు ఎంత ఘనిష్ఠంగా తమ పరిసరాలలోని ఇతర కణజాలంతో జోడింపబడి ఉంటాయో, వాని మధ్య మంచి సంబంధబాంధవ్యాల పరంపర అంతే స్ఫూర్తివంతంగా ఉంటుంది అన్నది కూడా చాలా ముఖ్యమైన గమనించవల్సిన విషయం. అభివృద్ధిపరంగా ఆలోచిస్తే సహకారమనేది అన్ని రంగాలలోనూ పనిచేస్తూవుంటుంది. తెలివితేటలకు ఆధారభూమికూడా అదే! మానవుని మెదడులోని కణజాలాల నిర్మాణం వాటి యొక్క సామర్థ్యం గమనిస్తే దీనిని సహజంగానే అంగీకరించగలం.

శరీరాన్ని పర్యవేక్షించడం మొదలుకొని, మానసిక ఒత్తిళ్ళను తట్టుకొనేటంతవరకూ, భావానుభూతులు మొదలు చిత్రవిచిత్రమైన ఊహలను అల్లుకొనటం వరకూ, మెదడులోని అతి చిన్న ప్రదేశంలోనే జరుగుతూవుంటుంది. అనుభవాలు అందులోనే ఏకత్రితమౌతువుంటాయి. ఆలోచనలు-ప్రణాళికలు అందులోనే తెలివితేటలతో కూడిన కణజాలములుగా మనకు గోచరిస్తాయి. శరీరంలోని సంకోచ-వ్యాకోచాలు, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు, ఆహారం స్వీకరించుట-విసర్జించుట వంటి అనేకమైన తేలికపాటి పనులేకాక; కఠినమైన పనులు-ప్రక్రియలూ కూడా మెదడులోనే పర్యవేక్షించబడుతువుంటాయి. వేదాంతం, విజ్ఞానం, పరిశ్రమలు, వ్యాపారం, సంగీతం, కళలు, పరాక్రమం మొదలైన లెక్కలేనన్ని ప్రవృత్తులు ఈ మెదడులోనే జన్మించడం, అభివృద్ధి చెందటం, చివరకు నశించడం కూడా జరుగుతు వుంటుంది. శరీర నిర్మాణమూ, కార్యవిధానమూ ఏదైనాసరే వాటిని సంపూర్ణంగా పర్యవేక్షించడమూ, నియంత్రించడమనేది ఒక్క మెదడుకుమాత్రమే సాధ్యమౌతుంది. మనస్సును గురించిన సముచితమైన జ్ఞానం మనకు గనుక ఉన్నట్లయితే ఎవరు

**కష్టాలకు కుంగిపోక వాటిని తొలగించుకునే ఉపాయాలను వెదకడం విజ్ఞత.**

ఎటువంటి జీవనాన్ని గడుపుతారు, భవిష్యత్తులో ఏమి కాబోవుచున్నారు, ఏమి పొందబోవుచున్నారు మొదలైన అంశాలన్నీ మనకు తెలియగలవు.

పుఱ్ఱె లోపల నిండివున్న ఈ కొద్ది పదార్థమూ తనకున్న గ్రహణశక్తి దృష్ట్యా ఎంతో అద్భుతమైనది. అవసరమొచ్చినప్పుడు, లోపల ఉన్న జ్ఞానమనే భండాగారం నుండి కావల్సిన దానిని వెంటనే వెలికి లాగగలిగే దీని నైపుణ్యం ఇంకా ఆశ్చర్యదాయకమైనది. ఈపరంగా ఆలోచిస్తే ప్రపంచంలో ఏ విలువైన గ్రంథాలయం గానీ, లేదా మానవుని చేత తయారు చేయబడ్డ కంప్యూటర్‌గానీ మానవుని మెదడుతో సరితూగలేవు. యంత్రాలనేవి ఏ పనికోసమైతే తయారుచేయబడతాయో ఎంత శక్తితో తయారుచెయ్యబడతాయో అవి అంతే పనిని అంతే శక్తితో నిర్వహిస్తాయి. ఐతే మెదడు అలా కాదు. అది తన క్రియా నైపుణ్యంతోపాటు, స్థాయినికూడా నిరంతరం వృద్ధిచేసుకుంటూనే వుంటుంది. ఉపాధ్యాయుడు పాఠశాలలో తన వృత్తిధర్మాన్ని నిర్వహిస్తూనే తన యోగ్యతను అభివృద్ధి చేసుకునేటందుకు క్రొత్త క్రొత్త పరీక్షలలో ఉత్తీర్ణుడు అవుతూవుంటాడు; అదేవిధంగా మెదడుకూడా బాల్యంనుండీ, మరణపర్యంతం వరకూ తన పని తాను చేసుకుంటూనే, తన యోగ్యతను వృద్ధి చెందించుకునే ప్రయత్నాలు చేస్తూనేవుంటుంది. మెదడు యొక్క నిర్మాణమూ, దాని క్రియాశక్తికి సంబంధించి, ఇంతకుముందు కొన్ని విషయాలను తెలుసుకున్నాం. ఐతే ఇంకా తెలుసుకొనవల్సిన విషయాలతో పోలిస్తే, మనకు తెలిసిన విషయాలు చాలా తక్కువ! మనకు బాగా తెలిసిన, ఇంతకుముందే అమలులో ఉన్న క్రియాశక్తి దృష్ట్యా చూస్తే, మెదడును మానవ నిర్మితమైన మరి దేనితోను సరిపోల్చలేం. అయినప్పటికీ దానిలో ఇంకా ఎన్నో అరలు మూసివేయబడివున్నాయి. వాటినన్నింటినీ కూడా క్రియాన్వితం చేయగలిగితే, మానవుని శారీరక, మానసిక శక్తి ఈనాటి క్రియాశక్తితో పోలిస్తే, దేవదానవుల కన్నా ఎంతో బలిష్ఠంగా, సమర్థవంతంగా రూపుదిద్దుకొనగలదు.

స్వభావసిద్ధంగా ప్రకృతి ముడిరూపంలో ఉంటుంది. పదార్థంలో బుద్ధి అనేది లేనప్పుడు అది అస్తవ్యస్తమైన స్థితిలో పడివుంటుంది. పరమాణువులలోనూ, తరంగ ప్రవాహాలలోనూ సైతం సామర్థ్యమూ, గతిశీలతా కూడా ఉంటాయి. కానీ మెదడు వంటి ఒక కేంద్రీయసంస్థ అనే నిర్మాణం లేకపోవటం చేత పదార్థమును వ్యవస్థీకరించటానికీ, దానిని తేజోవంతంగా చేయటానికీ, దానినుండి ఏదైనా సాధించి చూపించటానికీ సాధ్యం కాదు. అటవీప్రదేశాలు, మరుభూముల యొక్క భయావహ పరిస్థితిని చూసి మనం ఈ సత్యాన్ని తెలుసుకొనవచ్చు. ఇతర గ్రహనక్షత్రాల యొక్క స్థితికూడా ఇదేవిధంగా వికసించని పరిస్థితిలో ఉంటుంది. 'తెలివిగలిగిన మానవ ప్రాణి' యొక్క ఉనికి లేని కారణంగా, అక్కడ పరిస్థితి నిస్తబ్దత, రసహీనతతో నిండి వుంటుంది. సరిగ్గా దీనికి వ్యతిరేకంగా భూమిమీద మానవులు తమ మేధాసంపత్తితో, పరాక్రమంతో ఈ ధరిత్రిని కామధేనువు వలె శోభాసంపదలతో అలరారేవిధంగా చెయ్యటమేకాదు, ఇతర ప్రాణులకు కూడా ఈ భూమి తగిన సుఖసౌకర్యాలను అందించగలిగేటట్లు తయారుచేశాడు. ఇదంతా ఎలా సాధ్యమైంది? అన్న ప్రశ్న వేసుకుంటే, 'ఇదంతా మానవుని మెదడులోని తెలివితేటల యొక్క అద్భుత ఫలితమే' అన్న సమాధానం వస్తుంది.

'మస్తిష్కం యొక్క శక్తి' అనేది ఏదో మంత్రజాలం కాదు, చిత్రవిచిత్రమైన కుతూహలాన్ని ఉత్పన్నం చేసే నటన కాదు. అది ఈశ్వరప్రదత్తమైన ఒక దివ్యసంపద, దానిని పలురకాలైన మార్గములతో మరింత అభివృద్ధిపరచుకొనవచ్చు. శక్తివంతం చేసుకొనవచ్చు. శారీరక పోషణకొరకు వ్యాయామం, మర్దన వంటి ఉపాయాలనూ, రసాయనిక పోషణకుగానూ బాగా వండిన పౌష్టికాహారం తీసుకొనుటవంటి మార్గాలను అనుసరించినట్లు గానే, మానసికశక్తులను మరింత మెరుగుపరచుకొనటానికి, సాత్త్వికమైన తెలివితేటలలో ఉపయోగకరమైన తీక్షణత్వమును ఉత్పన్నం చేయగలిగే సామర్థ్యంతో కూడిన సూక్ష్మశక్తిసంపన్నమైన ఆహారాన్ని ఏర్పాటుచేసుకోవాలి. మనస్సనే సంస్థలో స్వయం పర్యవేక్షణలో శక్తి ఉత్పాదక కేంద్రం ఒకటి ఉన్నప్పటికీ, బయటనుండి కూడా ఆ వ్యవస్థకు సహాయాన్నందించటానికి ఎంతో చేయవచ్చు. వీనిలో పలువిధాలైన యోగాభ్యాసములే కాకుండా, జపతపాలు, వ్రతాలు, సంయమం, ధ్యానం, ఉపాసన మొదలైనవి ముఖ్యమైనవి. జపతపాలవల్ల మానసికశక్తి పెరుగుతుంది. ఏకాగ్రత పెరుగుతుంది, ఆయా శక్తులు అభివృద్ధి చెందటానికి తోడ్పడతాయి. అనియంత్రణ, అనాచరణ మొదలైనవానిపై అంకుశాన్ని ప్రయోగించి మానసికతలాన్ని వికసింపజేసుకొనుటలో యోగాభ్యాసములను ఉపయోగించు కోవాలి. అలా చేయటం వల్ల ఆలోచనలు, చేతనత్వం రెండూ కూడా అసాధారణమైన రీతిలో సానబెట్టబడతాయి. తద్వారా మనం సహజంగానే మనోబల సంపన్నులం కాగలం. మనోబలం యొక్క పటిమ-శారీరకశక్తి, విద్యాశక్తి, సంపదశక్తి, నైపుణ్యశక్తి మొదలైన వాటిన్నింటికన్నా ఎంతో ప్రాముఖ్యత కలిగినది అన్న విషయం వేరుగా చెప్పనవసరం లేదు. దీని సహాయంతో మానవుడు ఎవరికీ ఊహించటానికి కూడా సాధ్యం కానటువంటి ఉన్నత శిఖరాలను అందుకోగలుగుతాడు.

*– అఖండజ్యోతి, సెప్టెంబరు 2000*

*అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి, గుంటూరు*

**ఇతరుల దోషాలను ఎంచే ముందు నీ దోషాలను చూడు.**

## గాయత్రి - 24 శక్తి ధారలు (20)

# భువనేశ్వరి

భువనేశ్వరి అంటే ప్రపంచంలో నిండి ఉన్న ఐశ్వర్యానికి అధిష్ఠాత్రి. పదార్థములు ద్వారా లభించే సుఖ సాధనములను వైభవమంటారు. ఐశ్వర్యం ఈశ్వరుని గుణం. అది ఆంతరిక ఆనందరూపంలో లభ్యమవుతుంది. ఐశ్వర్యం యొక్క పరిధి చిన్నది కావచ్చు, పెద్దది కావచ్చు. చిన్న చిన్న సత్ప్రవృత్తులు సొంతం చేసుకోవడం వల్ల కాలక్రమంలో చిన్న ఐశ్వర్యం అందుతుంది. కాని ఇది పరిమిత సమయంలో పరిమిత ఆనందాన్ని ఇచ్చే ఐశ్వర్యం. దీనిలో అనుభూతి ఎంత మధురంగా ఉంటుందంటే ఇంకా ఇంకా పొందాలనే తపన కలుగుతుంది. భువనేశ్వరి దీని కన్న ఉన్నతమైన స్థితి. దీనిలో సృష్టిలోని ఐశ్వర్యం అంతా పొందే అధికారం ఉన్నట్లు అనిపిస్తుంది. స్వామి రామతీర్థ తనను "రామ్ బాద్‌షా" అని చెప్పుకునేవారు. వారికి తనే విశ్వానికి అధిపతిననే భావన కలుగుతుండేది. ఫల స్వరూపంగా ఆ స్థాయికి చెందిన ఆనందాన్ని పొందుతుండేవాడు. చిన్న చిన్న పదవులు పొందేవారు, చిన్న చిన్న వస్తువులు పొందేవారు ఆత్మ తృప్తి, గౌరవం పొందుతారు. అలాంటప్పుడు సమస్త విశ్వానికి అధిపతిననే అనుభూతి ఎంత ఉత్సాహానిస్తుందో, మనస్సు ఎంత ఆనందంతో వెల్లివెరిసిపోతుందో! ఒక చిన్న రాజ్యానికి అధిపతి అయిన రాజు తను గౌరవింపదగిన వాడినని, సౌభాగ్యవంతుడని ఎన్ని రకాలుగా భావించుకుంటాడో మనకందరికి తెలిసినదే. తన ఆధిపత్యం, గౌరవం పెంచుకోవాలని చిన్న పెద్ద రాజ్యాలను తన రాజ్యంలో కలుపుకోవాలని చూస్తాడు.

వైభవమనేది మనిషికి సంబంధించినది, భౌతికమైనది. ఐశ్వర్యం ఆధ్యాత్మికమైనది, భావనాత్మకమైనది. అందువల్ల దాని ఆనందానుభూతి ఆ నిష్పత్తిలోనే అధికంగా ఉంటుంది. భువనమంతా నిండివున్న చేతనాత్మక ఆనందానుభూతి యొక్క ఆనందం దేనిలో నిండి ఉన్నదో దానినే భువనేశ్వరి అంటారు. గాయత్రి యొక్క ఈ దివ్య ధార ఎవరిమీద అవతరిస్తుందో వారికి విశ్వంలోని ఐశ్వర్యానికి ఆధిపత్య సౌభాగ్యం కలిగినట్లు అనిపిస్తుంది. వైభవంతో పోలిస్తే ఐశ్వర్యం యొక్క ఆనందం అనంతమైనది. భువనేశ్వరి వల్ల భగవంతునికి ఎటువంటి అనుభూతి కలుగుతుందో సాధకునికి కూడా అదే అనుభూతి కలుగుతుంది.

భావనల దృష్టిలో ఇది పరిపూర్ణమైన ఆత్మగౌరవాన్ని అనుభవిస్తున్న స్థితిగా గోచరిస్తుంది. వస్తు స్థితి దృష్టితో చూస్తే ఈ స్థాయి సాధకుడు బ్రహ్మీభూతుడయి, బ్రాహ్మీ స్థితిలో ఉంటాడు. అందువల్ల అతని వ్యాపకత, సమర్థత పరబ్రహ్మ స్థాయిలో ఉంటుంది, భువనమంతా పడివున్న విభిన్న రకాల పదార్థాలను నియంత్రించగలుగుతాడు. పదార్థాల వల్ల పరిస్థితుల వల్ల పొందే ఆనందాన్ని అతను తన సంకల్ప బలంతో తగినంతగా ఆకర్షించుకోగలుగుతాడు.

భువనేశ్వరి మనఃస్థితిలో విశ్వంలో నిండివున్న అంతః చేతనను తన బాధ్యతగా భావిస్తాడు. దాని సువ్యవస్థ కొరకు ప్రయత్నిస్తుంటాడు. శరీరాన్ని, పరివారాన్ని తనదిగా భావించేవారు దాని కొరకు ఏదో ఒకటి చేస్తుంటారు. విశ్వం తనదిగా భావించేవారు విశ్వ హితాన్ని నిరంతరం ధ్యానంలో ఉంచుకుంటారు. కుటుంబం కొరకు తన శరీర సుఖాన్ని పట్టించుకోక ప్రబల పురుషార్థం చేస్తుంటారు. ఎవరికి విశ్వ పరివారం అనుభూతిలోకి వస్తుందో అతను జీవజగత్తుతో ఆత్మీయత సాధించుకుంటాడు. వాటి కష్టాల బాధల నివారణకు పూర్తిగా ప్రయత్నిస్తాడు. తన సామర్థ్యాన్ని తన కొరకు వినియోగించుకోకుండా విశ్వంలోని సుఖశాంతుల కొరకు వినియోగిస్తాడు.

వైభవం పొందాలంటే భౌతిక పురుషార్థం అవసరమవుతుంది. ఐశ్వర్యం ఆత్మిక పురుషార్థం వల్లనే సంభమవుతుంది. అనంతమైన ఐశ్వర్యానుభూతి, సామర్థ్యం పొందటానికి సాధనాత్మక పురుషార్థం చేయవలసి ఉంటుంది. గాయత్రి ఉపాసనలో ఈ స్థాయి సాధనా విధి విధానాలను భువనేశ్వరి అంటారు.

– *అనువాదం : శ్రీమతి జ్ఞాన ప్రసూన*

**స్వార్థం, అహంకారం వ్యక్తి పతనానికి కారణం అవుతాయి.**

# రుద్రాక్ష మహిమ

రుద్రాక్ష ఆధ్యాత్మిక రహస్యాలతో నిండి ఉన్నది. దీనిని ఈనాడు ఆరోగ్యం కొరకు వాడుతున్నారు. రుద్రాక్ష ద్వారా మానవోపచార పద్ధతి అత్యంత ప్రాచీనమైనది. వేదకాలంలో రుద్రాక్షను విభిన్న రీతులలో, విస్తృతస్థాయిలో వినియోగిస్తూ ఉండేవారు. ఔషధ మరియు ఆధ్యాత్మిక విశేషతల కారణంగా ఇది అత్యంత లోకప్రియమైనది. దీనిని ధరించుట చేత అనేకరకాలైన శారీరక-మానసిక వికారాల నుండి ముక్తి లభిస్తుంది. భారతదేశం - నేపాల్‌లలోనేకాక ప్రపంచంలోని అనేక దేశాలలో వీటిమీద చికిత్సాపరమైన ప్రయోగాలు జరుగుతూ ఉన్నాయి. వాటి ఫలితాలు అసాధారణమైనవి.

శివపురాణాన్ని అనుసరించి రుద్రాక్ష యొక్క ఉత్పత్తి రుద్రుని కన్నులనుండి జరిగినదని భావిస్తారు. రుద్రాక్ష అనగా 'రుద్రుని కన్నులు'. శంకరభగవానుని రౌద్రరూపమును రుద్ర మరియు మంగళమయమైన స్వరూపమును 'శివం' అని అంటారు. రుద్రాక్ష 'బ్లూ మార్బల్' అనే పేరుతో కూడా పిలుస్తారు. ఈ చమత్కారపూరితమైన వృక్షం యొక్క ఔషధీయ నామం 'ఎలివోకార్పస్ గైనీట్రస్'. దీనిని 'భూతనాశినీ' అని కూడా అంటారు. దీని ఔషధ గుణాలు అద్భుతమైనవి. అందువలన ఇది వైదిక మరియు మహాభారతకాలంలో సమగ్రమైన చికిత్సాపద్ధతిగా ప్రయోగించబడుతూ ఉండేది. కాని మధ్యయుగంలో ఈ రంగం ఉపేక్షించబడినది. స్వతంత్రం వచ్చిన తరువాత 1954వ సంవత్సరంలో కిర్టీకిరణ్, వసుంధరా, నాదకర్ణీ మున్నగువారు తిరిగి వీటిమీద రీసర్చ్ ఆరంభించారు.

రుద్రాక్ష సంబంధంగా పనిచేయువారిలో థాయరిల్ (1966), ధర్ మరియు ఆయన సహచరులు (1968), సర్కార్ మరియు వారి సహచరులు (1972-73), భట్టాచార్య(1975), చాంద్ (1975), ఆచార్య (1976), త్రిపాఠీ (1982), గుప్తా (1983), పాండే మరియు మహాచార్య (1985), రాజ (1986), డేవిడ్ లీ (1991, 19997-98), శుభాకరన్ (1997) మొదలగువారు ప్రముఖులు. వీరంతా రుద్రాక్ష మీద పలు ప్రయోగాలు చేశారు. 1966వ సంవత్సరంలో ఢిల్లీకి చెందిన 'సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ఆయుర్వేదిక్ రీసర్చ్' 'ఆయుర్వేదిక ఔషధుల నిఘంటువు' ను ముద్రించినది. అందులో రుద్రాక్ష థెరపీ గురించి చెప్పబడి ఉంది. దీని తరువాత డా॥ ఎం. ఎల్. ధర్ 1968 లో రుద్రాక్ష యొక్క బయోలాజికల్ విశేషతల మీద అన్వేషణ సాగించారు. దాని తరువాత డా॥ పీ.కె. సర్కార్ వీటి ఔషధీయ మహత్వాన్ని వివరించారు.

1975 వ సంవత్సరంలో డా॥ ఎస్. కె. భట్టాచార్య దీని ఫార్మాకోలాజికల్ గొప్పతనమును, చాంద్ దీని బయోకెమికల్ విశ్లేషణ చేశారు. దీని తదుపరి వీటిమీద అనేకరకాల పరిశోధనాగ్రంథాల ముద్రణ ఆరంభమైనది. ప్రస్తుతం డా॥ డేవిడ్ లీ వీటి రసాయనిక గుణాల అధ్యయనం గావిస్తున్నారు. "ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఫ్లోరిడా" కి చెందిన డా॥ లీ వీటిని 'విభిన్న విశేషతలతో కూడినవి మరియు ఆశ్చర్యకరమైనవి' అని భావిస్తున్నారు. ఆయన అభిప్రాయంలో బహుశా ఏదైనా వస్తువు ఇన్ని విశేషతలతో నిండివుందీ అంటే అది రుద్రాక్షే. దీని బహుగుణమైన విశిష్టత ఆశ్చర్యకరమైనది.

శివపురాణంలో అనేకరకాల రుద్రాక్షల వర్ణన లభిస్తుంది. ప్రతి రుద్రాక్షకు తన మౌలికమైన విలక్షణత ఉంటుంది. శివపురాణాన్ని అనుసరించి రుద్రాక్షలు ఏకముఖి నుండి చతుర్దశముఖి (14 ముఖాలు) వరకు లభిస్తాయి. ఏకముఖి మరియు ఏకాదశముఖి అత్యంత దుర్లభమైనవి. ఏకముఖి రుద్రాక్ష - సర్వగుణసంపన్నతతో, స్వయం సిద్ధమైనది. ద్విముఖి రుద్రాక్ష - ఐశ్వర్యం, మనోకామనాపూర్తి, మోక్షం, వైభవాలను ఇస్తుంది. త్రిముఖి రుద్రాక్ష - విద్యాదులను అందించునదియేకాక, ఉష్ణనాశకమైనది. చతుర్ముఖ రుద్రాక్ష - ఆరోగ్యం, విద్య, ధనం, జ్ఞానమును పెంచేది మరియు జీవహత్యవలన కలిగిన పాపమును నశింపజేయునది అని భావించబడుతున్నది. పంచముఖి రుద్రాక్ష - పాప-తాపములను నశింపజేసి, ఆరోగ్యమును సంరక్షిస్తుంది. షట్‌ముఖి రుద్రాక్ష -విద్యా ప్రాప్తికి సర్వోత్తమమైనది. సప్తముఖి రుద్రాక్ష -కీర్తి-ప్రతిష్ఠలను, ధనం, గౌరవాదులను, ఐశ్వర్యమును ప్రసాదించునట్టిది.

రుద్రాక్ష జీవితంలోని అన్ని పార్శ్వములలోనూ లాభదాయకమైన ఈ క్రమంలోనే అష్టముఖి రుద్రాక్ష - ఆయువును పెంచేదిగా భావించబడుతున్నది. నవముఖి రుద్రాక్ష - అభయాన్నిస్తూ, అన్నిరకాల భయాలను పారద్రోలుతుంది. దశముఖి రుద్రాక్ష-సర్వగ్రహదోషాలను నశింపజేసి, ప్రేత-సర్ప బాధలనుండి ముక్తిని ప్రసాదిస్తుంది. ఏకాదశముఖి రుద్రాక్ష - సుఖం మరియు విజయాన్ని చేకూరుస్తుంది. ద్వాదశముఖి రుద్రాక్ష

**ఆత్మ విశ్వాసం దెబ్బతింటే సామర్థ్యం పని చేయదు.**

– లేమిని, దారిద్ర్యమును నశింపజేసి అభయాన్ని అందిస్తుంది. త్రయోదశముఖి రుద్రాక్ష – సుపుత్రుడిని ప్రసాదిస్తూ, మనోవాంఛితాలను పూర్తిచేసి, వశీకరణశక్తిని కూడా ఇస్తుంది. చతుర్దశముఖి రుద్రాక్ష –పాపనాశనం చేసి, ఆరోగ్యమును మెరుగుపరచి, సంకటాలను నివారించునట్టిదని భావిస్తారు. రక్తపోటు నివారణలో అన్నిరకాల రుద్రాక్షలు ఉపయోగపడతాయని భావిస్తారు. పురాణాలలో వర్ణించబడిన రుద్రాక్ష యొక్క గుణాల మీద అనేక ప్రాజెక్టువర్క్‌లు, పరిశోధనాపత్రాలు వెలువడినవి. వీటి ప్రభావం, పరిణామాలు సరియైనవే అని నిరూపించబడినవి. ఈ ఆధారంగానే అనేక అన్వేషణలు, పరిశోధనలు సాగినవి.

రుద్రాక్ష మీద పరిశోధనలు చేసే వైజ్ఞానికులు వీటి కిమోఫార్మకోలాజికల్ గుణాలను గురించి వివరించారు. ఈ విశేషత కారణంగా ఇది హృదయరోగనివారిణి, యాంటీకొలెస్ట్రాల్, మస్తిష్కంలో ప్రభావాన్ని చూపిస్తుంది, కండరాలకు స్ఫూర్తినందిస్తుంది, శక్తిని వృద్ధిచేస్తుంది, రోగనిరోధిని, బయోఎనర్జీని పెంచుతుంది, షట్‌చక్రాలమీద ప్రభావమును చూపిస్తుంది. జీవవిజ్ఞానవేత్తలు వీటిమీద ప్రయోగాలు చేసి వీటిని యాంటీవైరల్, యాంటీబాక్టీరియల్, యాంటీఫంగల్, యాంటీ ప్రోటోజోఅల్‌గా తెలుసుకున్నారు. జీవవిజ్ఞానవేత్తలు వీటిలోని ఇన్ని గుణాలను ఒకేచోట చూసి అత్యాశ్చర్యమునకు లోనైనారు. ప్రాచీన భారతదేశంలో ఈ అద్భుత రుద్రాక్ష మీద మొదటినుండీ పరిశోధనలు దేశంలో జరిగినాయి. దీని ఆశ్చర్యకరమైన ప్రభావం పాశ్చాత్య ప్రపంచమునకు కూడా అవగతమే.

రుద్రాక్ష స్నాయుతంతువులమీదకూడా తన ప్రభావాన్ని చూపిస్తుంది. ఇది న్యూరోట్రాన్స్‌మీటర్స్ ప్రవాహమును సంతులితస్థాయిలో ఉంచుతుంది. అందువల్ల మానసికస్థితి స్థిరంగానూ, ప్రసన్నంగానూ ఉంటుంది. అయితే ఈ రంగంలో నూతన పరిశోధనలు చేయవలసిన అవసరమున్నది. ఇది శరీర ఉష్ణోగ్రతలో కూడా సంతులనాన్ని తీసికొస్తుంది. రుద్రాక్ష అధిక రక్తపోటు మున్నగు రోగాల నివారణకు రామబాణం వలె పనిచేస్తుంది. వైజ్ఞానికులు దీని విద్యుదయస్కాంత గుణాలమీద కూడా అధ్యయనం సాగించారు. డా॥ డేవిడ్ లీ ప్రకారం రుద్రాక్షలో డైఎలక్ట్రిక్ గుణం నిండి ఉంది. ఎందుకనగా ఇది విద్యుదావేశశక్తిని ఏకత్రితం చేస్తుంది. దాని కారణంగా ఇందులో స్థిరమైన అయస్కాంత గుణం నెలకొంటుంది. దీని ప్రాకృతిక ఎలక్ట్రోమాగ్నటిక్ (విద్యుదయస్కాంతం), పెరామాగ్నటిక్‌గా ఉంటుంది. దీని డైనమిక్ పొలారిటీ విశేషత అద్భుతమైనది.

రుద్రాక్ష యొక్క ఆయుర్వేద విలువకూడా అనంతమైనదే. దీన్ని హృదయరోగాలు, రక్తపోటు, రక్తవాహక నాళికలకు సంబంధించిన రోగాలలోనూ, రక్తంలో కొలెస్ట్రాల్‌ను తగ్గించేందుకు ఔషధరూపంలో ఉపయోగించవచ్చును. దీన్ని ఎలర్జీ, సైకోసోమాటిక్ మరియు ఎముకల వ్యాధులు, ఆస్థ్మా, డయాబెటీస్, కాన్సర్ రోగాల నివారణకు ఉపయోగించవచ్చును. ఆయుర్వేదాన్ని అనుసరించి ఇది వాత–పిత్త–కఫాలనే త్రిదోషాలనూ, సప్త ధాత్విక దోషాలనూ శమింపజేస్తుంది. రుద్రాక్ష మెటబాలిజమ్‌కు కూడా మేలొనగూరుస్తుంది. రుద్రాక్ష యొక్క ఈ చికిత్సా విధానాన్ని ఎవరైనా నిపుణుడు, విశిష్టుడు అయిన సలహాదారుని(వైద్యుని) సలహాను తీసుకున్న తరువాతనే అమలుపరచాలి.

రుద్రాక్ష యొక్క ఆధ్యాత్మిక మహత్వంకూడా చెప్పుకోదగినది. కొన్ని తాంత్రిక మరియు వేదమంత్రాల జపానికి రుద్రాక్షమాల సర్వోత్తమ ఫలప్రదాతగా భావిస్తారు. మంత్రవేత్తల అభిప్రాయం ప్రకారం ఈ మాలతో చేసిన జపం అనేకరెట్లు ఎక్కువ ఫలితాన్నిస్తుంది. రుద్రాభిషేకం ఒక రహస్యమైన ఆధ్యాత్మిక ప్రయోగం. రుద్రాక్షను ధరించి రుద్రాభిషేకాన్ని చేసే విధానం ఉంది. కొన్ని మంత్రాలు సిద్ధించుటకు ఇది అత్యంత అవసరమని భావిస్తారు.

ఈవిధంగా రుద్రాక్ష వలన లెక్కలేనన్ని, అసంఖ్యాకమైన ఉపయోగాలు ఉన్నాయి. దీని బహుముఖమైన అంశాల మీద పరిశోధనలు–అన్వేషణల ఫలితం వెలుగును చూస్తే లోకకళ్యాణం జరిగి, మానవ సమాజం అద్వితీయమైన లాభాలను కైవశం చేసుకోగలుగుతుంది.

*– అఖండ జ్యోతి, అక్టోబర్ 2005*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీ రాజగోపాల్*

## పాఠకులకు ఆహ్వానం

- *"యుగశక్తి గాయత్రి" పత్రికలోని శీర్షికలు, అంశాలను గూర్చి పాఠకుల నుండి అభిప్రాయాలను ఆహ్వానిస్తున్నాం.*
- *పాఠకులు పోస్టు కార్డు పై పది వాక్యాలకు మించకుండా వ్రాసి ప్రతినెలా 10వ తేదీలోగా పంపించాలి.*
- *ఎంపికైన లేఖలు, స్థలాన్ని బట్టి ప్రచురించగలం.*
- *ఎంపిక విషయంలో సంపాదకమండలిదే తుది నిర్ణయం.*

**అంతరిక్షంలోకి ఎగిరిన మనిషి మానవత్వంలోకి ఎదగలేకపోతున్నాడు.**

# పవిత్ర అంతరంగం కలిగినవారే శక్తికి పాత్రులు అవుతారు

ఆదిశక్తి లీలాగాథలోని మంత్రాల యందలి రహస్యములన్నింటినీ తనలో ఇముడ్చుకొనియున్న శ్రీదుర్గాసప్తశతి యొక్క మూడవ అంగం కీలకం. ఎవరైతే ఈ కీలకం యొక్క రహస్యమును తెలుసుకుంటారో వారే శ్రీదుర్గాసప్తశతి యొక్క మంత్ర రహస్యాలను అర్థం చేసుకొనగలరు. వారి అంతరంగంలో దీనియొక్క మంత్రశక్తులు, సిద్ధులు ప్రకటీకృతమౌతాయి. కీలకం యొక్క నిగూఢతను తెలుసుకొనగలిగిన సాధకుడే, దీనిని ప్రయోగించుటలో సామర్థ్యం కలిగివుంటాడు. దీనియొక్క రహస్యమును ఛేదించలేని వ్యక్తికి, సప్తశతి కేవలం ఒక కావ్యగ్రంథమే అవుతుంది. అతడు ఇందలి శబ్ద సౌందర్య రసాస్వాదన అయితే చేయగలడు కానీ, దీని యొక్క మంత్రశక్తి అతడి చేతనత్వంలోకి ప్రవేశించలేదు. ఇది విచిత్రమే అయినప్పటికీ సాధనాపరమైన సత్యం అని శక్తి సాధకుల పరంపర యుగయుగాల నుండి క్రమబద్ధీకరించారు. (చెప్తూవస్తున్నారు)

కీలక స్తోత్రమంత్రం యొక్క వినియోగమంత్రంలో **'ఓం అస్య శ్రీకీలకమన్త్రస్య శివ ఋషిః, అనుష్టుప్ ఛన్దః, శ్రీమహాసరస్వతీ దేవతా, శ్రీజగదమ్బాప్రీత్యర్థం, సప్తశతీపాఠాఙ్గత్వేన జపే వినియోగః'** అని చెప్పబడియున్నది. అనగా ఈ కీలక స్తోత్ర మంత్రం యొక్క ఋషి భగవంతుడైన సదాశివుడు, దీని ఛందస్సు అనుష్టుప్, దేవత మహాసరస్వతి. తల్లియైన జగదంబ యొక్క ప్రీతి కొరకు సప్తశతీ పారాయణలోని అభిన్న అంగంగా దీనిని పఠించటం జరుగుతుంది. పారాయణ వినియోగం ద్వారా సాక్షాత్తు భగవంతుడైన సదాశివుడే ఈ కీలకం యొక్క ద్రష్టయైన ఋషి, మేధస్సును ప్రసాదించే మహాసరస్వతి దీనియొక్క అధిష్ఠాన దేవత అని స్పష్టమౌతుంది. ఎవరైతే బుద్ధితో కూడిన తెలివితేటలు, కుటిలత్వములను నశింపజేసుకుని, వివేకవంతులు కాగలరో, ఎవరిపైన మహాసరస్వతియొక్క కృప అక్షరాలా ఉంటుందో, కేవలము వారుమాత్రమే భగవంతుడైన సదాశివుని ద్వారా రచించబడిన కీలకమును అర్థం చేసుకొనగలరు.

మార్కండేయ మహర్షి చేత చెప్పబడిన ఈ కీలకస్తోత్ర మంత్రాలలో 14 శ్లోకాలున్నవి. సదాశివునికి నమస్కరిస్తూ వీటిని ప్రారంభించడం జరిగింది. ఆఖరు శ్లోకంలో ఫలశృతిని వివరిస్తూ

**ఐశ్వర్యం యత్ప్రసాదేన సౌభాగ్యారోగ్యసమ్పదః ।**
**శత్రుహానిః పరోమోక్షః స్తూయతే సా న కిం జనైః ఓం ॥ 14**

అని చెప్పబడినది.

అనగా 'ఎవరి దయవలన ఐశ్వర్యం, సౌభాగ్యం, ఆరోగ్యం, సంపదలు, శత్రునాశనం మరియు కైవల్యమూ కూడా లభిస్తాయో, కళ్యాణకారిణి అయిన ఆ జగదంబను మానవులు ఎందుకు స్తుతించరు?' అని అర్థం.

ఇటువంటి మహిమాన్వితమైన స్తోత్రము వలన కలిగే లాభమును అనధికారులు, అపాత్రులు పొందరాదు. ఎందుకంటే అపాత్రులు ఏ శక్తినైనా, సాధననైనా చెడు ప్రయోజనాలకే వినియోగించుకుంటారు. అందువలన పరమశివుడు దీనిని కీలితం చేసివేసినాడు. వారి ప్రవృత్తి వారిని శ్రేష్ఠత్వము దిశగా ముందుకు సాగనివ్వదు. అటువంటప్పుడు వారికి ఏదైనా శ్రేష్ఠమైన శక్తి లభించినట్లయితే దానినికూడా వారు ఏదో ఒక హేయమైన ప్రయోజనానికే ఉపయోగించుకుంటారు. ఇటువంటి నికృష్ట ప్రవృత్తి గల్గిన నీచమైన జనులకు లభ్యం కాకుండా మహాదేవుడు శ్రీసప్తశతిని కీలితం చేశాడు. వారు ఈ పదాలను పఠనమైతే చేయగలరు కానీ ఎక్కడా, ఎటువంటి పరిస్థితులలోనూ ఇందులోని మంత్రశక్తులను పొందలేరు, వాటిని ప్రయోగించలేరు.

ఈ విషయాన్ని వ్యక్తం చేస్తూ కీలకమంత్రాలలో

**సమగ్రాణ్యపి సిద్ధ్యన్తి లోకశఙ్కామిమాం హరః ।**
**కృత్వా నిమన్త్రయామాస సర్వమేవమిదం శుభమ్ ॥**
**స్తోత్రం వై చణ్డికాయాస్తు తచ్చ గుప్తం చకార సః ॥**

**(5-6)** అని చెప్పబడినది.

అనగా జిజ్ఞాసువులయొక్క సందేహమును తెలుసుకొని భగవంతుడైన సదాశివుడు తనవద్దకు వచ్చే జిజ్ఞాసువులకు సప్తశతి అనే పేరుగల సంపూర్ణ స్తోత్రమే సర్వవిధాల శ్రేష్ఠమైనది, మేలును చేకూర్చగలిగినది' అని తెలియజేశాడు. తరువాత భగవతి చండిక యొక్క సప్తశతి అనే పేరుగల స్తోత్రాన్ని మహాదేవుడు గుప్తంగా ఉంచాడు.

**జ్ఞాన యోగిలా ఆలోచించాలి.**

సప్తశతియొక్క మంత్రశక్తిని దురుపయోగం చెయ్యటానికి వీలుకాని పరిస్థితి భగవంతుడైన భోలేనాథుని ప్రభావం వల్లనే జరిగింది. ఎవరైనా సాధకుడు ఏదో ఒక విధంగా పొరపాటునో, ప్రమాదవశాత్తునో లేదా అహంకారం వల్లనో దీనిని దురుపయోగ పరచినట్లయితే అతడు దండనకు గురికావడ మనేది నిశ్చయం. యుగయుగాలనుండీ ప్రజలు అనుభూతి చెందుతూ వస్తున్న సత్యమిది.

సప్తశతిని హీనమైన ప్రయోజనములకొరకో లేదా ఎవరికైనా అపకారం చెయ్యటానికో ఉపయోగించి, చివరకు తామే స్వయంగా పెద్ద హానికి గురియైనవారు కోకొల్లలు అన్న సత్యాన్ని పలు సంఘటనలు చెబుతున్నాయి. వారు విధిచేత, ప్రకృతిచేత సహించరాని దెబ్బలు తినవలసివస్తుంది. సప్తశతియొక్క దివ్యశక్తిని ఎల్లవేళలా ఆత్మకళ్యాణం కొరకు, లోకహితం కొరకుమాత్రమే ఉపయోగించాలి. ఇటువంటి మంచి ప్రయోజనములకు అడ్డంకులను తెచ్చిపెట్టే ఆసురీశక్తులేవైనా ఉంటే, తల్లియైన ఆదిశక్తియొక్క కోపంవల్ల సహజంగానే వాటి వినాశనం జరుగుతుంది.

మానవుని యొక్క సమస్త దోషాలకు అతని యొక్క స్వార్థం, అహంకారమే మూలకారణములని జగన్మాతయొక్క ఉపాసకులందరికీ తెలుసు. ఈ పాశం చేత బంధింపబడిన వ్యక్తి పశువుగా మారి, అజ్ఞానమనే అంధకారంలోపడి కొట్టుకుంటూ చెడుమార్గముల దారిలో పయనిస్తాడు. ఏదోవొకవిధంగా ఈ పాశమును తెగగొట్టగలిగితే తిరిగి ఆ వ్యక్తి మంగళప్రదమైన వ్యక్తిగా మారగలడు. సాధకుడు స్వార్థం, అహంకారం అనే బంధనములనుండి విముక్తుడైనప్పుడే ఎటువంటి ఆధ్యాత్మిక సాధనయైనా సార్థకమౌతుంది. అందులోనే అతని సాధన యొక్క సఫలతకూడా ఉంటుంది. స్వార్థం, అహంకారాలనుండి వ్యక్తి ముక్తుడు కానంతవరకూ అతడికి ఎప్పటికీ ఔన్నత్యం అనేది అర్థం కాదు, తత్ఫలితంగా అతడు తన జీవితాన్ని ఎటువంటి మంచి ప్రయోజనంలోనూ వినియోగించలేడు.

సప్తశతి సాధకులకు ఈ సాధనద్వారా సూక్ష్మశక్తులతో సంపర్కం శీఘ్రంగా ఏర్పడటమేకాక ఆ శక్తులు చాలా వేగంగా అభివృద్ధిచెందుతాయి. ఇటువంటి స్థితిలో అంతరంగం మలినమైనట్లయితే వినాశకరమైన పరిస్థితులే ఎదురౌతాయి, ఇది ఎవ్వరికీ ఎప్పుడూ మంచిదికాదు. పవిత్రమైన అంతరంగం, స్వార్థంలేని అహంకారరహితమైన జీవనం ఈ సాధనకు ఎంతో అనివార్యమైన షరతు. ఈ సత్యాన్ని వెల్లడిచేస్తూ సప్తశతి (7/8) శ్లోకాలలో **'కృష్ణపక్ష చతుర్దశినాడుగానీ లేదా అష్టమిరోజుగానీ ఏకాగ్రమైన మనస్సుతో భగవతి యొక్క సేవలో తన సర్వస్వమునూ అర్పించి తిరిగి ప్రసాదరూపంలో స్వీకరించే వ్యక్తిపట్ల దేవి ప్రసన్నురాలవుతుంది,** అంతేకానీ మరియొకవిధంగా ఆమె కృప మనకు లభ్యంకాదు' అని చెప్పబడినది.

ఈవిధంగా సిద్ధికి ప్రతిబంధక రూపమైన కీలకం ద్వారా మహాదేవుడు ఈ స్తోత్రాన్ని కీలితం చేసివుంచాడు. పైన చెప్పబడినవిధంగా నిష్కీలనం గావించి ఈ సప్తశతి స్తోత్రాన్ని ప్రతినిత్యమూ స్పష్టమైన ఉచ్చారణతో పఠించిన మానవుడు సిద్ధిని పొందగలడు.

పైన చెప్పిన తిథులలో శక్తిని ఉపాసించుటలో చాలా విశేషమైన ప్రత్యేకత ఉంది. ఈ తిథులలో ప్రతిమాసం సాధకుని చేతనత్వం సహజంగానే ఊర్ధ్వగామి అయ్యేవిధంగా అంతరిక్షస్థితి ఉంటుందని విశిష్ట సాధకుల యొక్క అనుభవం. అందుచేత ఈ తిథులలో కొంచెం శ్రమపడగలిగితే జీవుడు సమస్త బంధనాల నుండి విముక్తుడు కాగలడు.

ఈ క్రమంలో చేయడమనేది, భగవతి యొక్క విగ్రహం లేదా చిత్రపటం చెంత కూర్చుని సాధకుడు తనను తాను, తన సంపూర్ణమైన అస్తిత్వమును తల్లియొక్క చరణారవిందాలమీద అర్పించడం మాత్రమే అవుతుంది. ఇప్పుడు అతడు లేదా ఆమె 'నేను అమ్మ యొక్క పుత్రుడను లేదా పుత్రికను' అనే భావాన్ని లోతుగా (దృఢంగా) స్వీకరించాలి. ఈ విశ్వమంతటిలో నాకున్న నిజమైన సంబంధం ఇది ఒక్కటే! నేను అమ్మ యొక్క పుత్రుడను లేదా పుత్రికను. నా సర్వస్వమూ అమ్మదే ! అంతే, ఇక ఇప్పటినుండీ నేను అమ్మయొక్క నిర్దేశముతో ఆమె యొక్క పద్ధతికి అనుగుణంగా జీవితాన్ని గడుపుతాను' ఈవిధమైన భావన దృఢంగా ఉండి, సాధన ఘనిష్ఠంగా ఉంటే, సిద్ధి లభించుటలో ఏమాత్రం సందేహం లేదు. 'స్వార్థపూరితుడూ, అహంకారీ అయిన వ్యక్తికి సిద్ధి లభించదు' అనే సత్యాన్ని సాధకుడు చాలా స్పష్టంగా అర్థం చేసుకొనవలెను. అందుచేత వీటినుండి త్వరగా విముక్తులు కావడం మంచిది. ఈవిధంగా చేయడం వల్ల మాత్రమే శక్తియొక్క రహస్యాన్ని తెలుసుకొనగలం.

*– అఖండ జ్యోతి, జులై 2007*

*అనువాదం : శ్రీమతి లక్ష్మిరాజగోపాల్*

**కర్మ యోగిలా కృషి చెయ్యాలి.**

ప్రాణశక్తి

# తేజోవలయం ఒక అమూల్యమైన విభూతి

మనము దేవతలూ, అవతార పురుషుల చిత్ర పటాలను చూచినపుడు వారి ముఖం చుట్టూ ఒక గొప్ప ప్రకాశవలయాన్ని చూస్తాము. శ్రద్ధాళువులూ, సిద్ధ పురుషులకూ ఈ ప్రకాశం ఉంటుంది. జీవించియున్న మహామానవులయందు బాహ్య చక్షువులతో చూచినపుడు ఈ తేజోవలయం కన్పించదు. సూక్ష్మదృష్టితో చూడగలిగిన వారికి వారి దేవత్వం విశిష్ట రూపంలో కన్పిస్తుంది. ఇది ఆ మహా మానవుల ఆంతరిక శక్తుల బహిరంగ పరిచయం వారి శరీరమంతటా ఆ విధమైన శక్తి ఉంటుంది. కానీ ఎక్కువగా ముఖం వద్దనే తేజస్సు ఉంటుంది.

ఆధ్యాత్మిక విషయాల్లో నేత్రాలకు సూర్యచంద్రుల ఉపమానం ఇవ్వబడుతుంది. వాక్కుల్లో సరస్వతినీ, ముక్కుకు పవనునీ, చెవులకు ఆకాశాన్నీ ఉపమానంగా తీసుకుంటారు, ముఖమునందలి భృకుటీ ప్రదేశంలో దివ్యమైన తృతీయ నేత్రముందని చెప్పబడుతుంది. ఈ నేత్ర తేజస్సు సాధారణ నేత్రాల కంటే చాలా అధికమైంది. ఈ దివ్య నేత్రంతోనే శివుడు మన్మథుని భస్మం చేశాడు. త్రికాలదర్శులు ఈ నేత్ర సహాయంతో భూత భవిష్యత్తులను చూస్తుంటారు. మస్తిష్కంలో బ్రహ్మరంధ్ర సహస్రార చక్రముంది. విష్ణు ఉపాసకులు దీనిని క్షీరసాగరంలో నిద్రిస్తున్న శేష నాగమని నమ్ముతారు. శివ ఉపాసకులు ఈ బ్రహ్మరంధ్రం కైలాసమనీ, దాని సమీపాన్ని మానస సరోవరంగా భావిస్తారు. గురుతత్వధ్యానం ఇచ్చటే జరుగుతుంది. ఈవిధంగా మస్తిష్కం మొత్తం దివ్యశక్తులతో నిండి ఉంది. జ్ఞానేంద్రియాలు పరిశుభ్రంగా ఉంటే అవి కూడా దైవతుల్యాలే. ముఖానికి చుట్టూ ఉన్న తేజోవలయమే ఈ దివ్యశక్తులకు ప్రతీక. తేజోవలయం ఆధారంగా దివ్యశక్తుల భాండాగారాన్ని తెలుసుకునేవారు. మహామానవుల యందునూ, బుద్ధుడూ, రాముడూ, కృష్ణుడూ మొదలైన వారి ముఖం చుట్టూ ప్రాచీన కాలం నుండే ఈ ప్రకాశాన్ని చూపించేవారు. ఏసుక్రీస్తునకు కూడా ఇటీవలి చిత్రకారులు ఈ విధమైన ప్రకాశాన్ని చూపుతున్నారు.

ప్రస్తుత కాలంలో వైజ్ఞానికులు ఈ ప్రకాశాన్ని ప్రాణశక్తికి ప్రతీకగా భావిస్తున్నారు. వైజ్ఞానిక పరిశోధకులు తమ పరిశోధనల ద్వారా ప్రతివ్యక్తియందూ ఈ ప్రకాశము ఎక్కువగా లేదా తక్కువగాకానీ ఉంటుందని కనుగొన్నారు. వారు దీనిని ప్రాణశక్తి ప్రతీకగా తలుస్తున్నారు. ముఖానికి దగ్గర్లో వ్యాపించిన ప్రకాశాన్ని ఫోటో తీసే యంత్రాలనూ కూడా తయారుచేశారు. శరీరమంతటా ప్రకాశం ఉంటుంది.

ఈ ప్రకాశాన్ని రెండు రకాలుగా విభజించారు. శారీరికమూ, మానసికము. శరీరం నుండీ వెలువడే ప్రకాశం తెల్లగా ఉంటుంది. మానసిక ప్రకాశం కూడా ఇందులో కలుస్తుంది. మానసిక ప్రకాశంలో రంగులుంటాయి. తెలుపురంగు ప్రకాశం శరీరానికి సంబంధించినది, రంగులతోకూడిన ప్రకాశం మానసిక ప్రకాశం.

దివ్యత్వంలేని సాధారణ శరీరాలలో తేజోవలయం పొగచూరినట్లుగా ఉంటుంది. అందులో తెలుపు అంశ చాలా తక్కువ. మానసికంగా ఎవరైతే నీచులూ, పతితులూ ఉంటారో వారి ప్రకాశంలో నలుపు ఎక్కువగా ఉంటుంది.

ఈ తేజోవలయం దివ్యత్వానికి ప్రతీక. దివ్య చక్షువులతో మాత్రమే ఈ దివ్యత్వాన్ని వీక్షించగలగుతారు. కర్ణేంద్రియాలను జాగృతం చేసినపుడు నాదయోగం వినగలుగుతారు. అంతర్ దృష్టితో అంతర్ముఖమై ధ్యానయోగం ద్వారా సూక్ష్మశరీరంలో ఏ భాగాన్నైనా దర్శించగలరు. అదేవిధంగా జ్ఞానచక్షువుల ద్వారా దైవీ సంపద గలిగిన మహాపురుషుల తేజోవలయాన్ని చూడగలరు. ఎవరిలో ఎంత మోతాదులో దివ్యత్వం ఉన్నదని కూడా తెలుసుకోగలరు.

వైజ్ఞానికులు శరీరంలోని ప్రాణశక్తిని విశిష్టయంత్రాల ద్వారా ప్రకాశమండల రూపంలో ప్రత్యక్షంగా చూడడానికి ప్రారంభించారు. దీని ఆధారంగా ఎవరు శక్తిగలవారో, ఎవరు దుర్బలులో, ఎవరు ఆరోగ్యవంతులో, ఎవరు ఆరోగ్యవంతులు కారో తెలుసుకోగలుగుతారు. విజ్ఞానవేత్తలు ఆధ్యాత్మిక స్థితిని తెలుసుకోలేరు. కానీ శరీర స్వస్థతా, మానసిక స్వస్థతా బలవంతులనూ, దుర్బలులనూ తెలుసుకోగలరు. అది కూడా ఎంతో మహత్వపూర్ణమైనదే.

శరీరంలో రక్తమాంసాలే కాదు. విద్యుత్‌శక్తి కూడా ఉంది. ఈ శక్తికి రెండు భాగాలు ఉన్నాయి. ఒకటి హృదయంలోనూ, మస్తిష్కంలోనూ ఉంటూ నాడీ మండలాన్ని సువ్యవస్థితం చేస్తుంది. రెండవది బ్రహ్మాండమంతట వ్యాపించి శరీరధారులనూ, వనస్పతులనూ అలాగే పదార్థాలనూ ప్రభావితం చేస్తుంది. ఈ రెండింటి మిశ్రమం వల్ల తయారైన విద్యుత్‌నే వైజ్ఞానికులు చూడగలుగుతున్నారు, అర్థం చేసుకోగలుగుతున్నారు. వైజ్ఞానికులు యంత్రాల ద్వారా చూడగలుగుతున్న తేజోవలయాన్ని, ఆధ్యాత్మవేత్తలు జ్ఞాన చక్షువుల ద్వారా, ధ్యానయోగం ద్వారా చూగలగుతారు. ప్రాణ విద్యుత్ రూపంలో తేజో వలయాన్ని

**జంతువులలో నర జన్మ దుర్లభం.**

చూస్తున్నపుడు దివ్య తేజోవలయాన్ని ఏదో ఒక ఆధారంతో చూడగలమన్న ఆశ జనిస్తుంది. తేజో మండలాన్ని ప్రప్రథమంగా 1911లో డాక్టర్ కిర్నర్ ప్రభామండలమును (Aura) కొలిచాడు. అతను హైవోల్టేజ్ లైట్ ద్వారా ప్రయోగం చేసి జీవమున్న ప్రతిదానికీ నాలుగువైపులా ప్రభా మండలముందని నిర్ధారించారు. వైగ్నేల్ (లండన్) 1937, రిగమ్ (అమెరికా) 1974లో చేసిన ప్రయోగాల వల్ల కొంతమంది వ్యక్తుల దగ్గర విశిష్టమైన తేజస్సు ఉందని కనుగొన్నారు. వారిలో ఉన్న కిరణాల ప్రభావం కూడా మిగిలిన జీవుల కంటే భిన్నమైంది. వ్రేళ్ళూ, ముఖానికి నాలుగు వైపులా, సుషుమ్నా క్రింది భాగంలో వేర్వేరు విధములైన తేజస్సు ఉంటుంది. వైజ్ఞానికులు వ్యక్తి యొక్క 'ఆరా'ను బట్టి వారు ఎటువంటి మనోవికారానికి బలయ్యారు. ముందు ముందు అతనికి ఎటువంటి జబ్బు రాగలదు అని చెప్తున్నారు. వ్యతిరేకమైన ఆలోచనలు కలవారికి, సరైన ఆలోచనలు కలవారికీ ఉన్న తేడాను వారి 'ఆరా'ను విశ్లేషించడం వల్ల తెలుస్తున్నది, ఈ విషయాన్ని డాక్టర్ శ్రోడింజర్ 1976లో తెలిపారు.

వైజ్ఞానికులు తేజోమండలాన్ని మూడు భాగాలుగా చేశారు. మొదటిది శరీరంవరకే పరిమితమైన విద్యుత్, రెండవది శరీరానికి బయట ఒక అంగుళం వరకూ ఉన్న తేజోవలయం, మూడవది శరీరానికి కవచం లాగా నాలుగు వైపులా 6 నుండి 8 అంగుళాలు, అప్పుడప్పుడు శరీరానికి బయట కొన్ని అడుగుల వరకూ వ్యాపించిన వెలుగూ విశేషించి ముఖమూ, వ్రేళ్ళూ, అలాగే జననేంద్రియాల వరకూ. మూడవ తేజోమండలాన్ని జార్జమీక్ "జోన్ ఆఫ్ ఎనర్జీగా" గుర్తించారు. మొదటి దానిలో బిందువు మాత్రం ఉంటుంది. రెండవ దానిలో రేఖలు, మూడవ దానిలో వలయాలు ఉంటాయి. మొదటిభాగం స్థూల శరీరం లేదా బయోప్లాస్మా సమిశ్రితమని, రెండవది ప్లాస్మా, మూడవది వికిరణములు. వాస్తవంగా వీనిలోనే చికిత్స చేసే క్షమత ఉన్నది.

భారతదేశంలో ఈ కార్యాన్ని ప్రథమంగా డాక్టర్ పి. నరేంద్రన్ నిర్వర్తించాడు. ఆయన భారత ప్రభుత్వంలో విజ్ఞానమూ మరియూ టెక్నికల్ ఆఫీసులో పనిచేశారు. హాంకాంగ్‌లో ఆసియా, ఆస్ట్రేలియన్ కాంగ్రెస్‌లో తన పరిశోధనను ప్రదర్శించారు. అచ్చట ఉపస్థితులైన వైజ్ఞానికులందరికీ ఇందులో అభిరుచి ఏర్పడింది. రెండవ 'ఆరా' ప్రకాశమాధారంగా శారీరిక, మానసిక స్థితిని లోతుగా విశ్లేషించి ఆ క్షేత్రాలలో ఏవైనా రోగాలు ప్రవేశించాయా లేక ప్రవేశించే అవకాశముందా అని పరిశోధించారు. ఈ సమాచారం తెలుసుకున్న తర్వాత వైద్యం చేయడం చాలా సులభమవుతుంది.

డాక్టర్ నరేంద్రన్ తన పరిశోధనలను ఇంకా ముందుకు తీసుకెళ్ళడంలో నిమగ్నమయ్యారు. లండన్‌లోని సెయింట్ జాన్స్ హాస్పిటల్‌లో పనిచేసే ప్రముఖ సర్జన్ డబ్ల్యూ. జె.కల్నర్ ఈ ప్రకాశానికి సంబంధించిన విషయాన్ని పరిశీలించి తన పరిశోధనల వివరణను "ది హ్యూమన్ ఎట్‌మాస్పియర్"లో విస్తారంగా వ్రాశారు.

1939లో రష్యా వైజ్ఞానికుడు కిర్లియన్ ఎలెక్ట్రో థెరపీ పరిశోధన చేసి తన శరీరంలో రంగురంగుల విద్యుత్ రవ్వలు వస్తుండడాన్ని గమనించాడు. ఇది కేవలం తన శరీరము యొక్క విశేషమేమీ కాదు. ఇతరుల శరీరాల్లో కూడా ఇదే విధమైన విద్యుత్ రవ్వలు ప్రకటితమౌతున్నాయని కనుగొన్నారు. మద్రాస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూరోలజీ అధ్యక్షుడు పి. నరేంద్రన్‌కు దీని ఆధారంగా తన పరిశోధనను ముందుకు తీసికెళ్ళడానికి ప్రేరణ కలిగింది. వ్రేళ్ళ ఫోటోను ప్రకాశవలయంతో సహా తీయగల ఒక మిషన్ తయారు చేయడంలో సఫలీకృతులయ్యారు.

ఈ ప్రభామండలాన్ని ఇన్‌ఫ్రారెడ్ ఫోటోగ్రఫీ సిద్ధాంతాలతో కలిపినపుడు ఎంతటి దట్టమైన చీకట్లలో కూడా ఫోటో తీయవచ్చు, చీకట్లో దొంగతనం చేసేవారిని గుర్తించవచ్చు. ఆ మనిషి వెళ్ళిపోయాక కూడా ఇది వరకూ ఎవరు వచ్చారో, వారు ఏమి చేశారో కూడా తెలుస్తుంది.

ఆధ్యాత్మిక క్షేత్రంలో కూడా ఈ సిద్ధాంతాన్ని అమలుపరిస్తే ఏ విధమైన వ్యక్తిత్వం కల వ్యక్తి ఏ స్థలంలో ఎంత సమయమున్నాడు. ఆ ప్రదేశాన్ని అతను ఏవిధంగా ప్రభావితం చేశాడన్నది తెలుసుకోవచ్చు.

తేజోమండలం ఒకవిధంగా వ్యక్తి ప్రతిబింబం.

ప్రకాశ రూపంలో ఈ ప్రకాశం ఎవరిది, అతని గుణకర్మలెలాంటివి, అతని ఉద్దేశ్యాలెలాంటివి వీటన్నిటిని తెలుపుతుంది.

ఈ విధమైన విజ్ఞానం అభివృద్ధి చెందినప్పుడు వ్యక్తి లేని సమయంలో కూడా అతని నివాసస్థానంతో సంపర్కం పెట్టుకొని అక్కడ అతని ప్రాణశక్తి ఎంతటి ప్రభావాన్ని వదలి పెట్టిందని గుర్తించవచ్చు.

తేజోమండలం వ్యక్తి యొక్క అదృశ్య వ్యక్తిత్వము. దాని ప్రభావం చేత ఆ క్షేత్రాన్ని చాలా సమయం వరకు ప్రభావితం చేస్తుంది. తేజోవలయం యొక్క ఫోటో ప్రభావం మీద ఇటువంటి చాలా విశేషతలను గమనిస్తూ తెలుసుకోగలుగుతాము.

*– గురుదేవుల వాఙ్మయం నుండి*

*– అనువాదం : కె. అరవిందమ్మ*

**దేవుడు తాను ప్రేమించేవారిని అగ్ని పరీక్షలకు గురిచేస్తాడు.**

# సద్భావనలే జీవితానికి లక్ష్యమూ, సారము కూడా !!

**భగవంతుని దర్బారులో బుద్ధికి విలువ లేదు. అక్కడ విలువ ఉండేది కేవలం భావములకు మాత్రమే! బుద్ధి ఈ ప్రపంచంలో సంచరిస్తూవుంటే, భావం భగవంతునిలో పరిభ్రమిస్తూ ఉంటుంది.** రెండింటి ప్రపంచాలు వేర్వేరు. భావజగత్తులో బుద్ధి వ్యర్థమైనది. కానీ ఈ భౌతికజగత్తులో భావన ఎంతో విలువైనది. నిజం చెప్పాలంటే భావన జీవితానికి లక్ష్యమూ, సారమూ, ఆధ్యాత్మికపరమైన అభివృద్ధికి ముఖ్యమైన ఆధారము!

బుద్ధి విశ్లేషిస్తుంది. ఆలోచనలను జల్లిస్తువుంటుంది, ఖండిస్తూ ఉంటుంది. బుద్ధి అనే ప్రపంచం చిక్కుముడులతో చిక్కుపడి ఉంటుంది. సమస్యలతో చుట్టుముట్టబడి ఉంటుంది. ఒక సమస్యకు పరిష్కారం లభించగానే, మరి ఒకటి దాని వెనుకే నిలబడి ఉంటుంది. సమస్యలు హృదయాన్ని కోస్తూవుంటాయి, గ్రుచ్చుతూవుంటాయి. తత్ఫలితంగా బాధ కలుగుతూవుంటుంది. వీటి దెబ్బలకు మనస్సు గిలగిలలాడుతుంది, బుద్ధి ఒత్తిడికి లోనవుతుంది. ఈ సమస్యలనే ఉచ్చులో బుద్ధి స్వయంగా చిక్కుకుపోతుంది, వాటిని పరిష్కరించే క్రమంలో ఇంకా పెద్ద ఉచ్చులోకి బిగుసుకుపోతుంది. ఎక్కడా దారీతెన్నూ కనపడదు. ఆశాకిరణం కానరాదు.

అంతా శుష్కంగా, నిస్సారంగా అనిపిస్తూ ఉంటుంది. ఎక్కడా ఏ ప్రదేశంలోనూ శాంతి అనేది లభించదు. అంతరంగం అశాంతిగా ఉంటుంది. జీవితం యొక్క ప్రాణశక్తి అంతా ఇందులోనే కొట్టుకుపోతుంది. ఈ సందిగ్ధావస్థలోనే శక్తి అంతా నశించిపోతుంది. ఆఖరుకు జీవితంలోని ఆనందం అంతా హరించుకుపోయి, భావసంవేదనలు శుష్కమై, సౌందర్యం సమాప్తమవుతుంది.

**భావసంవేదనాహీనమైన జీవితం ఎంతో నిస్సారంగా ఉంటుంది.** ఇందులో అందం, ఆనందమూ ఏమీ వుండవు. అంతా శుష్కంగా, ప్రాణహీనంగా అనిపిస్తువుంటుంది. హృదయం లోపల పులకింతలేమీ ఉండవు. ఉన్నదల్లా భారమైన బ్రతుకు, లెక్కలకు అందనటువంటి కుప్పలుతెప్పలుగా ఉండే సంబంధబాంధవ్యాలు. సంబంధాలు, చుట్టరికాలు ఉంటాయి. కానీ వీటన్నింటిలో గణిత సూత్రాలు, వాటి ప్రమేయాలు నడుస్తూవుంటాయి. స్వార్థం, అహంకారాలతో అల్లబడిన, కూర్చబడిన ఈ లెక్కలతో నిండిన సంబంధాలు ఎంత వేగంతో ఏర్పడతాయో, అంతే వేగంతో విచ్ఛిన్నమవుతాయికూడా! ఇవి బుద్ధి ఏర్పాటుచేసే నిర్మాణాలు. వీనివల్ల తలెత్తే పరిణామాలు అత్యంత దు:ఖదాయకంగా ఉంటాయి. ఈ బాంధవ్యాలు తెగిపోయినప్పుడు, ఏర్పడే బాధను బుద్ధి సహించలేదు. బాధ, వేదన యథాప్రకారంగానే ఉంటాయి. కాలం గడిచేకొద్దీ బాధ ఎక్కువ అవుతూవుంటుంది. కానీ బుద్ధి దగ్గర దీనికి సమాధానం లేదు. ఇక్కడ బుద్ధి అసహాయురాలిగా, శక్తిహీనురాలిగా నిరూపించబడుతుంది.

బుద్ధితో కూడిన ప్రతిభ మానవునికి సుఖసౌఖ్యాలను అందించగల వివిధరకాలైన సాధనాలను, ఉపకరణాలను ఏర్పరచగలదు, కానీ దీనిని సరియైన రీతిలో ఉపయోగించుకొనగలవారెవరు? అనుభవించగలవారెవరు? ఇది ప్రతి హృదయంలోనూ ఎగసిపడే ప్రశ్న. ప్రశ్న ఎప్పుడైతే ఎదురౌతుందో, దానికి సమాధానం కూడా ఇవ్వవలసివుంటుంది. సరియైన సమాధానం బుద్ధి దగ్గరలేదు. బుద్ధి తర్కం చేస్తుంది. ఈ తర్కం వల్ల మరిన్ని భయంకరమైన సమస్యలు ఎదురౌతాయి. తర్కమనేది ముడివడివున్నదానిని మరింతగా ముడివేస్తుంది. ఇక సమాధానమెక్కడుంటుంది? బుద్ధిని దాటి సమాధానం వెదకవలసివస్తే ఎక్కడ వెదుకుదాం? సంస్కరింపబడిన భావనలలో వెదుకుదాము. దీనికి సమగ్రమైన సమాధానం ఆర్ద్రమైన భావనలలోనే ఇమిడివుంటుంది. బాంధవ్యాలు చాలా సూక్ష్మమైన, కోమలమైన దారాల వంటి అనుబంధాలతో అల్లబడివుంటాయి. సంవేదనాపూరితమైన ఈ సంబంధాలు బుద్ధికి అంతుచిక్కనివి. ఈ సంబంధాలు భావనలనే పునాది రాళ్ళమీద ఏర్పడతాయి. ప్రేమ, సహకారాలతోటి పటిష్ఠమౌతాయి. మైత్రి, స్నేహం, ప్రేమ, కరుణ మొదలైనవి దీనిని లెక్కలేనన్ని రీతులలో నవీనరూపంలో నిర్మిస్తూవుంటాయి. **భావనలతో కూడిన ఈ ప్రపంచంలో స్వయంగా భగవంతుడే నివసిస్తాడు. ఇక్కడ సమయం చాలా మధురంగా గడిచిపోతుంది.** ఈ ప్రపంచం ఎంతో హాయిగా, బౌద్ధిక ప్రపంచంతో సంబంధం లేకుండా ఉంటుంది.

భావనల యొక్క స్పర్శ వలన బుద్ధి యొక్క ప్రక్రియ కూడా

**ఇతరుల పట్ల నమ్రతగా, మధురంగా, ఉదారంగా వ్యవహరించాలి.**

మార్పుచెంది, అది సద్బుద్ధిగా రూపాంతరం చెందుతుంది. సద్బుద్ధి భావనలయొక్క సహచరిగా మారిపోతుంది. అంతా అద్భుతంగా పరిణతి చెందుతుంది. జీవితాన్ని రసవంతంగా, సంవేదనా భరితంగా చేయగల తత్త్వమేదీ లేని కారణంగా, బౌద్ధిక ప్రతిభకు ఎటువంటి విలువా ఉండదు. వెల అయినా, విలువ అయినా భావనలకు మాత్రమే ఉంటుంది. వీటి ఉనికి వల్లనే ఆశ్చర్యకరమైన అద్భుతాలు జరుగుతాయి. ఇంతకుమున్నెన్నడూ కనీవినీ ఎరుగని ఘటనలు వీని ప్రభావం వల్ల జరుగుతువుంటాయి. నూతనమైనవి, వినూత్నమైనవి జరుగుతుండటం భావనాజగత్తు యొక్క నియమం! భావనా ప్రపంచంలో బుద్ధి విశ్వాసఘాతకురాలు. ఇక్కడ బుద్ధి కేవలం కంచె చేసే పనిమాత్రమే చేస్తుంది. కంచె లోపల జరగవలిసినదంతా జరుగుతుంది. బయట ఏమీ ఉండదు.

భగవంతుని యొక్క సంవేదనాపూరితమైన సామ్రాజ్యంలో బౌద్ధిక ప్రతిభకు ఎటువంటి విలువా ఉండదు. ఈ ప్రతిభ అనేది ప్రతీసారీ ఈ సంవేదనా సామ్రాజ్యం ముందు పరాజయం పాలై, దాని తాలూకూ పరాభవంతో బాధపడుతూవుంటుంది. భగవంతునికి సత్‌శీలుడు అత్యంత ప్రేమాస్పదుడైన సంత్ జ్ఞానేశ్వర్‌కు కూడా ఇటువంటి పరిస్థితే ఎదురైనది. **ఆనాటి వేదవిద్వాంసుల సమూహం జ్ఞానేశ్వరుని ఆస్తికత్వమును గురించి సవాలు చెయ్యగా వారు గేదె చేత వేదమంత్రాలు ఉచ్చరింపజేశారు.** జ్ఞానహీనమైన గేదె వంటి జంతువు ముందర పండిత విద్వాంసుల ప్రతిభ వెలవెలపోయింది. ఇలాంటిదే మరియొక ఘటన-- నీమ్‌కరోరిబాబా, అజ్ఞానియైన ఒక వ్యక్తిచేత దేవాలయంలో పూజ అర్చనాదులు జరిపించినప్పుడు విద్వాంసులందరూ ఆయనను ఘోరంగా తప్పుబట్టారు. మంత్రం చెప్పటమే రాని వ్యక్తి పూజా అర్చనాదులు ఎలా చేస్తాడు? అన్నదే వారి వాదన. కొంతవరకూ అది సమంజసమేగానీ, ఇక్కడకూడా **బుద్ధికన్నా భావమే గొప్పది అని నిరూపించబడినది. నీమ్‌కరోరిబాబా ఆ పూజారి తలను స్పృశించగానే అతడు పూజావిధానం యావత్తూ సుస్వరంతో పఠించసాగాడు.**

భగవంతుడు, ఆయన భక్తులూ భావనాతలంలో నివసిస్తు వుంటారు. భావంతో ఏదైనా సాధ్యం కాగలదు. శ్రీశంకరాచార్యుల వారికి అత్యంత జ్ఞానమూర్తులైన శిష్యగణం ఉండేది. వారితోపాటే ఒక నిరక్షరాస్యుడు, మందమతి యైన 'తోటకుడు' అనే శిష్యుడు కూడ ఉండేవాడు. జ్ఞానవంతులైన ఇతర శిష్యులందరూ అతనిని ప్రతిదినమూ వ్యంగ్యపూరితమైన మాటలతో వెక్కిరిస్తూవుండేవారు. ఈ విషయం తెలిసినపుడు శంకరాచార్యులవారిలో అతనిపట్ల ఆర్ద్రత వెల్లివిరిసింది. వారియొక్క **భావపూరితమైన కరుణ తోటకునిలో ధారాప్రవాహంవంటి జ్ఞానంగా మారి పెల్లుబికింది. అజ్ఞాని అయిన అతడు ఒక్కసారిగా జ్ఞానమూర్తి అయినాడు.** స్వామీ వివేకానందులవారు కూడా 'సద్గురువుయొక్క ఘనిష్ఠమైన సంవేదన యొక్క స్పర్శ మాత్రం చేతనే జడపదార్థం కూడా చైతన్యవంతం కాగలిగినప్పుడు మానవుడు వారి జ్ఞానంతో నిండటానికి కావటానికి ఎన్ని క్షణాలు కావాలి?' అని సెలవిచ్చారు.

**'భగవంతునియొక్క స్పర్శమాత్రం చేతనే అసంభవాలు సంభవాలై తీరుతాయి'** అని తమ అనుభవం ఆధారంగా శ్రీఅరవిందులవారు ప్రవచించారు. ఒకమారు వారు 'నేను వ్రాసిన దేమైనా ఉంటే, అందులో ఏమీ లేదు. దానిని వ్రాయటానికి కూడా సాధ్యం కాదు. ఐతే నేను వ్రాసినది, ఒక వెయ్యి సంవత్సరాల తరువాత రాబోయే ఒక క్రొత్త మానవజాతికి ఉపకరిస్తుంది' అన్నారు. శ్రీఅరవిందుల వారు వ్రాసిన 'సావిత్రి' అనే అత్యుత్తమ గ్రంథం భావజగత్తునుండి ఉదయించింది. అదికూడా మనస్సు-బుద్ధి సమాప్తమైనప్పుడు.

విజయం చివరకు హృదయానిదే! మనస్సుది కాదు. అందుచేత మనం కూడా **బుద్ధి యొక్క జంజాటం నుండి బయటపడి మన హృదయాలను సంస్కరించుకోవాలి.** సంస్కరింపబడిన హృదయంలో పవిత్రమైన భావనలు నివాసం చేస్తాయి. భావనల యొక్క పవిత్రత అనే స్పర్శను పొంది బుద్ధికూడా నిర్మలమౌతుంది. ఈ నిర్మలమైన బుద్ధి - మేధ, ప్రజ్ఞా, ఋతుంభరాప్రజ్ఞ అనే రూపాలలోకి మార్పుచెందుతుంది. బుద్ధిని చెడు మార్గాలలోకి పోనీయకుండా, భావనలను సంరక్షించుకుంటూ ఉండటం అవసరం. అప్పుడు భావనలు బుద్ధికి తగిన పోషణ నిస్తాయి. ఈ రెండింటి యొక్క సముచితమైన సమన్వయంతో అభివృద్ధి పథానికి క్రొత్త కోణాలు ఆవిష్కృతమౌతాయి. అందుచేత బుద్ధికి సంబంధించిన చెడు మార్గాలు, కుతంత్రాల నుండి మనలను మనం రక్షించుకుంటూ ఉండాలి. భావనలను ఎప్పటికప్పుడు సంస్కరించుకుంటూ ఉండవలెను.

*- అఖండజ్యోతి, మే 2005*

*అనువాదం : శ్రీమతి కృష్ణకుమారి, గుంటూరు*

**అనుకున్నది చెప్పాలి, చెప్పింది చేయాలి.**



ధారావాహిక: హనుమత్ కథామృతం-31

# భక్తాగ్రేసరుని స్మరణతో శ్రీరాముని కళ్లు కూడా చెమర్చాయి

అయోధ్య శ్రీరాముని పట్టణం అనుకోగానే బ్రహ్మర్షి వశిష్ఠుని హృదయం పులకించిపోయి ఒక్కసారిగా శరీరమంతా రోమాంచితం అయిపోయింది. మర్యాదా పురుషోత్తముని సాన్నిధ్యం కోసమే వశిష్ఠుడు ఇంత కాలంగా అయోధ్యను, అయోధ్యను పాలించే ప్రభువులను అంటిపెట్టుకుని ఉన్నాడు. తరతరాలుగా కులపురోహితునిగా బాధ్యతలను స్వీకరిస్తున్నాడు. అయోధ్యా పాలకులు పుణ్యాత్ములు, తపస్సంపన్నులు, భగవద్భక్తులు. మహాతేజస్వి అయిన రఘుమహరాజు, మహాదాత అయిన అంబరీషుడు ఈ వంశంలోనే జన్మించారు. ఇక్ష్వాకు వంశీకులందరు దైవభక్తులు, నీతిమంతులు, యుద్ధకుశలురు, ప్రజా సేవకులుగా ఖ్యాతిగాంచినవారే. వారి సాహచర్యం మానవులకే కాదు, దేవతలకు కూడా గర్వకారణమే. వీరందరికీ కుల గురువు వశిష్ఠుడే.

వశిష్ఠమహర్షికి శ్రీరాముడన్నా, ఆయన సోదరులన్నా అమితమైన ప్రేమానురాగాలు పొరలి వస్తాయి. శ్రీరాముని కొరకు ఎదురుచూస్తూనే ఇంతకాలం గడిపివేశాడు. శ్రీరాముని సద్గుణాలు ఆయనను ఎంతగానో ఆకర్షించాయి. శ్రీరాముని అయోధ్య ఆయనకు బ్రహ్మలోకం కన్నా ఎక్కువ. వశిష్ఠుడు ఎప్పుడూ శ్రీరాముడు అంటే నాకు అమితమైన ఇష్టం మరి శ్రీరామునికి ఎవరంటే ఇష్టం? అని ఆలోచిస్తూ ఉండేవాడు. వజ్రాయుధ ఘట్టం తర్వాత ఆ ప్రశ్నకు సమాధానం దొరికింది. శ్రీరామునికి ప్రాణ సఖుడు పరమభక్తుడు, ఆదర్శసేవకుడు హనుమాన్ అని తేలిపోయింది.

హనుమంతుని గుణగణాలు, అతని శ్రీరామభక్తి సాధన, అతనికి లభించిన అంతులేని వరదానాలు, పరమేశ్వరుని చేత రచింపబడిన ప్రత్యేక ఘటన మొదలైనవన్నీ గుర్తు చేసుకుంటూ వశిష్ఠమహర్షి అనాయాసంగా అయోధ్యకు చేరుకున్నాడు. వస్తూనే సాధనామందిరంలో ప్రవేశించాడు. మహర్షి యొక్క శిష్యగణం, ధర్మపత్ని అరుంధతీదేవి ప్రశాంతంగా ఆయన చర్యను గమనిస్తూనే ఉన్నారు. వశిష్ఠుని ముఖంలో ఎలాంటి కంగారు కానీ, అలసటకానీ కనిపించడం లేదు. ఆయన అయోధ్యలోనే కూర్చుని సుదూర ప్రాంతాలలో జరిగే విషయాలను చూడగల సమర్థుడు. పరమేశ్వరుని అవతారమైన హనుమంతుని తత్వాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నాడు. అందువల్ల అన్ని వేళలా ప్రసన్నంగా ఉంటారు.

పరమేశ్వరుని అవతారమైన హనుమంతునికి ఏనాడూ అశుభం జరగదు అని అరుంధతికి బాగా తెలుసు. హనుమంతుని భక్తి భావన ఆమెను ఆశ్చర్యచకితురాలిని చేసింది. మహర్షి వశిష్ఠుని నోటి నుండి హనుమంతుని పేరు విన్నప్పటి నుండి ఆమె హృదయంలో హనుమంతుడు పుత్ర స్థానాన్ని ఆక్రమించుకున్నాడు. అన్ని విధాల మోహవికారాలకు దూరంగా జీవిస్తున్నా అరుంధతి హృదయంలో కూడా పుత్రప్రేమ పొంగిపొర్లుతోంది. తన చేతితో వండిన ఆహారాన్ని హనుమంతునికి తినిపించాలని తహతహలాడుతోంది. ఒడిలో కూర్చుండబెట్టుకుని బుజ్జగించాలని ఆరాటపడుతోంది. అంజనీదేవి యొక్క అదృష్టాన్ని మాటిమాటికీ స్మరించుకుంటోంది. అరుంధతి అంతరంగాన్ని గ్రహించిన వశిష్ఠుడు చిరునవ్వుతో ఆమెను అభినందించాడు.

సాధనా మందిరం నుండి బయటకువచ్చిన మహర్షిని చూడగానే శిష్యులంతా ఆయనను చుట్టుముట్టారు. "గురుదేవా! ఇంతటి ఏకాంత సాధనను అనాయాసంగా ఎలా చేయగలిగారు?" అని ఒకరు, "గురుదేవా! ఈసారి సూర్య గ్రహణం ఇంతసేపు నిలచి ఉండడానికి కారణం ఏమిటి?" అని మరొకరు ప్రశ్నించడం మొదలుపెట్టారు. మహర్షి చిరునవ్వుతో "నాయనలారా! సూర్యగ్రహణం ఇప్పుడే పూర్తి అయింది. అయోధ్య ప్రజలంతా సరయూనదీ తీరానికి చేరుకుని ఉంటారు. మనం కూడా ఇప్పుడు అక్కడికే వెళ్ళాలి" అని తొందర చేశాడు. ఒక శిష్యుడు లేచి "గురుదేవా! మహామంత్రి సుమంతుడు, కొందరు రాజోద్యోగులు మీ కోసం ఇక్కడకు అనేకమార్లు వచ్చి వెళ్లారు. దశరథ మహారాజు గారు కూడా స్వయంగా వచ్చి వెళ్లారు" అంటూ సమాచారాన్ని అందించాడు. అందరూ కలసి ఆనందంగా సరయూనదీ తీరానికి బయలుదేరారు. మాతా అరుంధతీ దేవి కూడా వారి వెంట బయలు దేరింది.

దశరథ మహారాజు తన రాణులతోసహా ముందుగానే నదీ

పిసినారితనమే దారిద్ర్యం.

తీరానికి చేరుకున్నాడు. శ్రీరాముడు తమ్ములతో కలసి శివమందిరంలోనే ఉన్నాడు. శ్రీరాముని భక్తి వైరాగ్యాలు దశరథునికి తెలుసు. తమ్ములు కూడా అతనినే అనుసరిస్తారనీ తెలుసు. అందువల్ల వారికి ఎలాంటి విఘ్నాలు కలిగించేవాడు కాదు. అయినా ఒక్కసారి కబురు పెట్టాడు. లక్ష్మణుడు కూడా – అన్నా! అందరూ నదీతీరానికి పోతున్నారు. మనం కూడా పోదామా?'' అని అడిగాడు. "గురుదేవులరాకకై ఎదురు చూస్తున్నాను'' అన్నాడు రాముడు. అంటూ ఉండగానే అరుంధతితో కలసి వశిష్ఠుడు వాకిలిదాకా రానే వచ్చాడు. తమ్ముళ్ళతో కలసి వెళ్లి శ్రీరాముడు పాదాభివందనం చేశాడు. గురుదేవులు ఆశీర్వదిస్తూ –కుమారా! శ్రీరామా! నీమీద భక్తి ప్రపత్తులలో నిమగ్నమైన హనుమాన్ పూర్తిగా కోలుకున్నాడు" అని తెలియచేశాడు.

గురుదేవుల నోటి నుండి హనుమంతుని పేరు వినగానే శ్రీరామచంద్రుని నేత్రాలు చెమ్మగిల్లాయి. అది గమనించిన అరుంధతీ వశిష్ఠులు – "కేవలం భక్తునికి మాత్రమే భగవంతుడు ఇష్టుడుకాదు. భగవంతునికి కూడా భక్తుడు అంతకన్నా అధికమైన ఇష్టుడు" అని అర్థం చేసుకున్నారు. రామస్మరణవల్ల హనుమాన్ కళ్లు చెమర్చినట్లు భక్తుని స్మరణవల్ల శ్రీరాముని కళ్లు కూడా చమర్చడం వారికి ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించింది.

కొద్ది క్షణాలలోనే వశిష్ఠుడు హనుమంతుని సూర్యసాధన, శ్రీరామభక్తి, శివలీల ద్వారా జరిగిన ప్రత్యేక ఘటన, ఇంద్రుని వజ్రప్రహారం గురించి వింటున్నప్పుడు ఎప్పుడూ శాంత ముద్రలో ఉండే శ్రీరాముడు ప్రశాంతంగా ఉండలేకపోయాడు. తనకు తెలియకుండానే కళ్లు ఎరుపెక్కాయి. ఈ మార్పును వశిష్ఠుడు గ్రహించాడు. తెలివిగా విషయాన్ని మార్చివేశాడు. హనుమాన్‌కు ప్రాప్తించిన వరదానాలను ఏకరువు పెట్టాడు. దానితో శ్రీరాముడు శాంతపడ్డాడు. అతని ముఖంలో కనిపించే ఆనందాన్ని చూసి అరుంధతీ వశిష్ఠులు ఊపిరిపీల్చుకున్నారు. శ్రీరామునితో "కుమారా! హనుమాన్ స్వయంగా చెప్పకపోయినా నీ దర్శనం కోసం తహతహలాడుతున్నాడు'' అన్నాడు. శ్రీరాముడు చిరునవ్వుతో "అదికూడా పరమేశ్వరుడే చూసుకుంటాడు" అని మౌనం వహించాడు.

– *అఖండజ్యోతి 2010, ఫిబ్రవరి*

## గాయత్రీ పరివార్ సభ్యులకు సూచన

*యుగనిర్మాణము మరియు సత్యయుగ పునరాగమనవేళ పరమపూజ్య గురుదేవులు యుగఋషి పండిత శ్రీరామశర్మ ఆచార్యవర్యులు, తమ వాణిని ఇంటింటికి చేర్చవలసినదిగా గాయత్రీ పరివార్ సభ్యులైన మనలనందరిని ఆదేశించి యున్నారు.*

*ఇదే రీతిలో పూజ్యులు డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ మాష్టారు కూడా మనలందరిని, పండిత శ్రీరామశర్మ గురుదేవుల ఆదేశాలకనుగుణముగా వారి వాణియైన "యుగశక్తి గాయత్రి" మాస పత్రికను ఇంటింటికి చేర్చెడి కార్యక్రమమును వేగిరపర్చవలసినదిగా కోరియున్నారు. దీనికై ఒక సులువైన నూతన కార్యక్రమమును మనకందించిరి. ఈ కార్యక్రమంతో చందాదారుల సంఖ్య 9,000 నుండి 24,000 కు అనూహ్యముగా పెరిగింది. దీనితోపాటు వారు మన పరివారములోనున్న వారందరూ వారి వారి జన్మ / వివాహ దినమును పురస్కరించుకొని ఒక్కొక్కరు 5 మాస పత్రికలకు చందాదారులను చేర్పించవలసినదిగా సూచించియున్నారు.*

*పై సూచనకు ప్రప్రథమముగా స్పందించి, అశ్విని హోమియో & ఆయుర్వేదిక్ ప్రోడక్ట్స్ లిమిటెడ్, హైదరాబాదు మేనేజింగ్ డైరెక్టరు & గాయత్రీ పరివార్ వరిష్ఠ కార్యకర్త, శ్రీ అశ్విని సుబ్బారావుగారి కుమారుడు శ్రీ బచ్చు అనిల్ కుమార్, శ్రీమతి భవానీ గార్ల వివాహదినం సందర్భమున మరియు శ్రీ అనిల్ కుమార్ గారి జన్మదిన సందర్భమున 15 మాస పత్రికలకు చందాదారులను చేర్చినారని తెలుపుటకు సంతసించుచున్నాము. వారిని యుగశక్తి గాయత్రి అభినందించుచున్నది.*

*గాయత్రి పరివార్ ప్రతి కార్యకర్త దీనిని స్ఫూర్తిగా తీసికొని ఇదే రీతిలో స్పందిస్తూ యుగశక్తి గాయత్రీ చందాదారుల సంఖ్యను నవంబరు 2011 నాటికి లక్ష సంఖ్యను అధిగమించేలా సంకల్పించవలసినదిగా కోరడమైనది.*

*జనవరి 2011 నుండి ఇదే రీతిలో చందాదారులను చేర్చినవారి పేర్లను యుగశక్తి గాయత్రి మాసపత్రికలో "స్ఫూర్తి దాతలు"గా ప్రచురించెదము.*

**మంచితనం సరిపోదు. సామర్థ్యం కూడా కావాలి.**

మనం మన ఆరోగ్యం

# రాబోవు రోజులలో రంగులతో చికిత్స

సవిత దేవత యొక్క ఆరాధనా విధానం ఆప్త వచనములలో ఉంటుంది. యదార్థానికి సవితా దేవత ప్రకాశమును వేడిని ఇచ్చేదిగాను, వృక్ష వనస్పతులలో జీవసంచారం చేయించేదిగాను, ప్రాణి జగత్తులో స్ఫూర్తిని నింపేది మాత్రమేకాక, తన సప్త కిరణాలలో వ్యక్తిని రోగరహితుడుగా చేసే అభూతపూర్వ సామర్థ్యము దాగి ఉంది. మనము సరిఅయిన పరిమాణంలో సరిఅయిన వర్ణములను (రంగులను) ఉపయోగించుకొని కేవలము రోగాలను పోగొట్టుకోవడమేకాక బలాన్ని కూడా పొందవచ్చు.

వర్ణచికిత్స (క్రోమోపతి) ని ప్రకృతిలోని ఒక రహస్యమయ విజ్ఞానముగా భావిస్తారు. సుప్రసిద్ధ చికిత్సకుడైన సైంటిస్ట్ డాక్టర్ ఎడ్గర్ మేసి ఎప్పుడు - చికిత్స విధానం యొక్క భవిష్యత్తు, ప్రకాశము అంటే స్పెక్ట్రమ్, ధ్వని తరంగాలపైనే ఆధారపడి ఉంటుందని అన్నాడు. రంగు మరియు ధ్వని చికిత్సలో శరీరములో రోగగ్రస్తమైన అవయవాలలో రంగుతో నిండిన కిరణాలను పంపించాలి. వీటిని బల్బు ద్వారా ఉత్పత్తి చేయవచ్చు. అంతేకాక అప్పుడప్పుడు విశేషమైనటువంటి విధానముతో తయారు చేయబడిన రేడియోనిక్స్ బాక్సులను కూడా ఉపయోగిస్తారు.

మనిషితోపాటు సమస్తమైన జీవధారులకు, వృక్ష వనస్పతులకు సూర్యునియొక్క శక్తి ప్రతిక్షణం అవసరం అవుతుంది. ప్రకాశ కిరణములు ద్వారా ఈ అవసరం నిరంతరం తీరుతుంటుంది. శుభ్రమైనవిగా, ఉజ్జ్వలంగా కనిపించే ఈ కిరణాలు యదార్థానికి ఎన్నో భాగాలుగా విభజింపబడతాయి. ఎరుపు, కాషాయం, పసుపు, ఆకుపచ్చ, నీలం, జంబుకి నీలం (ఇండిగొ) మరియు వంకాయ అనబడే 7 రంగులలో గాజు ప్రిజమ్ ద్వారా వేరు-వేరుగా అవడం గమనించవచ్చును. ఇంద్రధనుస్సులో కూడా ఉండే ఈ 7 రంగులకి మానవ శరీరానికి చాలా దగ్గర సంబంధం ఉంది. ఇందులో ఏ ఒక్క రంగు లోపం అయినా శరీరములో ఉంటే ఆరోగ్య సంతులన దెబ్బ తింటుంది. ఈ కారణము వల్లే విభిన్న రోగాలకి సూర్యుని ఎక్కువ వేడిలేని ఎండలో ముఖ్యంగా ప్రాతః కాల అరుణోదయ సమయంలో ఎండ శరీరం మీద పడేటట్టు చూచుకోవడం చాలా ముఖ్యమైనదిగా భావిస్తారు. రంగుల చికిత్స పద్ధతిలో కృత్రిమంగా దీపం (బల్బు) ద్వారా వెదజల్లబడే వెలుతురు ద్వారా శరీములోని రంగు లోపాన్ని సరిచేసుకోవచ్చును, రోగాన్ని తగ్గించుకోవచ్చును.

ప్రఖ్యాత చికిత్సకురాలు శ్రీమతి ఎలిన్ హాబార్డ్‌ని హోమియోపతి, రేడియోనిక్స్ మరియు కలర్ థెరెపి స్పెషలిస్ట్‌గా భావిస్తారు. ఆమె ప్రకారం రోగోపచారములో రకరకాల రంగులు ముఖ్యమైన పాత్ర వహిస్తాయి. ఎరుపు రంగు యొక్క ప్రాముఖ్యత ఏమిటంటే ఇది నరాల మరియు రక్త క్రియాశీలతని పెంపొందిస్తుంది. శరీరములో ప్రాణశక్తి సంచారం చక్కగా జరిపే బాధ్యత ఎరుపు రంగుది. అంతేకాక ఎడ్రినల్ గ్రంథి మరియు నరాలను ఉత్తేజపరిచే పనికూడా ఎరుపు రంగు చేస్తుంది. చికిత్స చేసేటప్పుడు ఈ రంగును ఎంతో జాగ్రత్తగా ఉపయోగించాలి. అత్యధిక ఉత్తేజపరిచే గుణంకలది కాబట్టి చాలా జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. ఎందుకంటే ఇది భావనాత్మక వ్యతిరేకతని (కోప తాపాలను) కూడా ఉత్పన్నము చేస్తుంది. అందుకనే ఈ రంగును నేరుగా ఉపయోగించుకోకుండా ఎల్లప్పుడూ ఆకుపచ్చ మరియు నీలం రంగుతో పాటు జోడించి ప్రయోగిస్తే ఎక్కువ లాభం ఉంటుందని భావిస్తారు.

కాషాయ రంగు ఎరుపు, పసుపుల కలయికతో ఏర్పడుతుంది. ఎరుపు కన్నా ఈ రంగు యొక్క ప్రభావం చాలా ఎక్కువ సమయం వరకు ఉంటుంది. ఈ రంగు రోగాణువులను నిరోధించే దక్షతను పెంచుతుంది. ఈ రంగును బెణుకులకు, కండరాలు పట్టుకుపోతే వాడుతారు. కాల్షియం, జీర్ణశక్తి యొక్క మెటాబాలిజ్మ్‌ని అభివృద్ధికి, ఊపిరితిత్తులు, పేంక్రియాజ్ మరియు స్ప్లీన్-ప్లీహమును శక్తివంతంగా తయారుచేయడములో కాషాయ రంగు చాలా ముఖ్య పాత్ర నిర్వహిస్తుంది. ఈ రంగు నాడిగతిని పెంచి, బ్లడ్ ప్రెషర్‌ను సామాన్య స్థితిలో ఉంచుతుంది. ఈ రంగు ప్రభావము వల్ల భావనలు పెంపొందింపబడుతాయి.

మోటార్ తంత్రికల క్రియాశీలతను పెంచడములో పసుపురంగు ప్రకాశ కిరణాలు చాలా కీలకపాత్ర వహిస్తాయని తమ రీసెర్చ్ పరిణామాలలో చికిత్సా శాస్త్రజ్ఞులు వెల్లడించారు. ఎక్కువ కాలము వరకు పసుపు రంగును ఉపయోగించకూడదు, దీనివల్ల పిత్త దోషాలు కలుగవచ్చును. అంతేకాక జీర్ణ ప్రక్రియలో అవకతవకలు జరిగే అవకాశము ఉంది. అంతేకాక సన్నిపాతము మరియు హృదయవేగం పెరుగుతుంది. యదార్థానికి పసుపురంగు బుద్ధి వర్ధకముగా భావిస్తారు.

ఆకుపచ్చరంగు కిరణాలు మానవీయ శరీరములో ప్రవేశించి

**గౌరవం సద్గుణాలకి బహుమానం.**

రక్త ధమనులను విస్తరింపచేస్తాయి, అంతేకాక హృదయములో ఉత్తమ భావాలను వికసింపచేయడంలో సహాయకారిగా ఉంటాయి. మానసిక టెన్షన్‌ను పోగొట్టడములో ముఖ్యంగా సహాయకారి. కాని దీనిని ఎక్కువ ప్రయోగించడము వల్ల పిట్యూటరీ గ్రంథి మరియు మాంస కండరాల కోశికలపై చెడు ప్రభావం కలుగచేస్తుంది.

నీలము రంగు కిరణాలు చల్లదనాన్ని ఇచ్చేదిగా భావిస్తారు. మస్తిష్కము యొక్క అత్యున్నత స్థితి అనగా అంతఃప్రజ్ఞని మేల్కొలిపే దక్షత ఈ రంగులో ఉంది. చర్మము కాలినపుడు సాధారణంగా ఈ రంగునే వాడుతారు. జంబు నీలం వెలుతురు మోటార్ తంత్రికలు, లింఫెటిక్ మరియు హృదయ తంత్రులను బాగా పనిచేయిస్తుంది. వంకాయ రంగు శరీరములోని పోటాషియంని సంతులితంగా ఉంచే దక్షత కలిగి ఉంటుంది. ఇంకా ట్యూమర్ పెరగనీయకుండా ఆపేస్తుంది. అతి ఆకలిని వంకాయ రంగు ఆపుతుంది.

వైజ్ఞానికులు రకరకాల రంగుల మిశ్రమముతో కొన్ని రోగ నివారణకి పనికి వచ్చే రంగులను గుర్తించారు, ఇవి రోగాలకి మందుగా చాలా చక్కగా పనిచేస్తాయి. లెమన్ అనగా నిమ్మపండు రంగు లేత పసుపు మరియు ఆకుపచ్చ రంగుల మిశ్రమము. దీనిలో రేచకము (Purgative) చేయగలిగితే గుణము ఉంది. మస్తిష్కమునకు చెందిన సెరిబ్రల్ భాగాన్ని ప్రభావితం చేస్తుంది. ఇందులో కలిసి ఉన్న పసుపు రంగు ఏంటాసిడ్ (ఆమ్ల పిత్త నాశనకారి) గా పనిచేస్తుంది. నొప్పి నివారించేలాగా వంకాయ రంగు కిరణాలు పనిచేస్తాయి. ఈ వంకాయ రంగు ఎరుపు, నీలం రంగును ఎక్కువగా కలపటం వల్ల ఏర్పడుతుంది. ఈ రంగు మలేరియా నిర్మూలనలో చాలా సక్రియంగా పనిచేస్తుంది. ఊదా రంగు, ఎరుపు రంగు ఎక్కువ పాళ్లలో, నీలం రంగు చాలా తక్కువ పాళ్లలో కలవటం వల్ల ఏర్పడుతుంది. ఇది మలద్వారాన్ని, కామేంద్రియాన్ని ఉత్తేజపరుస్తుంది. ఎరుపు, వంకాయ రంగు కలిపి మెజెంటా కలర్ తయారువుతుంది. ఇది హృదయము మరియు ఎడ్రినల్ గ్లాండ్‌ని సక్రియంగా ఉంచేటందుకు ఉపయోగపడుతుంది. మైలుతుత్తం రంగు, నీలం ఆకుపచ్చల మిశ్రమం వల్ల ఏర్పడుతుంది. ఈ రంగు చర్మరోగాలు లేక చర్మమునకు సంబంధించి అవకతవకలను సరిచేస్తుంది. సైనసైటిస్ చికిత్సలో ఈ రంగును ఉపయోగిస్తారు. ఎరుపు తెలుపు రంగుల కలయికవల్ల గులాబి రంగు ఏర్పడుతుంది. భావనాత్మకంగా వికసించుటకు ఈ రంగు చాలా ఉపయోగకరము.

ఆరోగ్యాన్ని ఎల్లప్పుడూ సరిగ్గా ఉండేటట్టు చూసుకోవడానికి దీనిలో కాంతివంతమైన, రంగుల సంతులన అవసరం ఎంతైనా ఉంది. తద్వారా శరీరము యొక్క విభిన్న కార్యకలాపాల సంచాలన జరగడానికి శక్తి లభిస్తుంది. ఖగోళ శాస్త్రజ్ఞులు ఒక మనిషి యొక్క ఆకృతి మరియు ప్రకృతిని చూసి, ఏ శరీరానికి ఎంతవరకు రంగుల వెలుగులు అవసరమో వారి సూక్ష్మ బుద్ధిద్వారా తెలుసుకొని నిర్ణయించాలి. ఇది వారి బుద్ధికి మాత్రమే సాధ్యము. యదార్థానికి వర్ణ చికిత్స యొక్క పని జ్యోతిష్య విజ్ఞాన సహాయము ద్వారా చాలా సులభతరమవుతుంది.

వర్ణచికిత్స వైజ్ఞానికంగా సమ్మతించబడిన విధానంలో కావలసిన వ్యక్తులపై ఉపయోగించడము సంభవిస్తే చికిత్సా రంగంలో ఒక కొత్త విస్తృత డైమెంషన్స్‌కు జన్మనివ్వవచ్చును. నేడు మానవ జాతికి ఏ హాని జరుగనటువంటి తేలికైన ఉపాయాలు, ఉపచారాలు అవసరం కాబట్టి ఈ రంగములోనే అనుసంధానములు జరగాలి.

*– అఖండ జ్యోతి, మే 1988*

*అనువాదం : శ్రీమతి లక్ష్మీ సుందరి*

## సహకారంలో సార్థకత

*పంచభూతాలు ఒక రమ్యమైన పర్వతం మీదకు చేరుకుని ఎవరి గొప్ప వారు చెప్పుకోనారంభించాయి. ప్రపంచ భారాన్ని తానే మోస్తున్నానని, అందరి కడుపులు నింపుతున్నానని, తాను లేకపోతే జగత్తే లేనది అన్నది పృథ్వీ. తాను లేకపోతే జీవులు, వృక్షాలు, వనస్పతులు ఒకటేమిటి సమస్త ప్రాణులు ఎండిపోయి హాహాకారాలు చేస్తాయని అన్నది జలం. తిండి నీరు లేకపోయినా కొంత కాలం జీవించవచ్చు. కాని గాలి లేకుండా ఒక్క క్షణం కూడా జీవింపజాలరు. నేను కంటికి కనిపించకపోతేనేమి, నేను లేకుండా ప్రాణులు ఊపిరి ఆడక చనిపోతారన్నది వాయువు. వేడి, వెలుగు లేకుంటే ఈ లోకంలో నిశ్శబ్దం, శీతలత్వం తప్ప ఏముంటుంది? బ్రతుకులు అంధకారమవుతాయని అన్నది అగ్ని. నలుగురి మాటలు వింటున్న ఆకాశం మౌనంగా ఉండిపోయి చివరకు అన్నది "మిత్రులారా! మనం కలసి ఉండటం వల్లనే ఈ లోకం నడుస్తుంది. మనలో ఏ ఒక్కరు అలిగినా లోకం స్థంభించిపోతుంది. కాబట్టి గొప్పతనం మనలో ఏ ఒక్కరిది కాదు. కలసి ఉండటంలోనే, సహకారంతో పనిచేయడంలోనే మన గొప్పతనం నెలవై ఉన్నది"* – ప్రజ్ఞాపురాణం నుండి

**వినయం లేని విద్య అహంకారాన్ని పెంచుతుంది.**



పూజ్య గురుదేవుల అమృతవాణి

# పంచకోశ జాగరణ - సిద్ధి ప్రాప్తి

గత సంచిక తరువాయి...

## దైవత్వం అంటే ఏమిటి?

మిత్రులారా! దైవత్వాన్ని వికసింపచేసుకోవడం విజ్ఞానమయకోశం ద్వారా సంభవిస్తుంది. మీలో దైవీ గుణాలు జాగృతమై, తీసుకునే ప్రవృత్తి, దానవ ప్రవృత్తి, ఏది దొరికితే అది మింగేసే ఆసుర ప్రవృత్తి పోయేలా చేయడానికి నేను ప్రయత్నిస్తాను. కాదండీ, సాయిబాబా నుండి, సంతోషిమాత నుండి, గురువుగారి నుండి, వినాయకుడి నుండి మేము తీసుకుంటూనే ఉంటాము అంటే మాత్రం అది దైవ ప్రవృత్తి కాదు.

## ఇవ్వడంలో ఉన్న తృప్తి

మనం ఎక్కడికి వెళ్ళినా, అక్కడ ఇచ్చే వస్తాము అనే ప్రవృత్తిని కలిగి ఉండడం దైవత్వం. మనస్సు, దానం, శ్రద్ధ, భావనలను ఇచ్చి వస్తాము. పుచ్చుకోవడంలోని ఆనందం మీరు అనుభవించి ఉంటారు కాని ఇవ్వడంలోనే మరింత ఆనందం అనుభవిస్తారు. ప్రేమని, సహాయాన్ని, శ్రద్ధని, మరేదాన్నైనా సమాజానికి ఇచ్చీ-ఇచ్చీ మీరు దేవతలవుతారు. దేవతలు స్వర్గంలో ఉంటారు. "నన్ను నరకానికి పంపించండి, అక్కడే నేను నా స్వర్గాన్ని నిర్మించుకుంటాను." అని ఎమర్సన్ అనేవారు. స్వర్గం అనేది ఎక్కడా లేదు. అది మీకై మీరు నిర్మించుకోవలసిందే.

పురాణాల్లో, కథలలో చిత్రీకరించబడ్డ స్వర్గం అంటే నాకు అసహ్యం. కొంతమంది చెప్పగా విన్నాను. స్వర్గంలో మద్యం ఏరులై పారుతుందట, మాదక ద్రవ్యాలకు లోటే ఉండదట, అన్నిటికీ పనివాళ్ళు ఉంటారట. అలాంటి స్వర్గమంటే నాకు అసహ్యం. నేనే గనక వెళ్ళవలసి వస్తే నాటికెట్టు ఇంకెవరైనా కావలన్నా వాళ్ళకి ఇస్తాను. వాళ్ళు చెప్పిన వస్తువులే గనక అక్కడ దొరికితే వాటితో నాకు పని లేదు. అక్కడ్నుంచి పిలుపు వస్తే, ఈ చిరునామాలో ఆ వ్యక్తి లేదని చెప్పి పంపేస్తాను, 'రెఫ్యూస్' అని రాయించి పంపించేస్తాను. నాకు చాలా పనులున్నాయి. అలాంటి స్వర్గాన్ని అనుభవించే ఆసక్తి, తీరిక నాకు లేదు.

## స్వర్గీయ వాతావరణం తయారు చేసుకోవాలి

అనంతమైన ఆనందం కలిగే చోటుని స్వర్గమంటారు. ప్రేమ ధారలు ప్రవహించే చోట ఆనందం కలుగుతుంది. ఒకరికొకరు పరస్పర సహకార భావనతో ముందుకు సాగుతూంటే స్వర్గీయ వాతావరణం నిర్మించబడుతుంది. **స్వర్గాన్ని తయారుచేయడానికి ఉదార ప్రవృత్తిని అలవరచుకోవాలి.** ఔదార్యం పెరిగిన కొద్దీ మనలో దైవత్వం వికసించి స్వర్గీయ వాతావరణం నెలకొంటుంది. దైవత్వం వల్ల ఎన్నో లాభాలున్నాయి. దేవతలు త్రికాలదర్శులు. వారు ఆశీర్వదించగలరు, వరాలివ్వగలరు. దైవత్వం వికసించిన కొద్దీ సిద్ధులు, చమత్కారాలు వాటంతటవే వస్తాయి.

## సూక్ష్మ జగత్తు ఉంది

మనలో ఒక సూక్ష్మ జగత్తు ఖచ్చితంగా ఉంది. ఈ మధ్యనే ఏంటీ యూనివర్స్ (Anti-Universe), ఏంటీ మాటర్ (Anti-Matter), ఏంటీ ఏటమ్ (Anti-Atom) మొదలైన వాటిని సైన్సు కనుగొన్నది. ఎండలో నిలబడితే మన వెనక మనతో పాటే నీడ వచ్చినట్టే ప్రతీ ప్రాణికీ ఒక భూతం ఉంది. ఈ విశ్వానికి కూడా నీడలాగా ఒక ఏంటీ యూనివర్స్ ఉంది.

## ఏంటీ యూనివర్స్ అన్నది నిజం

ఆధునిక వైజ్ఞానికుల ప్రకారం ఒక ఏంటీ యూనివర్స్, ఏంటీ మాటర్ తప్పక ఉన్నాయి. వీటి జ్ఞానం తెలుసుకుంటే, వాటి రియాక్షన్ చేజిక్కితే మనిషి హిరణ్యాక్ష, హిరణ్యకశ్యపుల వంటి దైత్యుడుగా మారిపోతాడు. వీటి గురించి 'అఖండ జ్యోతి'లో ఇదివరకే రాసాను. ఇవి ఉత్తుత్తి మాటలు కావు, పచ్చి నిజాలు.

మిత్రులారా! స్థూల జగత్తు వెనకాల సూక్ష్మ జగత్తు పని చేస్తూనే ఉంటుంది. మన శరీరం స్థూలం. అందులో ఒక సూక్ష్మ శరీరం పనిచేస్తూ ఉంటుంది. ఏది జరిగినా అది సూక్ష్మ ప్రక్రియల వల్లే జరుగుతుంది. దూరదర్శనం మొదలుకుని అన్ని అతీంద్రియ సామర్థ్యాలూ సూక్ష్మం నుండీ వస్తూంటాయి. స్థూల శరీరం వదిలేసాక మనకు సూక్ష్మ జగత్తులోకి ప్రవేశిస్తాయి. ఆ సూక్ష్మ జగత్తులోనే మనముండేవారము, అక్కడే తరువాత లయమైపోతాయి. చాలా కాలం సూక్ష్మజగత్తులోనే ఉండి, ఆపై

ప్రజాభిప్రాయాన్ని మార్చేవాడే లీడర్ (నాయకుడు).

కొంతకాలం స్థూలంలోకి వచ్చి మళ్ళీ సూక్ష్మంలో లీనమైపోతాయి. సూక్ష్మ జగత్తు కూడా మన స్థూల జీవనం లాగానే ఉంటుంది. కాని ఇప్పుడు మాకు దానితో ఎలాంటి సంబంధమూ, సంపర్కమూ లేదు.

## విజ్ఞానమయకోశ జాగరణ వల్ల లాభాలు

మిత్రులారా! సూక్ష్మజగత్తుతో సంబంధము కల్పించుకోవడానికి ఎప్పుడైతే విజ్ఞానమయకోశం జాగృతమౌతుందో అప్పుడే మనలో విలక్షణమైన సామర్థ్యాలు వికసిస్తాయి. ఇప్పుడు వినిపించనివి, కనిపించనివీ, తెలియనివీ కూడా అప్పుడు తెలిసి, విశ్వమంతటితో సంపర్కం కలిగి అవసరమైనప్పుడు ఆ శక్తులను వినియోగించడం జరుగుతుంది. తెలిస్తే సరిపోదు. మనం నిత్యం ఉపయోగించే సౌరశక్తి వలె, సూక్ష్మ జగత్తులో మనం చెప్పుకునే దివ్యశక్తులతో కూడా వ్యవహరించడమే విజ్ఞానమయకోశ జాగరణ.

## ఏంటినా (Antenna) మనలోనే ఉంది

విజ్ఞానమయకోశ సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి కావలసిన మెషీన్లు, ఏంటినాలు మనలోనే చాలా ఉన్నాయి. ఆజ్ఞాచక్రం, హృదయచక్రం, నాభిచక్రం పనిచేస్తాయి. ఒక ఏంటినా పెట్టుకుని మనమెలా అయితే ప్రపంచం నలుమూలలకు సంబంధించిన సమాచారాలు తక్షణమే టివీలలో చూడగలుగుతున్నామో అదేవిధంగా మనలోనే ఉన్న ఏంటినా ద్వారా దివ్యదృష్టి, దివ్యవాక్కు మొదలైన శక్తులను ఉపయోగించుకుంటాము. అందుకే విజ్ఞానమయకోశం ద్వారా సిద్ధపురుషులం కాగలము. విజ్ఞానమయకోశం జాగృత పరచుకోవడమెలాగో నేను కొన్ని పత్రికల్లో తెలిపాను.

## ఆనందానికి స్రోత ఆనందమయకోశం

మనలోనే ఒక ఆనందనిధి దాక్కుని ఉంది. మనలోనే ఉన్న బ్రహ్మలోకాన్ని బ్రహ్మరంధ్రం అని అంటాము. విష్ణుమూర్తి శయనించే క్షీరసాగరం కూడా దీనిలోనే ఉంది. మన మెదడులోని గ్రే మాటరే (grey matter) క్షీర సాగరం. లోపల ఉన్న సహస్రార చక్రమే వేయి పడగల ఆదిశేషుడు. దీనిలోనే మానస సరోవరం ఉంది. సహస్రార చక్రాన్నే కైలాస పర్వతం అంటారు. భూమి యొక్క ఉత్తర ధృవం సమస్త బ్రహ్మాండ అంతర్గత శక్తుల్ని గ్రహించి దక్షిణ ధృవం నుండి వదిలేస్తుంది. బ్రహ్మాండంలో ఉన్నటువంటి దైవీ భౌతిక, అభౌతిక సామర్థ్యాలను మనం గ్రహించవచ్చు. మనకి అవసరమైనవి మాత్రమే గ్రహించి మిగిలినవి వదిలేయవచ్చు కూడా.

## బ్రహ్మ విద్యా మర్మం

మిత్రులారా! సహస్రార చక్ర జాగరణ ఆనందమయకోశానికి సంబంధించింది. ఇది అంతర్విద్య. మన ఆధ్యాత్మిక విద్య, బ్రహ్మ విద్య, పరోక్షవాదం ద్వారానో, కథలు, పురాణాల ద్వారా కాకుండా సైంటిఫిక్‌గా, వైజ్ఞానికంగా, ప్రత్యక్షవాదంతో ఈ విద్యను మీరు ఏ విధంగా ఐదు విభూతులను ఉపయోగించుకుని, వికసింపచేసుకుని, ఆచరణలోకి ఎలా తీసుకురావాలి? సామాన్య జీవితాన్ని అసామాన్య జీవితంగా ఎలా మార్చుకోవాలి? మనిషిలో దైవత్వాన్ని ఎలా వికసింపచేసుకోవాలి? ఒక శ్రేష్ఠమానవునిగా ఎలా రూపుదిద్దుకోవాలి? ఈ బ్రహ్మ విద్య, బ్రహ్మ తేజస్సుకూ సంబంధించిన విద్యని, శిక్షణనీ బ్రహ్మవర్చస్ ద్వారా మీకిస్తాము.

## పంచకోశ జాగరణ చేసుకోండి

మిత్రులారా! పంచకోశాలని ఎలా జాగృతపరచుకోవాలి? మనలో ఉన్న ఐదు దూతలు, ఐదు దేవతలు, ఐదు నౌకర్లు, వీరిని ఎలా యోగ్యులను, బలవంతులను చేసుకుని మనకి కావలసిన విధంగా మలుచుకుని ఎలా మహా మానవులవ్వాలి? ఈ మొత్తం విద్యని ప్రాచీన ఋషులు అధ్యాత్మవాదం అనే పేరుతో వైజ్ఞానికంగా మనకి అందించారు. మేమూ అదే చేస్తున్నాము మీరు ఎంత తీవ్రగతిలో ఈ విద్యను స్వీకరించగలరో దాన్ని బట్టి మీకు ఈ విద్యని అందచేసి మెల్లిమెల్లిగా ఋషుల, మునుల స్థాయికి చేరుస్తాము. మీరు మేము తెల్పిన పంథాలోనే నడవండి. అప్పుడే మా ఈ ప్రయత్నం సఫలమవుతుంది.

*– అఖండ జ్యోతి, మార్చి 2010*

*అనువాదం : శ్రీమతి జయలక్ష్మి*

**యుగశక్తి గాయత్రి**
**మాస పత్రిక చదవండి !**
**చదివించండి !!**

ప్రజాభిప్రాయానికి లోనయినవాడు లీడర్ కాజాలడు.

నావారితో నామాట : 2011 - 2012 జన్మ శతాబ్ది సంవత్సరం

# ఇంకా 38 రోజులే మిగిలివున్నాయి

4 సంవత్సరములనుండి కొనసాగుతూవస్తున్న ఈ కౌంట్‌డౌన్‌కు ఇదే చివరి భాగము. రాబోయే 2011, ఫిబ్రవరి నెల నుండి శతాబ్దీ సంవత్సర ప్రణాళికా ప్రక్రియ ఆరంభమౌతుంది. ఈ ప్రక్రియ 12 నెలలపాటు సాగే జన్మశతాబ్దీ ఏర్పాట్లకు 'యాజ' రూపము. అది 24 నెలలు అనగా 2014 వసంతపర్వం వరకు కొనసాగే అనుయాజరూపంలో పూర్తవుతుంది. ఇప్పుడు కేవలము ఉత్సవ ఆరంభమే జరుగబోతున్నది. ఈ సంవత్సరమంతా - శతాబ్దీ పురుషుని స్మరించుకునేందుకు, ఆయన భావనలను దిక్‌దిగంతాలవరకు వ్యాపించేయటానికి, గురుదేవులకు పవిత్రమైన శ్రద్ధాంజలి ఇచ్చేందుకు సమర్పించబడుతుంది. కనుకనే ఈ సంవత్సరము అత్యంత విశేషమైనది. శతాబ్దీ వసంతపర్వమునకు ముందుగా ఈ సంవత్సరమంతా మనము ఏవేమి కార్యక్రమాలు చేయబోతున్నాము అనే విషయమును మననము చేసుకుందాము.

## 1) దేశ జాగరణ చేసే దీపయజ్ఞాలలో భాగస్వామ్యము

దేశమంతా ఈరోజులలో ఈ దీపయజ్ఞముల కార్యక్రమాలు ఒకేసారి జరుగుతున్నాయి. ఈ క్రమము 2011 మార్చినెలవరకు కొనసాగుతుంది. పూజ్యగురుదేవులు కనీసము 2 కోట్లమంది ప్రజ్ఞాపరిజనులు మరియు 2 లక్షలమంది ప్రజ్ఞాపుత్రులు కావాలని కోరుకున్నారు. 'మనం ఈ ప్రక్రియను ప్రయాజక్రమంలో ఎంత వరకు చేయగలము?' అన్నదాన్ని మనం వ్యక్తిగత మరియు సామూహిక స్థాయిలో నిర్ణయించుకొనవలెను. గురుసత్తా ఆకాంక్షలకు అనుగుణంగా ఈరోజులలో మనం ఎంత పని చేయగలిగితే, గురుసత్తా అనుదానము కూడా అంతే స్థాయిలో నిరంతరము వర్షిస్తుంది. దేశమును జాగృతపరచే దీపయజ్ఞములలో ఇదే జరుగుతున్నది. కేంద్రస్థాయి బృందాలు ఈ పనినే నిర్వహిస్తున్నాయి. కానీ కేవలము ఈ ప్రయత్నము మాత్రమే సరిపోదు. విద్యావ్యాప్తి యజ్ఞాలవలెనే దీనికి కూడా ప్రాంతీయ స్థాయిలోని బృందాలు క్రియాన్వితమవ్వాలి. సమర్థత కలిగిన సమయదానమిచ్చు కార్యకర్తలను వెతికి పట్టుకొనవలెను. ఈ దీపయజ్ఞాలు ఆధ్యాత్మిక ఉద్యమానికి తగిన భూమికను నిర్వహిస్తూనేవున్నాయి. దానితోపాటు కలిసివున్న సప్తవిప్లవములు సమాజ నవనిర్మాణమునకు ఉన్నతమైన పాత్రను పూర్తిచేస్తాయి.

**పరిజనులు ఏమి చెయ్యాలి?**

ఈ కార్యక్రమాలలో మీరు ఏ స్థాయిలో భాగస్వాములవ్వగలరో, అవ్వండి, ఇతరులను కలుపగలిగితే కలపండి. మనిషి మనిషిని ఇందులో భాగస్వామిని చెయ్యండి. **సాధకుడైన పౌరుడు-మహోన్నత దేశము, శిక్షిత పౌరుడు-శ్రేష్ఠమైన దేశము, ఆరోగ్యవంతుడైన పౌరుడు -శక్తివంతమైన దేశము, స్వావలంబియైన పౌరుడు - సుసంపన్నమైన దేశము, స్వచ్ఛమైన పర్యావరణము - సుఖప్రదమైన దేశము, వ్యసనముక్తుడైన పౌరుడు - సభ్యత కలిగిన దేశము, చెడు మార్గాలనుండి ముక్తి చెందిన సమాజము - ప్రగతిశీలమైన దేశము, జాగృతమైన మహిళ - సమర్థవంతమైన దేశము అన్నవి సప్త విప్లవాలకు ఫలశృతులు.** మేధావర్గము మొదలుకొని ప్రతి జాతీయ సమూహమును, వర్గవ్యవస్థను ఇందులో భాగస్వాములను చెయ్యండి. వీలైతే అన్నీ లేక ఒకటి లేక రెండు కార్యక్రమాలు చేపట్టవచ్చును. అనేక సమూహాలు కలిసి ప్రాంతీయస్థాయిలో సప్త విప్లవాలకు గతినివ్వవచ్చును.

## 2) శతాబ్ద వసంతము - క్షేత్రస్థాయీ కార్యక్రమాలు

**ఈసారి వసంతపర్వదినము దేశ-విదేశాలలో ఫిబ్రవరి 6, 7, 8 తేదీలలో ఆదివారం నుండి మంగళవారం వరకు ఒకేసారి జరుపబడుతుంది.** పెద్ద పట్టణాలలోనూ అలాగే విదేశాలలోనూ ఆదివారం అనుకూలమైన కారణంగా ఈ సంవత్సరము వసంతపంచమి 3 రోజులు జరుగుతుంది. దీనితోపాటు జన్మశతాబ్దీ కార్యక్రమాలు ఆరంభమౌతాయి. ఇదేవిధంగా ప్రయాజ ప్రక్రియ కొంతకాలం నుండి జరుగుతున్నది. దేశమును జాగృతపరిచే దీపయజ్ఞములు, పుస్తకప్రదర్శనశాలలు అన్ని ప్రాంతాలలోనూ నిర్వహించబడుతున్నాయి. కానీ ఈ ప్రత్యేకమైన కార్యాచరణ ఫిబ్రవరి 1 వ తేదీనుండి ఆరంభమవ్వవలెను. దేశమంతా ఫిబ్రవరి 6 న ప్రాత:కాల ప్రదక్షిణలు పూర్తిచేసి, కలశ-శోభా యాత్రలు నిర్వహించాలి. సాయంకాలం అనుకూలమైన ప్రదేశంలో అనగా మందిరాలు, ప్రజ్ఞామండలి కార్యాలయం మొదలగు స్థలాలలో జ్ఞాన (వేదికలను ఏర్పాటు చేయాలి) సభలను

పంచదార తింటే డయాబెటిస్ రాదు. డయాబెటిస్ వచ్చాక పంచదార తినకూడదు.

నిర్వహించాలి. పరిజనులందరూ సమూహంగా ఎక్కడో ఒక చోట కార్యక్రమంలో తప్పక పాల్గొనవలెను. ఫిబ్రవరి 7 వ తేదీ ఉదయం నుండి 8 వ తేదీ ఉదయం వరకు అఖండ జపమును శక్తిపీఠాలలో, కార్యాలయాలలో సామూహికంగా నిర్వహించి, దానిలో ఎవరికి ఎంత ఎక్కువ వీలైతే అంత ఎక్కువ సమయదానమియ్యవలెను. ఎంతసేపు జపం చేశాము అన్నది ముఖ్యం కాదు సమూహంలో కొద్ది సమయమైనా భాగస్వాములగుటయే ముఖ్యం.

ఫిబ్రవరి 7 వ తేదీ సాయంత్రము **నవయుగ స్వాగత దీప దాన కార్యక్రమమును** చేపట్టవలెను. ఇది పూజ్యగురుదేవుల ఆధ్యాత్మిక జన్మదినమునకు ముందురోజు. సాయంకాలము సూర్యాస్తమయము తర్వాత ప్రతి ఇంటిలోనూ కనీసము 5 దీపాలను పూజామందిరంలో వెలిగించాలి. ప్రతి శక్తిపీఠము, ప్రజ్ఞాపీఠము, ప్రజ్ఞామండలి, గాయత్రీ చేతనా కేంద్రము, క్షేత్రస్థాయిలోని కార్యాలయములలో సౌకర్యాన్ని అనుసరించి ఎక్కువ దీపాలను వెలిగించవచ్చును. దీపయజ్ఞము తరువాత దీపాలను దీపావళి పండుగలో వలె ఇంటి గడపలు, ముంగిలి మొదలగు చోట్ల అందంగా అలంకరించాలి. సామూహిక జపాలను నిర్వహించే చోట కనీసము 24 దీపాలను ప్రజ్వలింపజేసి సామూహికంగా 24 సార్లు గాయత్రీ మంత్రమును స్వరయుక్తంగా అందరూ కలిసి జపించి దీపాలను స్థాపించాలి. శక్తిపీఠాలు, మందిరాలు, గృహాలలో ప్రకాశకాంతులు వెదజల్లబడాలి. మరునాడు వసంతపంచమి. శాంతికుంజ్ లేక గాయత్రీ తపోభూమికి వచ్చి దీన్ని జరుపుకునేబదులు పరిజనులందరూ తమ ప్రాంతాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమాలను సంపూర్ణ ఉత్సాహంతో జరుపుకోవాలి. అఖండజపం పూర్తయిన వెంటనే పూజ్యగురుదేవులకు మహామృత్యుంజయమంత్రముతోపాటు యజ్ఞమును చేసి, శ్రద్ధతో పుష్పాంజలి సమర్పించాలి. ' గురుదేవుల ద్వారా ఆరంభించబడిన ఈ అభియానము నిరంతరము వృద్ధిచెందుగాక! శీఘ్రంగా ఉజ్జ్వల భవిష్యత్తు వచ్చుగాక! యుగనిర్మాణము నిశ్చియముగా జరుగునుగాక! మనమందరము అందులో తప్పనిసరిగా పాల్గొనెదముగాక!!' అని ప్రార్థించవలెను. ఈవిధంగా మూడురోజుల ప్రణాళికను అందరూ పూర్తిచెయ్యాలి.

**పరిజనులు ఏమి చెయ్యవలెను?**

ఈ మూడురోజుల కార్యక్రమంలో మనిషి మనిషిని భాగస్వామిని చెయ్యండి. నూతన పరిజనులందరికి యుగ ఋషి యొక్క యుగనిర్మాణయోజనను పరిచయము చేసి, వారిని యుగశక్తి గాయత్రీ పత్రిక లేదా హిందీ అఖండజ్యోతి పత్రిక జ్ఞానగంగతో పరిచయము చెయ్యండి. జేబులో పట్టే చిన్న పుస్తకాలు మొదలుకొని పూజ్య గురుదేవుల విరాట్ జ్ఞాన శరీరమును పరిచయము చేసి గాయత్రీ తీర్థము, శాంతికుంజ్, హరిద్వార్ మరియు గాయత్రీ తపోభూమి మథురకు రమ్మని ఆహ్వానించండి. విభిన్న ధర్మ సంప్రదాయములు, ఇతర గురువులకు సంబంధించిన వ్యక్తులకు ఉజ్జ్వల భవిష్యత్తుకు చెందిన వివరణ ఇచ్చి వారిని కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రోత్సహించండి. ఇది యుగపరివర్తన కాలము. ఒక నూతన యుగారంభము. ఇందులో అందరూ భాగస్వాములవ్వవలెను. 'ఇది ఏదో ఒక ధర్మమునకు చెందిన గురువు యొక్క జన్మశతాబ్ది కాదు. ఆలోచనల మార్పునకు ఒక ప్రబల ప్రవాహ శతాబ్దీ ఉత్సవము జరుపబడుతున్నది' అని వారికి స్పష్టంగా తెలియజెప్పండి. వివరాలు తెలుసుకునేందుకు యుగశక్తిగాయత్రీ పత్రిక లేక హిందీ అఖండజ్యోతి, ప్రజ్ఞా అభియాన్ పత్రికల గడచిన 4 నెలల సంచికలను చదవగలరు.

## 3) ఢిల్లీలో ఫిబ్రవరి 20వ తేదీన రాష్ట్ర స్థాయిలో శ్రద్ధాంజలి

ఈ కార్యక్రమము యొక్క ఏర్పాట్లు ఇంకా కొనసాగుతు వున్నాయి. మూలతః ఇది దేశ రాజధానిలోను, దానిచుట్టుప్రక్కల ప్రాంతాలలోని పరిజనులకొరకు చేపట్టిన ప్రణాళిక. 20 వ తేదీ ఆదివారంనాడు ఎన్నుకోబడిన నగర ప్రాంతాలలోని పరిజనులందరిని ఆహ్వానించడము జరుగుతుంది. కార్యక్రమం విశిష్టమైన వ్యక్తుల సముఖంలో సుమారు 4 గంటలపాటు జరుగుతుంది. విశాలమైన స్టేడియంలో ఏర్పాటుచేయబోయే ఈ కార్యక్రమంలో యుగనిర్మాణయోజన యొక్క విరాట్ రూప గురుసత్తా జీవితగాథను దృశ్యరూపంగా ప్రదర్శించుటకు కావల్సిన రూపురేఖలు తయారుచేయబడినవి. వేలాదిమంది స్వయంసేవకులు గురుదేవుల జీవితమును ప్రదర్శిస్తారు, సప్త విప్లవములను అమలుపరుస్తారు. దేశంలోని పలు టి.వి. ఛానల్స్ ద్వారా కార్యక్రమము ప్రత్యక్ష ప్రసారము చేయబడుతుంది. ముఖ్య అతిథులు ఈ కార్యక్రమంలో తమ భావాలను వ్యక్తపరుస్తారు. కార్యక్రమానికి హజరైన రోజునే పరిజనులందరూ తిరిగి వెళ్ళిపోవల్సివున్నందున దూరప్రాంతాలలోని పరిజనులు తమ స్వస్థలాలలోనే ఉంటూ టి.వి. ద్వారా కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని చూస్తూ, ఇతరులకు చూపిస్తూ వారినీ దానిలో భాగస్వాములను చేయవచ్చును. కార్యక్రమ విపుల వివరణ వచ్చే నెల పత్రికలో చదువగలరు.

**సమర్థుడు క్షమను, అసమర్థుడు కోపాన్ని చూపుతారు.**

4) మార్చి నెల 2 నుండి ఏప్రియల్ 12 వరకు సాగే శతాబ్దీ సాధన మంత్రలేఖన ఉద్యమంలో భాగస్వాములగుటకు కావల్సిన వివరాలు 2010 డిసెంబరు సంచికలో ఇవ్వబడినవి. తత్సంబంధ వివరాలతో కూడిన పుస్తకము ముద్రించబడినది. మంత్రలేఖన పుస్తకము కూడా ప్రత్యేకంగా రూపొందించబడినది. ప్రాంత లేక ఉపప్రాంత కార్యాలయాలలో ఇప్పటినుండే వివరాలను నమోదు చేయించుకొనవలెను. ఇది ఒక అత్యంత పుణ్యప్రదమైన, ఫలితమును చేకూర్చే సాధన. ఇటువంటి సమయము మళ్ళీ మళ్ళీ రాదు. శతాబ్దీ సృజన సాధనా మహాపురశ్చరణ పూర్ణాహుతితోపాటు, ఈ మంత్రలేఖన సాధన మహాఅభియానము ఏప్రియల్ 12 వ తేదీ శ్రీరామనవమి నాడు దేశమంతటా ఒకేసారి పూర్తవుతుంది.

5) మేధావంతులకు ధ్యాన శిబిరాలు ఈ సంవత్సరమంతా జరగాలి. పూజ్యగురుదేవులు ధ్యానమునకు విశేష ప్రాముఖ్యత నిచ్చారు. ప్రతిరోజు గురుదేవుల వాణిద్వారా వెలువడిన ధ్యానము గత 25 సంవత్సరాలుగా నిరంతరము బ్రహ్మముహూర్తంలో చెయ్యబడుతున్నది. అందులో శిబిరానికి వచ్చినవారు, ఆశ్రమవాసులందరూ పాల్గొంటారు. మన అంతర్జగత్తును శోధించుటకు పరమసత్తాను గాఢంగా ఆర్తితో పిలుచుటయే ధ్యానము. ధ్యానము అనేది మనము తెలిసో, తెలియకో చెడు దారులను మూసివేసి, మంచి మార్గములను తెరిచే ఒకానొక సమర్థ సూక్ష్మ వ్యాయామము. అంతర్జగత్తు సామర్థ్యాన్ని జాగృతపరిచి వికసింపజేసుకునే మరియు అన్నిరకాల మనోవికారాల చికిత్స చేసుకునే పద్ధతియే ధ్యానము. దేవసంస్కృతి విశ్వవిద్యాలయములో ధ్యానమును విజ్ఞాన సమ్మతమైన రీతిలో చేయు వ్యవస్థ ఉంది. చైత్రనవరాత్రులు తరువాత ప్రతి ప్రాంతంలోనూ సెమినార్స్, వర్క్‌షాపుల ద్వారా ధ్యాన శిబిరాలను ఏర్పాటు చేయాలి. శిబిరాల ప్రారంభోపన్యాసములో శతాబ్దీ పురుషుని ఆలోచనల గురించిన వివరాలను చెప్పి మేధావులను సంస్థతో కలుపవలెను.

6) ఈ సంవత్సరము జులై 15 శుక్రవారము గురుపూర్ణిమ. దీన్ని విశిష్ట శ్రద్ధా సమర్పణ పర్వదినంగా జులై 15, 16, 17 తేదీలలో దేశమంతా శక్తిపీఠాలలో, ప్రజ్ఞాపీఠాలలో, ప్రాంత-ఉపప్రాంతాల కార్యక్రమాలలో జరుపుకొనవలెను. ఎవరికి ఎప్పుడు అనుకూలంగా ఉంటే అప్పుడు ఈ కార్యక్రమాలలో శ్రద్ధగా పాలుపంచుకోవాలి. దీని పూర్తి వివరాలు రాబోయే సంచికలో చదువగలరు.

7) జన్మశతాబ్దీ ప్రముఖ కార్యక్రమము 2011 నవంబరు 6 ఆదివారం దేవోత్థాన ఏకాదశి నుండి 10 గురువారము కార్తీకపూర్ణిమ వరకు శాంతికుంజ్ హరిద్వార్‌లో గంగామాత హృదయస్థానంలో జరుగుతుంది. దేవోత్థాన ఏకాదశినాడు విశాలమైన కలశయాత్ర మరియు కార్యక్రమ శుభారంభము జరుగుతుంది. నవంబరు 7, 8, 9 తేదీలలో సువిశాల శ్రీరామనగరులో మహాయజ్ఞము నిర్వహించబడుతుంది. ప్రతిరోజు సాంస్కృతిక, జ్ఞాన, భావములను పంచుకునేందుకు సభలు నిర్వహించబడతాయి. మేళా జరుగు స్థల వైశాల్యము సుమారు 50 మైళ్ళు. నవంబరు 9 వ తేదీన చతుర్దశి కాలంలో విరాట్ దీపయజ్ఞము జరుగుతుంది. నవంబరు 10 న పూర్ణాహుతిలో పరిజనులందరూ గురుదేవుల చేతనను విస్తరింపజేసే సంకల్పమును తీసికొని గృహోన్ముఖులవుతారు. తత్సంబంధిత వివరాలు రాబోయే సంచికలలో తెలుసుకొనవచ్చును.

8) 2012 జనవరి 28 శనివారము వసంతపర్వమునాడు దేశవిదేశాలలో ఎన్నుకోబడిన ప్రాంతాలనుండి కాగడాల ఊరేగింపు జరుగుతుంది. యుగపరివర్తన నినాదాలతోపాటు సభలు నిర్వహించబడతాయి. ఈ ప్రక్రియ ప్రతి గ్రామము, పట్టణము, నగరము, మహానగరములలో జరుగుతుంది. 'ఇంక్విలాబ్ జిందాబాద్' వలె; 'వి' ఫర్ విక్టరి' వలె; **'మనం మారితే యుగం మారుతుంది'** అనే నినాదము మనిషి మనిషి హృదయంలోనూ నాటుకొనబడుతుంది. దీన్ని 28, 29 శని-ఆదివారాలలో రెండురోజుల కార్యక్రమంగా ఏర్పాటుచేసి సత్యయుగపునరాగమనము మీద వర్క్‌షాపులను నిర్వహించాలి.

ఈ మహత్వపూర్ణమైన శతాబ్దీ సంవత్సర మహా ప్రణాళికకు ఇది చివరి సంక్షిప్త వివేచన కనుక మీమీ ఏర్పాట్లు చేసుకోండి. ఇటువంటి కాలము మళ్ళీ 100 సంవత్సరముల తరువాతే వస్తుంది. అవకాశము కోల్పోతే పశ్చాత్తాపపడవలసివస్తుంది. సంస్థ అనేకరెట్లుగా విస్తరిస్తూవున్నది. అనుమానాలు వదిలి కార్య రంగములోకి దూకండి.

*- అఖండజ్యోతి, జనవరి 2010*

*అనువాదము : శ్రీమతి లక్ష్మీరాజగోపాల్*

**ఆపద అనే గీటురాయి మీద నీ శక్తియుక్తులు పరీక్షింపబడతాయి.**

ఆరోగ్యమే మహాభాగ్యం - 3

# హోమియో వైద్య సేవ

**మా బాబు వయస్సు 13 సం॥లు, 8వ తరగతి చదువుతున్నాడు. ఇంట్లో బాగా చదువుతాడు. అన్నీ వస్తాయి కాని పరీక్షలు రాసే సమయానికి అన్ని మర్చిపోతాడు. పరీక్షలు అన్నా, టీచర్లు అన్నా విపరీతమైన భయం. పరీక్షల ముందు వరకు బాగానే చదువుతాడు. కాని ఆ భయం వలన టెన్షన్ వలన అన్నీ మర్చిపోతాడు. ఒక్కొక్కసారి పరీక్షల ముందు విరేచనాలు కూడా ఔతాయి. బాబు మొదటి నుండి కొద్దిగా పిరికితనం, భయస్తుడు. స్టేజి మీద ఏదైనా మాట్లాడాలన్నా బాగా భయపడతాడు. దీనికి మీరు ఏదైనా పరిష్కారం చూపగలరా?**

**– శివసాయి, నెల్లూరు**

చాలా మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయడానికి భయపడుతుంటారు. కొద్దిపాటి భయం, పరీక్షల ఒత్తిడి వారి పనితీరుపైన మంచి ప్రభావం చూపుతుంది. కాని కొంతమంది పరీక్షల ముందు మరియు పరీక్షల సమయంలో విపరీతమైన భయాందోళనకు గురై చదివినది కూడా గుర్తురాక సరిగ్గా వ్రాయలేకపోతారు. ఇలా తరచూ జరిగినచో వారికి ప్రతి పరీక్షకు ముందే వ్యాకులతకు లోనై ఆత్మన్యూనతా భావంతో బాధపడుతూ పరీక్షలు సరిగా వ్రాయలేకపోతారు. ఈ భయం వలన చదువే సమయంలో కూడా సరిగ్గా చదవలేక ఏ పాఠాలకు ప్రాధాన్యత ఇవ్వాలో, ఎంత సమయం చదువుకి కేటాయించాలో తెలియక ఎక్కువగా కూడా చదువుతూ ఉంటారు. కొంతమంది పరీక్షల ముందు బాగానే చదివినా పరీక్షలు రాసే సమయానికి విపరీతమైన భయం వల్ల వచ్చినవన్నీ మర్చిపోతారు. ఈ భయం మానసికంగా కాకుండా శారీరకంగా కూడా ప్రభావం చూపిస్తుంది. శరీరం కొన్ని మానసిక భయాందోళనలకి ప్రతిక్రియగా కొన్ని లక్షణాలు కనబడుతాయి అవి ఒక్కొక్కరికి ఒక్కొక్క విధముగా ఉండవచ్చు. గుండె వేగంగా కొట్టుకోవడం, విపరీతమైన చెమటలు, విరేచనాలు, కడుపునొప్పి, కళ్ళుతిరగడం వగైరా. ఈ భయం కొత్తగా స్కూలులోగాని, కాలేజిలోగాని చేరినపుడు, ఏదైనా కారణం వలన ఒక సబ్జెక్టులో తక్కువ మార్కులు వచ్చినపుడు లేదా ఇంకేదైనా బాధలు ఉన్నప్పుడు కలగవచ్చు.

మీ అబ్బాయి విషయంలో అతని భయానికి ఉన్న కారణం తెలుసుకోవడం ముఖ్యం. కేవలం పరీక్షల ముందే చదవడం కాకుండా సంవత్సరం మొత్తం ప్రతి పాఠం అర్థం అయ్యేలా చదవడం ముఖ్యం. చదివే అంశం మీద ఆసక్తి కలిగేలా చదివినపుడు అవి తప్పకుండా గుర్తువుంటాయి. ప్రణాళికా బద్ధంగా సంవత్సరమంతా చదివినచో పరీక్షల ముందు ఈ భయాందోళనలు ఉండవు. ఈవిధంగా చదివినా కూడా ఆ భయం ఉన్నచో హోమియో మందులు బాబు లక్షణాలను బట్టి వాడిన ఆ భయం తొలగిపోవును. సాధారణంగా పరీక్షల భయానికి వాడే మందులు.

**ఎథ్యూసా సైనాపియం :** పరీక్షల ముందు చాలా చదివి (over study) ఆత్మన్యూనత వల్ల, అధిక మానసిక శ్రమవలన పరీక్షల ముందు వచ్చే భయానికి ఈ మందు బాగా పనిచేస్తుంది. బాగా ఎక్కువ చదివిన తరువాత వచ్చే ఏకాగ్రతా లోపం, ఆలోచించలేక పోవడం ఈ మందు యొక్క లక్షణాలు.

**అనాకార్డియం :** పరీక్షల ముందు పూర్తిగా మతిమరుపు రావడం. పూర్తి ఆత్మన్యూనత. కోపం, ఆందోళన, వ్యాకులత. మిత్రులను తిట్టుట వారిని విరోధులుగా భావించడం. ఎవరిపైనా జాలి లేకపోవడం ఏదీ గుర్తులేకపోవడం, మలబద్ధకం.

**నాకు 16 సంవత్సరాల వయసు నుండి తలనొప్పి బాధ వేధిస్తున్నది. అప్పటికప్పుడు పెయిన్ కిల్లర్స్ వాడుతున్నాను తప్ప శాశ్వతంగా దీన్నించి దూరం కాలేకపోతున్నాను. తలను ఇరుపక్కలా పట్టుకొని గట్టిగా నొక్కుతున్న అనుభూతికి లోనవుతాను. ఒక్కోసారి వెనుకవైపు కూడా విపరీతమైన నొప్పి వస్తుంది. ఇది పీరియడ్స్‌కు ముందు ఎక్కువగా వస్తుంటుంది. దయచేసి మంచి మందులను సూచించండి.**

**– బాలా త్రిపురసుందరి, శ్రీకాకుళం**

మీకు ఉన్న తలనొప్పినే మైగ్రేన్ తలనొప్పి అంటారు. దీనిని పార్శ్వపు నొప్పి అని కూడా అంటారు. ఎందుకంటే ఇది చాలామందికి ఒకేవైపు వస్తుంది. ఇది ఈ మధ్యకాలంలో ఎందరినో, ఎంతగానో బాధిస్తున్న రక్తనాళాలకు సంబంధించిన సాధారణ జబ్బు. ఇది మగవారిలో కంటే ఆడవారిలో ఎక్కువగా వస్తుంది. మైగ్రేన్ తలనొప్పి తీవ్రత సాధారణ నొప్పి నుండి చాలా తీవ్రమైన నొప్పిగా ఉండవచ్చు.

ఈ తలనొప్పి తలకు ఒక భాగంలో వచ్చి 4 నుండి 72

మనస్సు సవ్యంగా ఉంటే మృత్యువు రాదు.

గంటల వరకు బాధిస్తుంది. తలనొప్పితోపాటు వికారం, వాంతులు, కాంతిని భరించలేకపోవడం, శబ్దములను సహించలేకపోవుట, మామూలు పనుల వలన కూడా తలనొప్పి పెరుగుట ఉంటుంది. రోజువారి కార్యక్రమాలు కూడా ఇబ్బంది పెడతాయి. ఈ వ్యాధి కారణాలు మాత్రం ఇప్పటివరకు తెలియరాలేదు. ఈ వ్యాధితో బాధపడే మూడొంతుల మందికి తలనొప్పి వచ్చే ముందు ఆరా (aura) వస్తుంది. ఈ ఆరా ఒక్కొక్కరికి ఒక్కోలా ఉండవచ్చు. కళ్ళముందు మిరుమిట్లు గొలుపుతున్న వెలుతురు చుక్కలు, వంకరటింకర గీతలుగా కాని కనిపించటంతో మొదలవుతుంది. ఈ ఆరా కనిపించిన కొద్ది నిమిషాల తరువాత ముఖంలో ఒకభాగంకాని, లేదా ఒక చేయి లేదా కాలు కాని మొద్దుబారినట్లు అనిపిస్తుంది. సూదులతో పొడుస్తున్న అనుభూతి. బలహీనత వంటివి కలుగుతాయి. తరువాత కళ్ళు తిరుగుతున్న అనుభూతి, కన్‌ఫ్యూజన్ ఉంటాయి. మాట్లాడటానికి ఇబ్బందిగా అనిపించవచ్చు. వాంతులు, వికారంగా ఉండి విరోచనం అవటం, ఆకలి లేకపోవటం, కాళ్ళు చేతులు చల్లబడటం వంటి లక్షణాలు ఉంటాయి. కొద్ది నిమిషాలలో ఈ లక్షణాలు అదృశ్యమై తలనొప్పి ప్రారంభం అవుతుంది. తలకు ఒకవైపు సుత్తులతో కొదుతున్నట్లు ఉంటుంది. ఈ సమయంలో వాంతులు కూడా కావచ్చు. చెమటలు పట్టడం, కాంతిని, శబ్దాన్ని భరించలేకపోవడం, తలతిరగడం మొ॥న లక్షణాలు ఉండవచ్చు. కొన్నిసార్లు స్త్రీలలో ఋతుక్రమానికి ముందు ఈ తలనొప్పి ఎక్కువ అవుతుంది.

ఈ నొప్పికి కారణాలు తెలియవు. కాని కొన్నింటి వల్ల నొప్పి మొదలవుతుంది.

మద్యం, ఎలర్జీ రియాక్షన్, ఎక్కువ కాంతి, కొన్ని రకాల వాసనలు, సెంటులు, హార్మోన్‌లలో తేడా (స్త్రీలలో ఋతుచక్రం వల్ల వచ్చే హార్మోన్ తేడాలు) గర్భనిరోధక మాత్రలు, నిద్ర సమయాలలో తేడాలు, వ్యాయామం, పెద్ద పెద్ద శబ్దాలు, సరైన సమయంలో తినకపోవడము, శారీరక మరియు మానసిక ఒత్తిడి, పొగ త్రాగడం, పొగ పీల్చడం.

పై కారణాలు అందరిలో ఒకేలాగా ఉండవు. ఒక్కొక్కరిలో ఒక్కోలాగ ఉంటాయి. ఎవరికి ఏవి కారణాలవుతాయో సాధ్యమైనంతవరకు వాటిని తప్పించుకోవాలి. ఉదా : సమయానికి భోజనం, నిద్ర, ఒత్తిడి తగ్గించుకొనుట, ధ్యానం చేయుట వంటివి. కొన్ని యోగాసనములు తలనొప్పి లేనప్పుడు చేసినచో మైగ్రేన్ తీవ్రత తగ్గును (ప్రాణాయామం, సూర్య నమస్కారములు, ధ్యానం, శవాసనం మొ॥నవి).

రోగి మానసిక, శారీరక లక్షణాలను బట్టి సరైన హోమియో మందులు వాడినచో ఈ సమస్యను పరిష్కరించవచ్చు. ఈ వ్యాధికి సాధారణంగా వాడే మందులు.

**బెల్లడోనా :** తలనొప్పి తల వెనుకభాగంలో లేదా మెడపై భాగంలో ప్రారంభమై నుదుటి భాగంలో ఎక్కువగా వస్తుంది. కుడివైపు ఎక్కువగా ఉండి కళ్ళు తిరుగుతున్నట్లు ఉండటం, తలనొప్పి ఉదయం ప్రారంభమై మధ్యాహ్నం 3 గం॥ల సమయానికి అధికమౌతుంది. తలవేడిగా పాదాలు, చేతులు చల్లగా ఉండటం, మగతగా ఉండటం వంటి లక్షణాలు ఉంటాయి.

**బ్రయోనియా :** కళ్ళ భాగంలో తీవ్రమైన తలనొప్పి, తల ఎడమ భాగంలో ఎక్కువగా ఉండుట, చిన్న కదలికవల్ల కూడా నొప్పి రావడం, దాహం అధికంగా ఉండటం, నోరు పొడిబారిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.

**స్పైజీలియా :** నొప్పి ఎడమవైపు నుదుటి భాగంలో ఎక్కువగా వస్తుంది. ఉదయాన్నే మొదలై సాయంత్రం వరకు బాధ ఎక్కువగా ఉంటుంది. ఎడమ కనుగుడ్డు లాగుతూ ఉండి, ఆలోచన వలన ఎక్కువ అవడం, విశ్రాంతి తీసుకొన్నపుడు, పడుకొన్నపుడు తక్కువ అవడం వంటి లక్షణాలు ఉంటాయి.

**నాట్రమ్ మ్యూర్ :** ఆడవారిలో తలనొప్పి నెలసరిముందు తర్వాత సమయాలలో ఎక్కువగా ఉండుట, తలనొప్పి సమయంలో ముఖం, పెదాలు తిమ్మిరి పట్టినట్లు ఉండుటం, ఎండలోకి వెళ్తే తలనొప్పి రావడం, చీకటి గదిలో విశ్రాంతి తీసుకొన్నపుడు, తక్కువ అవడం, వేడిని భరించలేకపోవడం, చిన్న చిన్న సుత్తులతో కొడుతున్నట్లుండటం, మానసికంగా బాధపడేవారికి ఈ మందు బాగా పనిచేస్తుంది.


**సలహాల కొరకు సంప్రదించవల్సిన చిరునామా**

**డా॥ టి. నీలవేణి,** బి.హెచ్.ఎమ్.ఎస్.
ఆర్.ఎన్..జి. అడ్వాన్స్‌డ్ హోమియో క్లినిక్
ఇ.నెం. 3-211, యశోద గార్డెన్స్ దగ్గర,
శాంతినగర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500 072.
ఇ-మెయిల్: drneelaveni@gmail.com


*ఈ శీర్షిక కేవలం వ్యాధి అవగాహన, హోమియో వైద్య అవగాహన కొరకు మాత్రమే. మందులు వాడడానికి అనుభవజ్ఞులైన హోమియో డాక్టరును సంప్రదించవలెను.*

**పిల్లలకు ధైర్యం నూరిపోయాలి.**

# వేమన వేదం-జీవన నాదం - 3

జగత్తులోని సారాన్నంతటిని గ్రహించి, తన అనుభవసారాన్ని దానికి జోడించి, ఇతరులకు మార్గదర్శనం చేసిన పరమయోగి మన వేమన. అన్నీ తెలిసినవారికి సులువుగా చెప్పవచ్చు. ఏమి తెలియనివానికి కూడా చెప్పడం సులువే. కానీ తెలిసీ, తెలియని, (అన్నీ తమకే తెలుసును అనుకొనే మొండివారికి), మూర్ఖునికి ఏది చెప్పలేము. ఎంతచెప్పినా ప్రయోజనం ఉండదు. ఇదే సత్యాన్ని వేమన ఈ పద్యంలో ఇలా చెప్పారు.

**ఎలుకతోలు తెచ్చి యేడాది యుతికిన**
**నలుపు నలుపేగాని తెలుపుగాదు.**
**కొయ్య బొమ్మ దెచ్చి కొట్టిన పలుకదు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

నల్లగా ఉందని ఎలుకతోలును ఉతికి తెల్లగా చెయ్యాలను కోవడం ఎంత అవివేకమో, మూర్ఖునిలో నీతివాక్యాల ద్వారా మార్పు తేవాలనుకోవడం అంత అవివేకమే. మూర్ఖునికి నీతివాక్యాలు ఎంత చెప్పినా అవి అర్థం కావు. అతనిలో ఎటువంటి మార్పు రాదు. ఎందుకంటే మూర్ఖత్వం అతని స్వభావాన్ని కప్పివేసింది. చెక్కబొమ్మను తెచ్చి కొట్టినా, తిట్టినా అది ఉలకదు పలకదు. అలాగే మూర్ఖునిలో మార్పు తేవడం కూడా అసాధ్యమే. భర్తృహరి నీతిశతకంలో చెప్పిన "చేరి మూర్ఖుల మనసు రంజింపరాదు" అన్న భావం స్ఫురిస్తోంది.

ఇదే విధంగా చెడ్డ త్రోవకు అలవాటుపడిన వ్యక్తి, మళ్ళీ మంచి మార్గానికి రావడం అసాధ్యం. ఇదే సత్యాన్ని వేమన ఇలా వివరించారు.

**కుండ చిల్లుపడిన గుడ్డదోపగవచ్చు**
**పనికి వీలుపడును బాగుగాను**
**కూలబడిన నరుడు కుదురుట యరుదయా**
**విశ్వదాభిరామ వినురవేమ !**

కష్టసాధ్యమే అయినప్పటికీ కుండకు చిల్లుపడితే, అందులో నీరు కారిపోకుండా, ఆ చిల్లును గుడ్డతో పూడ్చి, కుండను ఉపయోగంలో పెట్టవచ్చు. కానీ చెడు అలవాట్లతో, చెడ్డ స్వభావంతో పెడత్రోవ పట్టినవాడు తిరిగి మంచి మార్గంలోకి రావడం అసాధ్యం. ఎందుకంటే వ్యసనాలకు అలవాటుపడ్డ ఇంద్రియాలు, మంచి అలవాట్లను, సాంప్రదాయాలను అర్థం చేసుకోలేకపోగా, వాటి విలువను కించపరిచేటట్లు చేస్తాయి. అందువల్ల చెడుమార్గంలోకి వెళ్ళకుండా ఉండాలే తప్ప, వెళ్ళాక తిరిగి మారడం అనేది అసాధ్యం. వంకరగా ఉన్న కర్రను, రాయిని సరిద్దివచ్చును. కానీ వక్రమార్గం పట్టినవాని మనస్సును రంజింప చేయలేము.

సజ్జనుడు ఒక్కడు ఉన్నా, అతని వంశం, కుటుంబాల కీర్తి ప్రతిష్టలు మరింతగా ఇనుమడిస్తాయి. చంద్రుడు ఒక్కడుంటే చాలు ఆకాశమంతా వెన్నెలమయమౌతుంది. ఇదే సత్యాన్ని వేమన ఇలా అన్నారు.

**కులములోననొకడు గుణవంతుడుండెనా**
**కులము వెలయు వాని గుణముచేత**
**వెలయు వనములోన మలయజంబున్నట్లు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

ఈ సత్యం మనిషిగా పుట్టిన ప్రతిఒక్కరికి వర్తిస్తుంది. మనం జన్మించడం వల్ల మన వంశం, తల్లిదండ్రులు, బంధు మిత్రులందరూ గర్వంతో పొంగిపోవాలే తప్ప, అవమానంతో కృంగిపోకూడదు. రఘు మహారాజు యొక్క ఆదర్శవర్తనం వల్ల ఇక్ష్వాకువంశం పేరు రఘువంశంగామారి ప్రసిద్ధి చెందింది. భరతునియొక్క ఉత్తేజపూరిత చరితం వల్ల మనదేశానికి భారతదేశము అన్న పేరు వచ్చింది. అలాగే ఎన్నో వృక్షాలు ఉన్న వనములో ఒక్క గంధపు చెట్టువలన మొత్తం వనమంతా సుగంధభరితమవుతుంది. భగీరథుడు చేసిన ప్రయత్నం వల్ల సగర తనయులే కాక త్రిలోకాలు 'గంగా' ప్రవాహం వల్ల పునీతమయ్యాయి. అటువంటి గుణవంతులు ఉంటే ఆ వంశమే పునీతమౌతుంది.

**గంగిగోవుపాలు గరిటెడైననుజాలు**
**కడివెడైన నేమి ఖరము పాలు**
**భక్తి గల్గు కూడు పట్టెడైనను జాలు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

ఆవుపాలు కొంచెమున్నా, అవి బలాన్ని, ఆరోగ్యాన్ని కల్గిస్తాయి. కానీ గాడిదపాలు కుండలకొద్దీ ఉన్నా, అవి ఎవరికి ఏ ప్రయోజనాన్ని (తమ పిల్లలకు తప్ప) కల్గించవు. సముద్రంలో అపారమైన నీరు ఉన్నా, అవి ఉప్పగా ఉండి త్రాగడానికి పనికిరావు. అలాగే ఆత్మీయంగా, అభిమానంతో పెట్టే అన్నం గుప్పెడైనా చాలు. ఆర్భాటాలతో, ఆడంబరాలతో పెట్టే ఎన్నో

**పిల్లలకు జీవించే కళ నేర్పాలి.**

రకాలైన భోజనం వల్ల ఏ మాత్రం ఆనందం, సంతృప్తి ఉండదు. కావున రాశికన్నా వాసి ముఖ్యం. ఎంత గొప్పగా చేశామన్న ఆలోచనల కంటే ఎంతబాగా చేశామన్న ఆలోచన ముఖ్యం. అందువల్ల చేసిన పనుల సంఖ్య కన్నా, సారం ముఖ్యం.

మరొక పద్యంలో వేమన ఇలా లోకతత్వాన్ని తెలిపారు.

**చెప్పులోని రాయి, చెవిలోన జోరీగ**
**కంటిలోన నలుసు, కాలిముల్లు**
**ఇంటిలోనిపోరు, ఇంతింతగాదయా**
**విశ్వదాభిరామ వినురవేమ !**

ఏదైనా పనిచెయ్యాలంటే మనిషికి ప్రశాంతచిత్తం, కుటుంబ సభ్యుల ప్రోత్సాహం చాలా అవసరం. అందుకే "ప్రతిగొప్పవాని విజయం వెనుక ఒక స్త్రీ హస్తముంటుంది" అన్న నానుడి ప్రసిద్ధమైంది. ఇంట్లో వారి సహకారంతో, వారి ప్రోత్సాహంతో ఎటువంటి కష్టసాధ్యమైన పనైనా చేయవచ్చును. అలాకాకుండా అనుక్షణం కోపతాపాలతో, విమర్శలతో, వాదోపవాదాలతో ఇల్లు నరకంలా ఉంటే, ఆ ఇంట్లో ఎవ్వరూ ఎలాంటి పని చేయలేరు, ఎటువంటి విజయాన్ని పొందలేరు. పైగా ఆ బాధ వర్ణనాతీతం. నడుస్తున్నపుడు హఠాత్తుగా రాయి కాలిలో గ్రుచ్చుకుంటే కలిగే బాధ భరించలేనిది. అలాగే కంట్లో నలుసు పడినపుడు, చెవిలో జోరీగ చేసే రణగొణ ధ్వనులను ఎలా భరించలేమో, ఇంట్లో అంటే అంతరంగంలో (మనస్సు) ఇంద్రియాలు చేసే రగడను తట్టుకోలేము. అందువల్ల ఇంటిని (మనస్సు) ప్రశాంతంగా మలుచుకుంటే ఇహపరాలు మన వశమౌతాయి.

**తప్పులెన్నువారు తండోపతండంబు**
**లుర్వీజనులకెల్లనుండు తప్పు**
**తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు**
**విశ్వదాభిరామ వినురవేమ !**

లోకంలో ఎదుటివారి తప్పులను ఎత్తిచూపడం చాలా సులువు. తప్పు చేయడం మానవ సహజం. ఆ తప్పులను సరిదిద్దుకొని సక్రమ మార్గంలో నడిచే ప్రయత్నం మహాత్ములు, మనీషులు చేస్తారు. అంతేగాని ఎప్పుడు ఎదుటివారి తప్పులను వెదుకుతూ, తమ తప్పులను తెలుసుకోకుండా, తాము సర్వజ్ఞులమని, సౌశీల్యత కలవారమని అహంకారంతో విర్రవీగడం తగదు. ఎదుటివారిని ఒక వ్రేలుతో ఎత్తి చూపే ముందు (ముడిచి ఉన్న) మూడు వ్రేళ్ళు మనవైపే చూస్తాయి అన్న సత్యాన్ని సులభమైన రీతిలో వివరించారు. అంతేగాకుండా కేవలం తప్పులు ఎంచే స్వభావాన్ని కల్గి ఉండడం కూడదు. ఎందుకంటే మనం ఎదుటివారిలో తప్పులు ఎంచుతున్నపుడు, ఎదుటివారికి కూడా మన తప్పులు అలాగే అగుపిస్తాయి. కాబట్టి ఎదుటివారిలో తప్పులను సైతం ఒప్పులుగా, ఓర్పుతో గుర్తించి, వారిలో మార్పును తెచ్చే యత్నం చేయాలని కవి మనోగతం.

– సాధన నరసింహాచార్య

## పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

*"యుగశక్తి గాయత్రి" మాస పత్రికను సకాలములో నెలనెలా చందదారులందరికి అందజేయుటకు చేతనా కేంద్రము శక్తివంచన లేకుండా కృషిచేయుచున్నది. ఈ క్రింది కారణముల చేత పత్రికలు దాదాపుగా 0.3 నుండి 0.5 శాతము వరకు తిరిగి వచ్చుచున్నవి.*

*1. సరియైన చిరునామా లేనందువలన – పోస్టల్ పిన్‌కోడ్, ఇంటి నంబరు, వీధి పేరు, ల్యాండ్‌మార్కు వ్రాయనందున జరుగుచున్నవి.*

*2. ఇంటికి తాళము వేసి ఉంటే లెటర్‌బాక్సు సౌకర్యం ఉంటే బాగుంటుంది*

*3. గ్రామాలలో వ్యక్తి ఇంటి పేరు వ్రాయలేదని తిరిగివచ్చినవి. ఫోన్ నంబరుతో సహా పూర్తి పేరు, వివరములను గాయత్రీ కేంద్రానికి తెలుపవలెను.*

*4. చిరునామా సరిగా ఉన్నా, పోస్టుమ్యాన్ సేవాలోపము వలన బెంగుళూరు, గుంటూరు, హైద్రాబాద్‌లలో తిరిగి వచ్చినవి ఈ బాపతు. మీ పోస్టాఫీసులో ఈ విషయమై ఫిర్యాదు చేయగలరు.*

*5. పత్రిక రానప్పుడు చందాదారుడు సంబంధిత పోస్టాఫీసులో, ఫిర్యాదు చేయుట లేదు. తత్ఫలితముగా పోస్టుమ్యాన్ బాధ్యతారాహిత్యమువలన తిరిగివచ్చిన పత్రికలలో దాదాపు 50 నుండి 70 శాతము ఈ కోవకు చెందినవే. ఫిర్యాదు చేసిన చోట, చందాదారులకు పత్రిక సకాలములో అందజేయుట జరుగుచున్నది. కేవలము చేతన కేంద్రానికి ఫిర్యాదు చేసినందువలన పరిస్థితి చక్కబడదని సవినయంగా మనవి చేయుచున్నాము.*

*పై వానిని దృష్టిలోనుంచుకొని చందాదారులు తగినరీతిలో స్పందించి, చేతనా కేంద్రానికి చేయూత నందించవలసినదిగా ప్రార్థన.*

**ఇట్లు**
**సంపాదకులు**

**పిల్లలకు కష్టాలను ఎలా ఎదుర్కోవాలో నేర్పాలి.**

వార్తలు

# రాష్ట్రమంతటా జరిగిన వివిధ కార్యక్రమాలు

## చొప్పదండిలో

31.10.2010 న కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలోని సుగుణా సామిల్ ప్రాంగణంలో నవకుండీ గాయత్రీ మహాయజ్ఞమును జిల్లా కన్వీనర్ డా॥ పులి సత్యన్నారాయణ, నడిమెట్ల రాజేశం, శ్రీ సులువ గంగయ్యగార్లు నిర్వహించారు. యజ్ఞ కార్యక్రమంలో గాయత్రీ మంత్ర దీక్ష, వివిధ రకాల సంస్కారాలు నిర్వహించడమైనది. దాదాపుగా 150 మందికి మంత్ర లేఖన పుస్తకాలు పంచడం జరిగింది. సుమారు 300 మంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి దండె వెంకటేశం, పులి మధుకర్ తదితరులు సహకరించారు.

## వేములవాడలో

వేములవాడ శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో దేవీ నవరాత్రుల సందర్భంగా 08.10.2010 నుండి 16.10.2010 వరకు గాయత్రీ లఘు అనుష్ఠానం నిర్వహించబడింది.

16.10.2010 అనుష్ఠాన పూర్ణాహుతిగా జరిగిన పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞమును డా॥ పులి సత్యన్నారాయణ నిర్వహించారు. వేములవాడ పట్టణ సర్పంచి "నరాల సత్తమ్మ-పోశెట్టి" గార్లు పాల్గొన్నారు. సుమారు 120 మంది పాల్గొన్న ఈ కార్యక్రమానికి శ్రీ అడగట్ల హరి, పులి మధుకర్, లక్ష్మీ, నరేందర్, అంజవ్వ, మచ్చ కమల, ధనలక్ష్మి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు, సహకరించారు.

## అమలాపురంలో

12.10.2010 అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం గ్రామంలో దేవి నవరాత్రుల సందర్భంగా పంచకుండీ గాయత్రీ మహాయజ్ఞం కె.ఎన్.వి.నారాయణస్వామి ఆధ్వర్యంలో రామకృష్ణారావు, దుర్గ, కుమారి గార్లు నిర్వహించారు. సుమారు 100 మంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

12.10.2010 అమలాపురం మండలం, రంగాపురం గ్రామంలో దేవి నవరాత్రుల సందర్భంగా కనకదుర్గ ఆలయములో (చాకలిపేట) అక్కడ వున్న చాకలి కుటుంబాలందరు కలసి 24 కుండీల కార్యక్రమం శ్రీ ఎన్.ఆర్.కె.రాజుగారి ఆధ్వర్యంలో శ్రీమతి నాగమణి, సుభద్ర, సీతాకుమారిగార్లు నిర్వహించారు. సుమారు 150 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

16.10.2010 నల్లజర్ల మండలం కవులూరు గ్రామంలో నాగకనకదుర్గ ఆలయంలో త్రికుండి గాయత్రీ యజ్ఞం శ్రీ సూర్యకిశోర్ పర్యవేక్షణలో కె.నాగమణి, కుమారిగార్లు నిర్వహించారు. సుమారు 100 మంది పరిజనులు పాల్గొన్నారు.

17.10.2010 కాట్రేనికొన మండలం కాట్రేనికోన గ్రామంలో గాయత్రి శక్తి పీఠనందు చెయ్యేరు గ్రామస్థులు భక్తితో సమర్పించిన గాయత్రి మాతా పంచలోహ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ శ్రీ రామానందస్వామి ఆధ్వర్యంలో శ్రీ స్వామి, సుభద్ర, రాజు, కె.నాగమణి నిర్వహించారు.

17.10.2010 అమలాపురం గీతా ఆశ్రమమందు దేవి నవరాత్రుల పూర్ణాహుతిగా 54 కుండముల గాయత్రీ మహాయజ్ఞం శ్రీ రామానంద స్వామి ఆధ్వర్యంలో గాయత్రీ, సీతాకుమారి నిర్వహించారు.

17-09-2010 న **పెద్దమక్కెన గ్రామములో** లక్ష ఒత్తుల దీపాల ఐదువేల ప్రమిదలతో దీపయజ్ఞం కాకర్ల పరమేశ్వరరావు మరియు పెద్దమక్కెన గ్రామ భక్త బృందంచే శ్రీ టి.ఎస్.అంకారావు గారు నిర్వహించారు. 1500మంది పరిజనులు పాల్గొన్నారు.

04-12-2010 న 360 దీపాలతో **కాశిపాడులో** పిచ్చమ్మ, లక్ష్మమ్మ, సి.హెచ్.హనుమంతరెడ్డి, కుమారి గార్లతో సహకారంతో శ్రీ టి.ఎస్.అంకారావుగారు నిర్వహించారు.

06-12-2010 న **రెంటపాళ్ళలో** సాయిమందిరంనందు వీరయ్యచౌదరి, రాజా గార్ల ఆధ్వర్యంలో పంచకుండీయ గాయత్రీ యజ్ఞం, శ్రీ టి.ఎస్.అంకారావు గారు నిర్వహించారు. దీనిలో గురుదేవుల సాహిత్యం బాగా కొన్నారు.

ఆహ్వానము

**108 కుండముల గాయత్రీ మహా యజ్ఞం**

గుంటూరు జిల్లా, తెనాలి రూరల్ మండలం, కొలకలూరు గ్రామంలో 2011 జనవరి 28, 29, 30 తేదీలలో 108 కుండముల గాయత్రీ మహా యజ్ఞం నిర్వహించబడుతున్నది. ఈ కార్యక్రమ సాఫల్యం కొరకు గాయత్రీ పరిజనులు గాయత్రీ మంత్ర జపము చేసి ఈ క్రింది నంబర్లకు తెలియజేయకోరుచున్నాము. యజ్ఞ కార్యక్రమాలలో పాలు పంచుకోవలసినదిగా ఆహ్వానిస్తున్నాము.

**ఫోన్ : 9959136722, 9395142193, 9440414015**

ఆహారం మనస్సును నిర్మిస్తుంది.

అక్షరాల ఆట

# పదగాయత్రి-3

నిర్వహణ : సాధన నరసింహాచార్య

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | | 4 | 5 | X | 6 |
| 7 | | | X | 8 | | X | |
| 9 | | | X | 10 | | X | |
| 11 | | X | 12 | X | X | 13 | |
| X | X | | X | 14 | | | X |
| 15 | 16 | | | X | 17 | | X |
| X | 18 | | X | | | | 19 |
| 20 | | 21 | | 22 | 23 | X | X |

## పదగాయత్రి-2 సమాధానాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1 న | మ | స్కా | 2 ర | ము | X | 3 ప | డి |
| ర | X | X | వి | X | 4 సి | రి | X |
| 5 క | 6 ల | 7 ము | హ | X | X | 8 వా | సి |
| 9 చ | య | న | ము | X | త | 10 రం | X |
| 11 తు | ర | గ | X | 12 హ | X | X | 13 ప్ర |
| ర్ద | X | X | 14 హ | రి | ద్వా | ర | ము |
| 15 శి | 16 ర | 17 స్సు | X | వి | X | X | ఖు |
| X | 18 వి | క | రు | లు | X | 19 త్రే | లు |

పేరు : ..................................................

చిరునామా : ..................................................

..................................................

.......................... పిన్ కోడ్ : ..........................

ఫోన్ నెం : ..................................................

## ఆధారాలు

### అడ్డం

1. గురుదేవుల శతాబ్ది మొదలయ్యే రోజు (6)
7. చెదిరిన ఒక పర్వతం (3)
8. ఆ ..... ....... త, అసమానమైన (2)
9. కీర్తి (3)
10. అయోధ్య రామాలయానికై చేసిన సేవలోని మొదటి రెండు అక్షరాలు (అటు నుండి ఇటు) (2)
11. సంతోషానికి తుది మొదలు (2)
12. ప్రతి పనికీ మొదట్లో ఇది చుట్టాలి (1)
13. హితము (2)
14. అక్షరం లోపించిన ప్రథమ భక్తి (3)
15. ప్రవరుడు కాళ్ళకు రాసుకున్నదే (అటు ఇటూ అయ్యింది) (4)
17. ...... ...... మీసం మెలివేసే వీరుడు (అటు నుండి ఇటు) (2)
18. ...... ...... కారుడు శివుడు (2)
19. తిరగబడ్డ హద్దు (4)
20. జనవరిలో వచ్చే పెద్ద పండుగ (3)

### నిలువు

1. గుండ్రంగా ఉండేది (4)
2. సందేహం (అడ్డదిడ్డంగా) (4)
3. చీకటి (3)
4. నైపుణ్యం (3)
5. క్రింద నుండి సంపద (3)
6. దీపావళి రోజున వెలిగేవి (4)
13. మంచినికోరి (4)
16. బలపంతో కూడి ఉన్నది (3)
21. వేగమున (2)
22. 20 అడ్డంలోని కొంత భాగం (2)
23. 3 నిలువులోనిదే (4) (క్రిందనుండి)

**చిన్న సవరణ :** *నిలువు 3 ఆధారంలో "చివర లోపించిన" అన్న పదం అనవసరంగా ప్రచురించబడినది. అలాగే 17 నిలువు ఆధారంతో "కస్సు" అన్న సమాధానం వస్తుంది. (కోపించిన పాము కదా! అందువల్ల అలా తిరగబడింది). కల్గించిన ఇబ్బందికి క్షంతవ్యులం.*

*– సంపాదకులు*

**నిబంధనలు :**

*1. సమాధానాలు "కీ"తో సరిపోవాలి.*
*2. కూపన్లు చేరవలసిన చివరి తేది 18-01-2011*
*3. పత్రికలో పైన ఇచ్చిన కూపన్‌నే పంపవలెను.*
*4. దిద్దుబాట్లు / కొట్టివేతలు / తుడుపులు ఉండరాదు.*
*5. తెల్లకాగితాలు / జిరాక్స్ కాపీలు అనుమతించబడవు.*
*6. అన్ని కరెక్టు అయిన ఎంట్రీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నచో లాటరీ ద్వారా ఎంపికచేసి **ప్రథమ బహుమతి రూ.100/-లు, ద్వితీయ బహుమతి రూ.50/-లు** ఇవ్వబడును.*
*7. తపాలశాఖవారి ఆలస్యానికి పత్రిక బాధ్యత వహించదు.*
*8. బహుమతుల విషయంలో తుది నిర్ణయం సంపాదకులదే. ఎలాంటి వివాదాలకు తావులేదు.*
*9. పేరు, చిరునామాలు స్పష్టంగా, పిన్‌కోడ్‌తో ఫోన్‌నెంబరుతో సహా వ్రాయాలి.*

**పదగాయత్రి-2 విజేతలు**

ప్రథమ బహుమతి విజేత (రూ. 100/-) : **శ్రీమతి ఎ. ఉమాదేవి**, చీరాల

ద్వితీయ బహుమతి విజేత (రూ. 50/-) : **శ్రీమతి యు. నాగమణి**, ఈపురుపాలెం

త్వరలో విజేతలకి నగదు బహుమతిని యం.ఒ. ద్వారా పంపబడును

– సంపాదకులు

**ఎంట్రీలు పంపవలసిన చిరునామా**

**పదగాయత్రి C/o. యుగశక్తి గాయత్రి, అశ్విని హౌస్ ప్రక్కన, గాయత్రీ చేతనా కేంద్రం, మూసాపేట, హైదరాబాద్-18.**